


# ఈనాడు




కరీంనగర్ 19-8-2019 సోమవారం సిటీ సంపుటి 46 సంచిక 10

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 14+12 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

# కేసీఆర్‌ది రాచరికం

## మేం అధికారంలోకి వస్తాం • తెలంగాణ రూపురేఖలు మారుస్తాం

- పవిత్రమైన పేర్లతో ప్రాజెక్టుల్లో కేసీఆర్ దందా
- కాళేశ్వరాన్ని రూ.30 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెంచారు
- మిషన్ కాకతీయ కాదు మిషన్ ఫర్ కమీషన్
- భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డా వ్యాఖ్యలు
- కమలదళంలో చేరిన ఎంపీ గరికపాటి సహా తెదేపా శ్రేణులు, కాంగ్రెస్ నేతలు

ఈనాడు - హైదరాబాద్

"తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సహెన్షా (చక్రవర్తి)లాగా నేను, నా కుటుంబం అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. తెరాస ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడం లేదు. కాళేశ్వరం వంటి పవిత్రమైన పేర్లతో ప్రాజెక్టుల్లో దందా చేస్తున్నారు. అంచనా వ్యయాన్ని రూ.30 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెంచారు. మిషన్ కాకతీయ.. మిషన్ ఫర్ కమీషన్‌గా మార్చారు. ప్రాజెక్టుల్లో అవినీతి జరుగుతోంది" అని భారతీయ జనతాపార్టీ భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డా తీవ్రస్థాయిలో విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావుతో పాటు తెదేపాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, పలు జిల్లాల అధ్యక్షులు, పెద్దసంఖ్యలో ఆ పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్‌కు చెందిన కొందరు నేతలు నడ్డా సమక్షంలో ఆదివారం సాయంత్రం భాజపాలో చేరారు. ఈ సందర్భంగా 'నమో భారత్- నవ తెలంగాణ' పేరుతో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన సభకు నడ్డా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వాస్తు కోసం సచివాలయ భవనాలను కూల్చివేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధితో రాష్ట్రంలో రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిని అయిన తర్వాత దక్షిణ భారతదేశ ముఖద్వారం తెలంగాణకు రావడం ఎంతో సంతోషంగా ఉందంటూ.. తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

"నేను, నా కుటుంబం తప్ప మిగతావారెవ్వరూ అవసరం లేదన్నట్లు కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. ఆయనది రాచరిక ధోరణి. ఓ చేత్తో ఇచ్చి, మరో చేత్తో తీసుకోవడం ఆయన నైజం" అని నడ్డా విమర్శించారు. "అందరికీ నచ్చినవి కేసీఆర్‌కు నచ్చట్లేదు. ...మిగతా 2లో

> 'దేశంలోని 17 రాష్ట్రాల్లో భాజపా అధికారంలో ఉంది. ఆ సంఖ్యను పెంచుకుని 25 రాష్ట్రాల్లో పాగా వేస్తాం. అందులో తెలంగాణ కూడా ఉంటుంది. మేం వచ్చాక అభివృద్ధితో తెలంగాణ రూపురేఖలు మారుస్తాం'

> 'బమ్మెర పోతన, సమ్మక్క సారక్క, కుమురం భీం లాంటి మహనీయులు, పోరాటయోధులు, యాదాద్రి లాంటి పుణ్యక్షేత్రాల గడ్డ తెలంగాణ. ఈ గడ్డపై అడుగుపెట్టడం అదృష్టంగా భావిస్తున్నా. ఇది వీరభూమి. రజాకార్లకు వ్యతిరేకంగా 40 వేల మంది బలిదానం అయ్యారు. వీరికి, హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తంచేసిన సర్దార్ పటేల్‌కు ధన్యవాదాలు'
>
> - జె.పి.నడ్డా



జేపీ నడ్డా, గరికపాటి మోహన్‌రావు, కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావులను గజమాలతో సత్కరిస్తున్న నేతలు

## జల దరింపు...

### నింగికి ఎగిసింది



ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని ఇస్లావత్ తండా వద్ద భక్తరామదాసు ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ లీకవడంతో కృష్ణా జలాలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. పాలేరు జలాశయం వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా శనివారం ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మోటార్లు ప్రారంభించి సాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో ఇస్లావత్ తండా శివారు కేశతండాకు సమీపంలోని గేట్‌వాల్వ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఊడదీయడంతో నీరు ఎగిసిపడుతోంది. ...మిగతా 2లో

### నేలకు జారింది



హిమాచల్‌ప్రదేశ్‌లోని శిమ్లాలో ఆదివారం భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడడంతో రహదారిపై నుంచి పక్కకు జారి వేలాడుతున్న వాహనాలు

### ఉత్తరాదిపై కుంభవృష్టి

- 3 రాష్ట్రాలు అతలాకుతలం
- 25 మంది మృతి
- 8 మంది గల్లంతు
- హిమాచల్‌ప్రదేశ్‌లో మృత్యు చరియలు.. 11లో



# ప్రాణాధార వ్యవస్థపై అరుణ్‌జైట్లీ

- ఎయిమ్స్‌లో ఈసీఎంవోతో చికిత్స
- పలువురు నేతల పరామర్శ

దిల్లీ: దేశ రాజధానిలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న కేంద్ర మాజీ మంత్రి అరుణ్‌జైట్లీని ప్రాణాధార వ్యవస్థపై ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే డయాలిసిస్ చికిత్స అందిస్తున్న వైద్యుల బృందం ఆదివారం సాయంత్రం ఆయనను గుండె, శ్వాస వ్యవస్థలకు తోడ్పాటు అందించే ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఈసీఎంవో) వ్యవస్థపై ఉంచింది. శ్వాస సంబంధ ఇబ్బందులతో బాధ పడుతున్న అరుణ్ జైట్లీని ఈ నెల 9న ఎయిమ్స్‌లో చేర్పించిన సంగతి తెలిసిందే. జైట్లీ ఆరోగ్యానికి సంబంధించి 10వ తేదీ నుంచి ఎయిమ్స్ ఆరోగ్య బులెటిన్‌నూ విడుదల చేయలేదు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా కేంద్ర మంత్రులు స్మృతిఇరానీ, జితేందర్ సింగ్, హర్షవర్ధన్, అశ్వినీకుమార్ చౌబే, రాంవిలాస్ పాసవాన్, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ కల్‌రాజ్‌మిశ్ర, దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, భాజపా ఎంపీలు రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్, గౌతమ్ గంభీర్, ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్, సంయుక్త ప్రధాన ...మిగతా 2లో

### ఆరు నెలల్లోనే

# కరెంటు కష్టాలు గట్టెక్కాం

- రాష్ట్రంలో రోజుకు 20 వేల మెగావాట్ల సరఫరాకు అనుగుణంగా వ్యవస్థను మెరుగుపరిచాం
- దేశానికి సమగ్ర విద్యుత్ విధానం అవసరం
- విద్యుత్‌పై చర్చలో ముఖ్యమంత్రి కేసీఆర్
- కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుతం
- యావత్ దేశం నేడు దాని గురించే చెప్పుకొంటోంది
- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజీవ్‌శర్మ ప్రశంసలు



రాష్ట్రం ఏర్పడిన ఆర్నెల్లలో కరెంటు కష్టాలు అధిగమించాం. ఇప్పుడు అన్ని రంగాలకు నిరంతర(24 గంటలూ) సరఫరా చేస్తున్నాం. ఫలితంగా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. ఉపాధి పెరిగింది. కంపెనీల్లో మూడు షిఫ్టులు పనిచేస్తున్నారు. రాష్ట్ర ఆదాయం పెరిగింది.

- ముఖ్యమంత్రి కేసీఆర్

మూడున్నరేళ్ల క్రితం నేను హైదరాబాద్ వచ్చినప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా నిర్మిస్తారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం వివరించారు. అది సాధ్యమేనా అని అప్పుడు ఆశ్చర్యపోయాను. నిన్న నేను కాళేశ్వరాన్ని కళ్లారా చూశాను. గోదావరి నీటి ఎత్తిపోతల అద్భుతం. మూడున్నరేళ్ల క్రితం సీఎం నాకు ఏం చెప్పారో అది కళ్లముందు కనిపించింది. ఇలాంటి ప్రాజెక్టును ఇంత త్వరగా నిర్మించడం మాటలు చెప్పినంత తేలిక కాదు. కేసీఆర్ కృషి ఫలించింది. కల నెరవేరింది. నేడు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి యావత్ దేశం చెప్పుకొంటోంది. అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో కూడా కాళేశ్వరం విజయగాథను ప్రదర్శిస్తున్నారు

- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజీవ్‌శర్మ



వివరాలు 2లో

# పెళ్లి వేడుకపై ఉగ్రపంజా

- కాబూల్‌లో 63 మంది మృతి, 182 మందికి గాయాలు 11లో

# చర్చలు జరిగితే అవి పీవోకే పైనే

పాక్‌కు రాజ్‌నాథ్ స్పష్టీకరణ 11లో

# పైరుకు చినుకు బెంగ!

- ఈ నెల 9 వరకూ విస్తారంగా వర్షాలు
- పది రోజులుగా పెరిగిన వర్షాభావం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అధిక వర్షాలు, వరదలతో పంటలు చాలావరకూ కోలుకున్నాయి. నదుల్లో పుష్కలంగా వరద వస్తుండడంతో రిజర్వాయర్లన్నీ నిండాయి. చెరువులు సహా నీటి వనరులు నిండిన ప్రాంతాల్లో పంటలకు ఇక ఢోకాలేనట్టే. అయితే రాష్ట్రంలో గత పది రోజులుగా వర్షాలు తగ్గిపోయాయి. మరో వారం రోజులు వర్షాలు లేకపోతే వర్షాధార భూముల్లో దిగుబడులపై ప్రభావం పడుతుందని జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ ఆరంభం నుంచి తొలుత వర్షాభావం, ఆనక అధిక వర్షాలతో సాగుపై ప్రభావం పడింది. జూన్ 1 నుంచి ఈ నెల 16 వరకూ కురిసిన వర్షాలను పరిశీలిస్తే.. 9 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 నుంచి 47% వరకుంది.

### 34.48 లక్షల హెక్టార్లలో పంటలు

- మొత్తం సాగు విస్తీర్ణం 43.34 లక్షల హెక్టార్లు కాగా.. 34.48 లక్షల హెక్టార్లలో (80 శాతం) ఖరీఫ్ పంటలు వేశారని వ్యవసాయశాఖ తాజా నివేదికలో ప్రభుత్వానికి తెలిపింది. గతేడాది ఇదే సమయానికి 36.29 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. ఈసారి జూన్, జులైలో వర్షాలు లేనందున సాగు విస్తీర్ణం తక్కువగా ఉంది. పత్తి, రాగి పంటలు మాత్రమే వంద శాతానికి మించి సాగు చేశారు.
- పప్పుధాన్యాలు 16 శాతం, నూనెగింజల పంటలు సాధారణంకన్నా 25 శాతం తక్కువగా సాగయ్యాయి.
- ఆహార పంటల సాగు ఇప్పటి వరకూ 31 శాతం తక్కువగా ఉంది. వరి సాధారణ విస్తీర్ణంలో 62% నాట్లు వేశారు.
- జిల్లాల వారీగా చూస్తే కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్, నిర్మల్‌లో మాత్రమే వంద శాతానికి మించి సాగు విస్తీర్ణంలో

...మిగతా 2లో

**ఖరీఫ్ పంటల సాగు (వేల హెక్టార్లు)**

| పంట | సాధారణ విస్తీర్ణం | సాగైంది |
|---|---|---|
| వరి | 964 | 594 |
| పత్తి | 1724 | 1739 |
| వేరుసెనగ | 17 | 6.5 |
| సోయాచిక్కుడు | 210 | 171 |
| కంది | 291 | 267 |
| మొక్కజొన్న | 501 | 348 |
| పప్పుధాన్యాలు | 414 | 350 |
| నూనెగింజలు | 277 | 207 |
| ఆహారధాన్యాలు | 1930 | 1335 |

- రాష్ట్రంలో 46,764 చెరువులున్నాయి. వీటిలో 26,196 చెరువుల్లో 25 శాతం లోపే నీరు చేరింది




# ఇదీ సంగతి!




కాంగ్రెస్, జేడీఎస్ రెబెల్స్‌కూ మన మద్దతుదార్లకూ, మనం కొనితెచ్చిన వారికే మంత్రి పదవులు సరిపోవట్లేదు... పార్టీ వాళ్లు ఒక్క పదవిని కూడా ఆశించవద్దు. ముందే చెబుతున్నా!

# సీయే.. మోజు తగ్గిపాయె!

- ఫౌండేషన్ కోర్సుకు 2012-13లో నమోదు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 1,61,084
- 2017-18లో ఈ సంఖ్య 73,804 మాత్రమే
- తెలుగు రాష్ట్రాల్లో అధిక శాతం తగ్గుదల!
- నిబంధనల మార్పూ ఓ కారణం అంటున్న నిపుణులు



ఛార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సు పూర్తి చేయడం కష్టమే కానీ.. పూర్తయితే జీవితాంతం ఆదాయమే.

మన దేశంలోనే 5 లక్షల మంది సీఏల కొరత ఉంది. దుబాయి, సింగపూర్ వంటి దేశాల్లోనూ మన సీఏలకు డిమాండ్ ఉంది.

అయినా ఈ కోర్సుపై క్రమేణా విద్యార్థులు ఆసక్తి చూపడంలేదని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గణాంకాలు చెబుతున్నాయి.

ఈ అనాసక్తికి కారణాలేంటి? పూర్తి కథనం 5లో

**సీఏలో విద్యార్థుల రిజిస్ట్రేషన్ల సంఖ్య ఇలా**

| సంవత్సరం | సీపీటీ/ఫౌండేషన్ | ★ మొత్తం |
|---|---|---|
| 2012-13 | 1,61,084 | 3,11,207 |
| 2013-14 | 1,54,742 | 2,93,584 |
| 2014-15 | 1,41,241 | 2,45,642 |
| 2015-16 | 1,25,140 | 2,36,020 |
| 2016-17 | 1,07,392 | 2,18,319 |
| 2017-18 | 73,804 | 2,10,289 |

★ ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ కలిపి

TG




'నమో భారత్– నవ తెలంగాణ' సభలో ప్రసంగిస్తున్న భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా. వేదికపై పార్టీ నేతలు ఇంద్రసేనారెడ్డి, సుజనాచౌదరి, వివేక్, దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, మురళీధర్‌రావు, పెద్దిరెడ్డి, డీకే అరుణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు ● రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావును భాజపాలోకి ఆహ్వానిస్తున్న జేపీ నడ్డా

# విమోచన దినోత్సవాన్ని గట్టిగా చేయండి

- కష్టపడి పనిచేస్తే అధికారం మనదే
- కోర్‌కమిటీ, పదాధికారుల సమావేశాల్లో జేపీ నడ్డా

ఈనాడు, హైదరాబాద్: "తెలంగాణలో కష్టపడి పనిచేస్తే రానున్న ఎన్నికల్లో కాషాయజెండా ఎగరేయడం ఖాయం. కార్యక్రమం ఏదైనా పోలింగ్ బూత్ స్థాయి నుంచి చేపట్టండి. తెరాస సర్కారుపై పోరాటాలు చేయండి" అంటూ రాష్ట్ర ముఖ్యనేతలకు భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డా దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలతో సీఎం కేసీఆర్‌కు గుణపాఠం చెబుదాం అని పిలుపునిచ్చారు. బహిరంగ సభ ముగిసిన తర్వాత పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాత్రి కోర్ కమిటీ భేటీ జరిగింది. సభకు ముందు పదాధికారుల సమావేశంలోనూ ఆయన మాట్లాడారు. "సెప్టెంబరు 17న విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా గట్టిగా చేయండి. వారంరోజుల పాటు కార్యక్రమాలు ఉండాలి" అని సూచించినట్లు సమాచారం. రాష్ట్రంలో అవినీతిపై న్యాయపోరాటం చేయాలని, ఆర్టికల్ 370 రద్దు అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నడ్డా చెప్పినట్లు తెలిసింది. "సీనియర్ నేతల్లో కొన్ని అనుకూలతలతో పాటు లోపాలున్నాయి. కొందరు పూర్తి ప్రయత్నాలు చేయడం లేదు. కార్యకర్తల్ని పెంచడం లేదు" అంటూ ఘాటైన వ్యాఖ్య కూడా చేసినట్లు సమాచారం. పార్టీ సంస్థాగత ఎన్నికల షెడ్యూల్‌ను నడ్డా సమావేశంలో వివరించారు. "అక్టోబరు 11 నుంచి 31 వరకు మండల కమిటీలు.. నవంబరు 11-30 వరకు జిల్లా కమిటీలు.. డిసెంబరు 1-15 వరకు రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరగాలి" అని తెలిపారు. ఈ సమావేశాల్లో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎంపీలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

జె.పి.నడ్డా ఆదివారం రాత్రి ఆరెస్సెస్ నేతలతో సమావేశమయ్యారు. లక్ష్మణ్‌తో కలిసి బర్కత్‌పురలోని ఆరెస్సెస్ కార్యాలయానికి వెళ్లారు. ఆరెస్సెస్ దక్షిణాది రాష్ట్రాల బాధ్యుడితో దాదాపు 30 నిమిషాల పాటు సమావేశం అయ్యారు. అనంతరం నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి రాత్రి అక్కడే నిద్రించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నడ్డా పాల్గొంటారు.

# కేసీఆర్‌ది రాచరికం

(మొదటి పేజీ తరువాయి)

ఆయుష్మాన్ భారత్.. ప్రపంచంలో అతిపెద్ద ఆరోగ్య పథకం. తెలంగాణలో 26 లక్షల కుటుంబాలకు లబ్ధి కలిగే ఈ పథకం అమలుకు కేసీఆర్ ప్రభుత్వం అంగీకరించలేదు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అయినా సక్రమంగా అమలుచేయట్లేదు. రూ.వందల కోట్ల బకాయిలు ఉండటంతో ఆసుపత్రుల యాజమాన్యాలు చికిత్సకు నిరాకరిస్తున్నాయి. చట్టంలో లేకపోయినా తెలంగాణకు ఎయిమ్స్ ఇచ్చాం. ప్రధాని మోదీకి ఇచ్చే మనసున్నా.. సీఎం కేసీఆర్‌కు తీసుకునే మనసులేదు" అంటూ విమర్శలు గుప్పించారు. "మిషన్ భగీరథతో సరిగా నీళ్లివ్వలేకపోతున్నారు. హరితహారంలోనూ రూ.కోట్లు ఖర్చుచేస్తున్నా పచ్చదనం పెరగడం లేదు. మంత్రివర్గంలో మహిళలకు, ఎస్టీలకు చోటులేదు. దళితుడిని సీఎంను చేస్తానన్న హామీని నిలబెట్టుకోలేదు" అని నడ్డా దుయ్యబట్టారు.

### కాంగ్రెస్ నేతలను నిలదీయాలి

"ఆర్టికల్ 370 రద్దు మోదీ ప్రభుత్వ సాహసోపేత నిర్ణయం. ఒకే దేశం.. ఒకే రాజ్యాంగం కలను సాకారం చేశారు. కాంగ్రెస్‌కు దేశప్రయోజనాలు పట్టవు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించిన కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీయాలి" అని నడ్డా పిలుపునిచ్చారు. ప్రసంగం అనంతరం పార్టీలో చేరిన నేతలకు నడ్డా భాజపా కండువాలు కప్పారు. భాజపాలో చేరిన నేతలకు ప్రాధాన్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో భాజపా అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్, తెదేపాల నుంచే కాదు.. తెరాస నుంచీ భాజపాలోకి వస్తున్నారంటూ అందుకు కారణం.. కేసీఆర్ నియంతృత్వ ధోరణే అన్నారు.

### కల్వకుంట్ల కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి: లక్ష్మణ్

తెరాస ప్రభుత్వానికి సమాధి కట్టడానికి ముందుకు వచ్చే వారందరినీ భాజపా స్వాగతిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. తెరాస కాంగ్రెస్‌తో కలిసి లాలూచీ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలు, కల్వకుంట్ల కుటుంబ పాలనను అంతమొందించేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మతోన్మాద రాజకీయాలు, ఎంఐఎం అజెండాను అమలు చేసే తెరాసను అడ్డుకునే దమ్ము, సత్తా భాజపాకు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు తెలంగాణలో మిగులు బడ్జెట్‌గా ఉండేదని, ఉమ్మడి రాష్ట్రంలో 15 మంది ముఖ్యమంత్రుల కంటే కేసీఆర్ ఒక్కడే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులను పక్కన బెట్టి.. రాయలసీమను రతనాల సీమ చేస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై రాష్ట్రపతి వివరణ అడిగితే.. భాజపా వాళ్లు రాజకీయం చేస్తున్నారని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 'తండ్రీ కొడుకుల పార్టీ తెరాస.. తల్లి, కొడుకుల పార్టీ కాంగ్రెస్.. భరతమాత ముద్దుబిడ్డల పార్టీ భాజపా' అని లక్ష్మణ్ అన్నారు.

### కేసీఆర్ నిరాశలో ఉన్నారు: దత్తాత్రేయ

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల్లో తెరాస కోల్పోతున్న ప్రజాదరణను చూసి నిరాశ, నిస్పృహలో ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మునిగిపోయిన నావ అని, ఆ పార్టీకి ఎజెండా, పోరాడే సత్తా లేవని విమర్శించారు. తెరాసకు పూర్తి ప్రత్యామ్నాయం భాజపా ఒక్కటే అన్న భావన ప్రజల్లో రావడం ఆనందంగా ఉందన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, భాజపా నాయకులు మురళీధర్‌రావు, వివేక్, జితేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రాంచందర్‌రావు, డీకే అరుణ, సత్యకుమార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎండల లక్ష్మీనారాయణ, రాజేశ్వర్‌రావు, విజయరామారావు, చంద్రశేఖర్, బోడ జనార్దన్, చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, పెద్దిరెడ్డి, చింతా సాంబమూర్తి, ప్రేమేందర్‌రెడ్డి ఏపీ నేతలు సుజనాచౌదరి, సీఎం రమేశ్ తదితరులు సభలో పాల్గొన్నారు.

### ప్రసంగానికి ముందే వేదిక దిగిన ఎంపీలు

ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, సోయం బాబురావులు నడ్డా ప్రసంగానికి ముందే వేదిక దిగిపోయారు. ఈ విషయాన్ని వారితో ప్రస్తావించగా వేదికపై స్థలం లేకపోవడం వల్లే కిందికి దిగినట్లు పేర్కొన్నారు.

### భాజపాలో చేరింది వీరే..

మాజీ మంత్రి జగన్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఎర్రశేఖర్, ఊకె అబ్బయ్య, విజయపాల్‌రెడ్డి, వీరితో పాటు కోనేరు చిన్ని, రాజవర్ధన్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, ఇ.మల్లేశం, శ్రీకాంత్‌గౌడ్, ముప్పా సత్యనారాయణ, సామ రంగారెడ్డి, అంజయ్య యాదవ్, దీపక్‌రెడ్డి, శ్రీకళారెడ్డి, శ్రీనివాసరావు, డాక్టర్ రవి, సరోత్తంరెడ్డి, బండ్రు శోభారాణి, పి.రజనీకుమారి, బాల వినోద్, పుల్లారావు తదితరులతో పాటు రెండువందల మందికి పైగా భాజపాలో చేరారు.

### భాజపా జెండా ఎగరేస్తాం: గరికపాటి మోహన్‌రావు

గోల్కొండ కోట మీద.. తెలంగాణ గడ్డ మీద.. భాజపా జెండా ఎగురేస్తాం అని రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. సభలో ఆయన ప్రసంగిస్తూ కొత్తగూడెం, వరంగల్ నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు వస్తుంటే అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారన్నారు. భారత సైన్యం ఎంత గొప్పదో భాజపా సైన్యం అంత గొప్పదని అభివర్ణించారు. తెలంగాణ తెదేపాలో ఇప్పుడు ఎవరూ లేరని.. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు చేరిన వాళ్లంతా ఎప్పుడో వెళ్లిపోయారన్నారు. అలాంటి వాళ్లలో పార్టీ నుంచి వచ్చిన చివరి వ్యక్తిని నేనే అనుకుంటున్నానని చెప్పారు. ఎన్టీఆర్ మీదున్న అభిమానం మేరకు తెదేపాలో చేరి, అనేక పదవులు అనుభవించిన తాను.. 38 సంవత్సరాలు పనిచేసిన తల్లిలాంటి పార్టీని వీడటం బాధగా ఉందంటూ భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం బాగుండాలని కోరుకుంటున్నానన్నారు. చంద్రబాబును నిందించాలనుకోవడం లేదని, ఆయనంటే ఎప్పటికీ గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు.

### పదవుల కోసం చేరలేదు..

కష్టకాలంలోనూ చంద్రబాబు వెంట ఉండి, ఆయన ఏపీ ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేశానని గరికపాటి అన్నారు. కష్టకాలంలో తెదేపాకు అండగా నిలబడింది తెలంగాణ తమ్ముళ్లేనని, బాబ్లీ కోసం వీపులు పగలగొట్టుకుంది కూడా మనవాళ్లేనని గుర్తుచేశారు. తెదేపాలో నష్టపోయిన నేతలకు భాజపాలో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తెదేపాలో కష్టపడిన దానికంటే ఎక్కువ కష్టపడి తెలంగాణ గడ్డమీద, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నూటికి నూరుశాతం భాజపా జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రాణాధార వ్యవస్థపై అరుణ్‌జైట్లీ

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి డా.కృష్ణగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ మాజీ నేత అమర్‌సింగ్ తదితరులు ఆదివారం ఎయిమ్స్‌కు వచ్చి జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పటికే ఎయిమ్స్‌కు వెళ్లి పరామర్శించి వచ్చిన సంగతి తెలిసిందే.

# నాలుగు రోజులు తేలికపాటి వర్షాలు

ఈనాడు, హైదరాబాద్, రామగుండం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సోమవారం నుంచి నాలుగు రోజులు తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉన్నాయి. ఆదివారం పగలు 374 ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. 11 చోట్ల భారీ వర్షాలు పడ్డాయి. అత్యధికంగా బెల్లంపల్లిలో 110.5, మల్యాలలో 92.3, రామగుండంలో 90.3, రఘునాథపల్లిలో 85.8, తొర్రూరులో 80.5, రవీంద్రనగర్‌లో 77.5, శ్రీరాంపూర్‌లో 74, కనుకులలో 68.3 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. భారీ వర్షానికి పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణంలోని జెన్‌కో ఎ-కాలనీ, పాతబజార్, డెయిలీ మార్కెట్, సబ్-స్టేషన్ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. గోదావరిఖని, ఎన్టీపీసీ ప్రాంతాల్లో సైతం లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది.

# కరెంటు కష్టాలు గట్టెక్కాం

- విద్యుత్‌పై చర్చలో ముఖ్యమంత్రి కేసీఆర్



పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజీవ్‌శర్మను సన్మానిస్తున్న కేసీఆర్. పక్కన జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, సీఎం పీఆర్వో విజయ్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: అన్ని రంగాలకు నిరంతర సరఫరా చేయాలనే లక్ష్యంతో దేశానికి సమగ్ర విద్యుత్ విధానం రావాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రస్తుతం స్థాపిత ఉత్పత్తి సామర్థ్యంలో సగమైనా వాడటం లేదని.. దేశంలోని పలు ప్రాంతాలు ఇంకా చీకటిలోనే మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. జాతీయ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) ఛైర్మన్ రాజీవ్‌శర్మ ఆదివారం ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా సీఎంను కలిశారు. ఈ సందర్భంగా దేశంలో విద్యుత్ రంగంపై చర్చ జరిగింది. రాష్ట్రంలో మూడు రోజులపాటు పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టును, విద్యుత్కేంద్రాలను సందర్శించిన రాజీవ్‌శర్మతోపాటు జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, సీఎస్ ఎస్‌కే జోషి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తీవ్రమైన విద్యుత్ సంక్షోభం ఉంది. దాన్ని పరిష్కరించనిదే ప్రగతి సాధ్యం కాదని భావించి చర్యలు చేపట్టాం. కరెంటు సరఫరా, పంపిణీ వ్యవస్థలను మెరుగుపరిచాం. రోజుకు 20 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అనుగుణంగా సరఫరా వ్యవస్థ ఏర్పడింది. రాష్ట్రంలో కొత్త విద్యుత్కేంద్రాల నిర్మాణం, పంపిణీ వ్యవస్థల మెరుగు పనులకు పీఎఫ్‌సీ అందించిన ఆర్థిక సహకారం ఎంతో ఉపయోగపడింది. నీటి పారుదల ప్రాజెక్టులకు కూడా రుణ సాయం చేసినందుకు రాజీవ్‌శర్మకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.

### పీఎఫ్‌సీకి గర్వకారణం: రాజీవ్‌శర్మ

తెలంగాణలో దార్శనిక సీఎం కేసీఆర్ రికార్డు సమయంలో విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నారని రాజీవ్‌శర్మ ప్రశంసించారు. "ప్రాజెక్టులు ఇంత వేగంగా పూర్తవడం దేశంలో మరెక్కడా చూడలేదు. అనుమతులు పొందడం, నిధులు, భూసేకరణ, ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు తదితర పనులు ఆలస్యం అవుతుండటం సహజం. కానీ, తెలంగాణలో ఇలాంటివన్నీ అధిగమించి శరవేగంగా ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. వీటికి మేం అందించిన ఆర్థిక సాయం నూటికి నూరుపాళ్లు సద్వినియోగం కావడం సంతోషంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావడం మా సంస్థకు ఎంతో గర్వకారణం, గౌరవంగా ఉంది" అని రాజీవ్‌శర్మ అభినందించారు. ఈ సందర్భంగా రాజీవ్‌శర్మ దంపతులను సీఎం సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

### ప్రభాకర్‌రావుకు ప్రశంసలు

రాష్ట్ర విద్యుత్ రంగం సాధించిన విజయాల వెనుక జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు కృషి ఉందని సీఎంతోపాటు రాజీవ్‌శర్మ, ఎస్‌కే జోషి ప్రశంసించారు. ఈ రంగంలో ఎంతో అనుభవం ఉన్న ప్రభాకర్‌రావు తమకు ఆదర్శమని ఆయన నాయకత్వంలో తెలంగాణ విద్యుత్‌రంగం ఎంతో ప్రగతి సాధించిందని రాజీవ్‌శర్మ కొనియాడారు. 50 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ప్రభాకర్‌రావు విద్యుత్ రంగ భీష్మాచార్యులుగా జోషి అభివర్ణించారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం వల్లే మంచి ఫలితాలు వచ్చాయని ప్రభాకర్‌రావు చెప్పారు.

### రేపు, ఎల్లుండి కలెక్టర్లతో సీఎం సమావేశం

రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం అమలు చేయాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి కేసీఆర్ దీని అమలులో కలెక్టర్లు కీలకమని భావిస్తున్నారు. ఇందుకోసం మంగళ, బుధవారాల్లో ప్రగతిభవన్‌లో వారితో సమావేశం కానున్నారు. మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, అన్ని శాఖల ఉన్నతాధికారులు ఇందులో పాల్గొంటారు. కొత్త రెవెన్యూ చట్టం అమలుపై క్షేత్ర స్థాయిలో భూపరిపాలనలో ప్రత్యక్ష సంబంధం కలిగిన కలెక్టర్ల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ చట్టంలో ఎలాంటి నిబంధనలు రూపొందించాలనే అంశంపై విస్తృతంగా చర్చిస్తారు. కొత్త పురపాలక చట్టం, కొత్త పంచాయతీరాజ్ చట్టం అమలుపైనా కలెక్టర్లకు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. కొత్త చట్టాలను అనుసరించి పల్లెలు, పట్టణాల్లో అమలు చేయబోయే 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై కూడా చర్చిస్తారు. వీటిపై సమగ్రమైన చర్చ జరగాల్సి ఉన్నందున సమావేశం రెండురోజుల పాటు జరపాలని సీఎం నిర్ణయించారు.

# నింగికి ఎగిసింది

(మొదటి పేజీ తరువాయి)

ఈ నీరంతా పక్కనే అందుబాటులో ఉన్న సుబ్లేడు చెరువుకు చేరుతోంది. ఈ విషయమై డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కావాలనే దగ్గరలోని స్థానికులు ఇలా చేస్తున్నారని తెలిపారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సోమవారం గేట్‌వాల్వ్‌కుమరమ్మతులు చేపడతామని చెప్పారు.

–న్యూస్‌టుడే, తిరుమలాయపాలెం




**అదే పెద్ద హింస!**

వాస్తవంగా మాంసం తినే వ్యక్తి కంటే మరొకరిని మాంసం తినొద్దని బలవంతపెట్టి నిర్బంధాలు విధించే వ్యక్తే ఎక్కువ హింసకు పాల్పడినట్లు!

– మహాత్మా గాంధీ

# పైరుకు చినుకు బెంగ!

(మొదటి పేజీ తరువాయి)

పంటలు వేశారు.

- 12 జిల్లాల్లో సాగు విస్తీర్ణం.. సాధారణంలో 51 నుంచి 75 శాతం వరకే ఉంది.
- రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు పుష్కలంగా చేరుతున్నా, పలు పంటల సాగు సమయం పూర్తయినందున సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

### నల్గొండలో 47 శాతం లోటు వర్షపాతం

- దేశంలో 683 జిల్లాలకు గాను 262 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 శాతానికి మించి ఉంది. ఇందులో తెలంగాణలో జిల్లాలు 9 ఉన్నాయి. అత్యధికంగా నల్గొండలో 47 శాతం, జోగులాంబ గద్వాల జిల్లాలో 38 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రంల్లో 10 జిల్లాల్లో మాత్రమే వంద శాతానికి మించి వర్షాలు కురిశాయి. మిగిలిన 14 జిల్లాల్లో వర్షపాతం లోటు 1 నుంచి 19 శాతం వరకూ ఉంది. లోటు 19 శాతం వరకూ ఉన్నా సాధారణ వర్షపాతం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటిస్తుంది.
- ఈ నెల 8 నుంచి ఇప్పటివరకూ 7 రాష్ట్రాల్లో వర్షాలు తగ్గిపోగా, ఇందులో 2 తెలుగు రాష్ట్రాలు ఉన్నాయి. విదర్భ నుంచి తెలంగాణ, కోస్తాంధ్రలో వర్షాలు తగ్గినట్లు వాతావరణ శాఖ తెలిపింది. వీటికి చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో అధికంగా కురుస్తుండటం గమనార్హం.
- గత వారం రోజులుగా వర్షాలు లేని ప్రాంతాల్లో.. పత్తి, మొక్కజొన్న, కంది, జొన్న, సోయాచిక్కుడుపై ప్రభావం పడుతోంది.
- కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా బీచుపల్లిలో శుక్రవారం 35.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణంకన్నా 5 డిగ్రీలు అధికం. ఖమ్మంలోనూ సాధారణం కన్నా 3.2 డిగ్రీలు అధికంగా ఉంది. వర్షాలు లేకపోవడానికి తోడు అధిక ఉష్ణోగ్రతల వల్ల బెట్ట పరిస్థితులేర్పడి పంటలపై తెగుళ్లు, పురుగులు వ్యాపిస్తున్నాయి.



### తెగుళ్లు, పురుగుల దాడి

– డాక్టర్ జగదీశ్వర్, పరిశోధన సంచాలకులు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ప్రస్తుతం వర్షాలు తగ్గినందున బెట్ట పరిస్థితులు ఏర్పడి పంటలను రసం పీల్చే పురుగులు, తామర, నల్లి జాతి కీటకాలు ఆశిస్తున్నాయి. వర్షాలు అధికంగా పడిన ప్రాంతాల్లో కలుపు బాగా పెరిగి పైర్లు ఎదగడం లేదని పరిశీలనలో గుర్తించాం. రైతులు ఈ సమస్యల నివారణకు తక్షణం చర్యలు తీసుకోవాలి. మొక్కజొన్నపై కత్తెర పురుగు, పత్తిపై గులాబీ రంగు పురుగు వ్యాపిస్తున్నాయి.

# ఇంటి నుంచే బోధన.. పరిశోధన!

- హెచ్‌సీయూలో ప్రపంచస్థాయి ఈ-లెర్నింగ్ కేంద్రం
- 3500-4000 కోర్సులు అందించేందుకు కసరత్తు

**ప్రతిష్ఠాత్మక శ్రేష్ఠతర హోదా దక్కించుకున్న హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) ప్రపంచస్థాయి ఈ-లెర్నింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. డిజిటల్ లెర్నింగ్ స్టడీస్ అండ్ ట్రైనింగ్ రిసోర్సెస్ సెంటర్ పేరిట ఇందుకు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి పూర్తి నివేదికను కేంద్ర మానవ వనరుల శాఖకు సమర్పించింది. అక్కడి నుంచి ఆమోదం రాగానే కార్యకలాపాలు విస్తృతం కానున్నాయి.**



ఆచార్యుల బోధించే పాఠాలను రికార్డు చేసే గ్రీన్‌మ్యాట్ స్టూడియో

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌సీయూ ప్రారంభించనున్న ఈ లెర్నింగ్ కేంద్రం కేవలం ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేందుకు పరిమితం కాకుండా పరిశోధన రంగానికి పెద్దపీట వేయనుంది. 3500-4000 కోర్సులను ఆన్‌లైన్ విధానంలో అందించాలనే భారీ క్రతువుకు వర్సిటీ కసరత్తు చేస్తోంది. వర్సిటీలు అందించే కోర్సుల్లో 20శాతం ఆన్‌లైన్ చేయాలన్న సూచనలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఉపకులపతి ప్రొ.పొదిలె అప్పారావు వివరించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా రెండున్నరేళ్ల కిందట ఈ-లెర్నింగ్ కేంద్రాన్ని ప్రారంభించింది. వర్సిటీలోని 12 విభాగాల(స్కూల్స్)కు చెందిన వంద మంది ఆచార్యులకు ఈ-లెర్నింగ్ విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. వారిలో 25 మందిని ఎంపిక చేసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై శిక్షణ అందించారు. ఇప్పటికే 20 మంది ఈ-లెర్నింగ్ విధానం ద్వారా బోధన అందిస్తుండగా 700 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు.

### ప్రత్యేకంగా స్టూడియో నిర్వహణ

ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి పాఠాలు రికార్డు చేసేందుకు ప్రత్యేకంగా గ్రీన్‌మ్యాట్ స్టూడియోను ఏర్పాటు చేశారు. ఆచార్యుల బోధించే పాఠాలను రికార్డు చేసి విద్యార్థులకు అందిస్తారు. నాణ్యతకు పెద్దపీట వేసేలా ప్రత్యేకంగా టూల్‌కిట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. భవిష్యత్తులో ఏదైనా విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ కోర్సు రూపకల్పనకు ఇది ఉపయోగపడుతుందని ఈ-లెర్నింగ్ సెంటర్ సంచాలకుడు జంధ్యాల ప్రభాకరరావు వివరించారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సులను అందించేలా ఇ-ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### జాతీయ, అంతర్జాతీయస్థాయి సంస్థలతో భాగస్వామ్యం

ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ సంస్థలతో హెచ్‌సీయూ భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. రానున్న ఆరు నెలల్లో పలు కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా కోర్సులను రూపకల్పన చేసింది.

# గ్రహం అనుగ్రహం

19–8–2019 సోమవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
చవితి: రా. 11-49 తదుపరి పంచమి
ఉత్తరాభాద్ర నక్షత్రం: సా. 5-46 తదుపరి రేవతి
అమృత ఘడియలు: మ. 12-29 నుంచి 2-14 వరకు
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: మ. 12-28 నుంచి 1-19 వరకు తిరిగి 2-59 నుంచి 3-50 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5-46; సూర్యాస్తమయం: సా.6.21
సంకష్టహర జయంతి

# వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 35.0 | 25.5 |
| విజయవాడ | 34.6 | 26.0 |
| అనంతపురం | 34.3 | 24.5 |
| ఆదిలాబాద్ | 33.3 | 25.2 |
| విశాఖపట్నం | 32.6 | 26.8 |
| ఖమ్మం | 32.0 | 28.0 |
| సూర్యాపేట | 32.0 | 27.0 |
| మహబూబ్‌నగర్ | 31.0 | 24.5 |
| నల్గొండ | 31.0 | 23.0 |
| గుంటూరు | 30.2 | 26.1 |
| నిజామాబాద్ | 30.0 | 25.8 |
| కరీంనగర్ | 30.0 | 23.0 |
| హన్మకొండ | 29.5 | 25.7 |
| రామగుండం | 29.4 | 26.8 |
| హైదరాబాద్ | 29.4 | 25.8 |
| తిరుపతి | 27.6 | 26.4 |
| మెదక్ | 27.3 | 23.0 |

## సోమేశ్‌కుమార్‌కు రెవెన్యూ శాఖ

- మరికొన్ని అదనపు బాధ్యతలు కూడా అప్పగింత
- అటవీ శాఖకు రాజేశ్వర్‌తివారి బదిలీ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌గా రఘునందన్‌రావు
- నీతుకుమారి ప్రసాద్‌కి స్థానచలనం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారిని అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుతం ఆబ్కారీ, వాణిజ్య పన్నుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సోమేశ్‌కుమార్‌కు రెవెన్యూ శాఖను అప్పగించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు కూడా ఆయనకే ఉంటాయి. తద్వారా రెవెన్యూ విభాగాలన్నీ ఆయన పరిధిలోకి వచ్చాయి. దీంతో పాటు ఆయన భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)గా, రెరా ఛైర్మన్‌గా అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ నీతూకుమారి ప్రసాద్‌కి స్థాన చలనమయింది. ఆమె స్థానంలో ప్రస్తుతం నిరీక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారి రఘునందన్‌రావు నియమితులయ్యారు. ఆమెకు ఆదివారం పోస్టింగు ఇవ్వలేదు. ఒకటి, రెండురోజుల్లో ఆమెను మరో స్థానంలో నియమించనున్నారు. మంగళ, బుధవారాల్లో కలెక్టర్ల సమావేశాల నేపథ్యంలో ఈ బదిలీలు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. సోమవారం మరికొంతమంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసే అవకాశం ఉంది.

## మీ ఆస్తిపన్ను ఎంతో మీరే చెప్పండి




➤ స్వీయ మదింపునకు ఆదరణ ➤ పారదర్శకతకు ప్రాధాన్యం..
➤ అక్రమాలకు అడ్డుకట్ట ➤ అమలులో ఖమ్మం కార్పొరేషన్ ముందంజ

ఈనాడు, హైదరాబాద్

పారదర్శకమైన పన్ను విధానంలో భాగంగా తెలంగాణ పురపాలక శాఖ అమలు చేస్తున్న ఆస్తిపన్ను స్వీయ మదింపు విధానానికి (ప్రాపర్టీ ట్యాక్స్ సెల్ఫ్ అసెస్‌మెంట్) ఆదరణ పెరుగుతోంది. హైదరాబాద్ మహానగరపాలక సంస్థలో చాన్నాళ్ల నుంచి అమల్లో ఉన్న ఈ విధానాన్ని ఇటీవల సులభతర వాణిజ్య విధానంలో భాగంగా రాష్ట్రంలోని మిగతా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లోనూ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్మాణదారులు లేదా యజమానులే ఆస్తిపన్ను ఎంత చెల్లించాల్సి ఉంటుందో స్వయంగా మదింపు వేసుకుని వివరాలను నమోదు చేయడం సత్ఫలితాలు ఇస్తోంది. ఈ విధానంలో ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసినా తర్వాత పరిశీలనలో గుర్తిస్తారు. అవసరమైతే వారిపై చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంటుంది. స్వీయ మదింపు విధానానికి ప్రభుత్వం చట్టబద్ధత కల్పిస్తూ ఇటీవల పురపాలక చట్టంలో దీన్ని ప్రత్యేకంగా చేర్చిన విషయం తెలిసిందే.

### మరింత చేరువ చేస్తాం

ఆస్తిపన్ను మదింపులో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికే ఈ విధానానికి శ్రీకారం చుట్టినట్లు పురపాలక ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. కొన్ని పట్టణ స్థానిక సంస్థల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఇది చక్కగా అమలవుతోందన్నారు. దీనికి మరింత ప్రచారం కల్పించి వినియోగించుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. ఈ విధానాన్ని వినియోగించుకున్న వారి అభిప్రాయాలను తెలుసుకుని అవసరమైన మార్పులతో మరింత సులభతరం చేస్తామన్నారు. ప్రతి పురపాలక సంఘంలో దీన్ని ప్రోత్సహించేలా ప్రత్యేకచర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఈ కొత్త విధానం అమలులో ఖమ్మం అగ్రస్థానంలో ఉండగా రామగుండం కార్పొరేషన్ ద్వితీయ స్థానంలో ఉంది.

✦ ఆస్తిపన్ను మదింపులో కొంత మంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో పాటు అవినీతికి అవకాశం ఉండడంతో ప్రభుత్వం స్వీయ మదింపు విధానాన్ని ప్రవేశపెట్టింది.

✦ పట్టణ స్థానిక సంస్థల వెబ్‌సైట్‌లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి.

✦ ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు నమోదు చేయవచ్చు. దీని ఆధారంగా ఆస్తిపన్ను ఎంత చెల్లించాలో తెలుసుకోవచ్చు.

### ఆన్‌లైన్‌లోనే అంతా..

✦ ఈ వెబ్ పోర్టల్‌లోంచి స్వీయ మదింపు దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు లేదా సంబంధిత పురపాలక సంఘం, నగరపాలక సంస్థ నుంచి కూడా తీసుకోవచ్చు.

✦ పన్ను మదింపు దరఖాస్తుతో పాటే ఆస్తికి సంబంధించి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

✦ పట్టా లేదా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, భవనం ఫొటో, భవన నిర్మాణ అనుమతి పత్రం నకలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వంటివాటిని అప్‌లోడ్ చేయాలి.

✦ లేదంటే వీటిని నేరుగా పురపాలకశాఖ కార్యాలయంలో అందచేయవచ్చు.

✦ పురపాలక రెవెన్యూ అధికారులు వీటిని పరిశీలించి డాక్యుమెంట్లు సరిచూసుకుంటారు.

✦ ఆ ఆస్తిని పరిశీలించి దరఖాస్తులోని కొలతలను సరిచూస్తారు.

✦ తేడాలుంటే సరి చేస్తారు. అనంతరం చెల్లించాల్సిన ఆస్తిపన్నును నిర్ణయిస్తారు.

## హరికృష్ణ సేవలు ఎనలేనివి

ప్రథమ వర్ధంతి సందర్భంగా చంద్రబాబు నివాళి



హరికృష్ణ తనయులు ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌లను పలకరిస్తున్న చంద్రబాబు

ఈనాడు, హైదరాబాద్: నందమూరి హరికృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు నివాళులర్పించారు. తిథి ప్రకారం ఆదివారం హరికృష్ణ ప్రథమ వర్ధంతి. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన చంద్రబాబు హరికృష్ణ చిత్రానికి పూలు వేసి నివాళులర్పించారు. ఆయన తనయులు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, కుమార్తె సుహాసినితో మాట్లాడారు. రాష్ట్రానికి, తెదేపాకు హరికృష్ణ చేసిన సేవలు ఎనలేనివని చంద్రబాబు కొనియాడారు. కార్యక్రమానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు.

## స్వార్థ రాజకీయాలతోనే ఇతర పార్టీల్లోకి నేతలు

తెదేపా నేత బక్కని నర్సింలు ధ్వజం

ఈనాడు, హైదరాబాద్: తెలుగుదేశంలో అభివృద్ధి చెంది, పేరు ప్రతిష్ఠలను సంపాదించుకుని స్వార్థ రాజకీయాల కోసం ఇతర పార్టీల్లో చేరుతున్నారని తెదేపా జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బక్కని నర్సింలు ఆరోపించారు. ఆదివారం ఆయన ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఏపీలో అప్రజాస్వామిక పాలన, తెలంగాణలో దొరల పాలన సాగుతున్నాయని ఆయన విమర్శించారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర తెలుగునాడు కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు గజేంద్రగౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. జాతీయ అధికార ప్రతినిధి అరవిందకుమార్ గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలంతా కలిసి తెదేపాను కాపాడుకోవాలన్నారు.

## ఈ ఘోరం చూడలేం బిడ్డా!

- విద్యుదాఘాతానికి ఐదుగురు బాలలు బలి
- జాతీయ పతాక స్తంభాన్ని తీస్తుండగా ప్రమాదం
- కర్ణాటకలోని వసతిగృహంలో ఘటన



సంఘటన స్థలంలో విద్యార్థుల మృతదేహాలు

గంగావతి, న్యూస్‌టుడే: వారు అయిదుగురు ఎప్పుడూ కలిసిమెలిసి తిరిగేవారు... ఎంతో చలాకీగా ఉండేవారు. మూడు రోజుల కిందట స్వాతంత్ర్య దినోత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వసతిగృహంపై ఏర్పాటు చేసిన జెండాకు గుండెలనిండుగా ఉప్పొంగిన దేశభక్తితో వందనం చేశారు. ఆ పతాకాన్ని కట్టిన ఇనుప స్తంభాన్ని ఆదివారం తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అసువులు బాశారు. తమ కంటి దీపాలైన బిడ్డలు అచేతనంగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రుల గుండెలు ఆగాయి. వారి కళ్లు నీటి సంద్రాలయ్యాయి. మధ్య కర్ణాటకలోని కొప్పళ జిల్లా కేంద్రం బన్నికట్టలో చోటు చేసుకుందీ ఘోరం. స్థానికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతిగృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వసతిగృహంపైన డబ్బాలో ఇసుక పోసి, అందులో ఇనుప స్తంభం పెట్టి, దానికి పతాకాన్ని కట్టి ఎగురవేశారు. ఆ స్తంభాన్ని కిందికి తీసుకురావాలని ఆదివారం ఉదయం వార్డెన్ విద్యార్థులకు పురమాయించారు. ఇసుక డబ్బాలోని స్తంభాన్ని ఓ విద్యార్థి తొలగించబోతుండగా అది పైనున్న విద్యుత్తు తీగలకు తాకింది. ఆ బాలుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ప్రమాదంలో చిక్కుకున్న స్నేహితుడిని రక్షించేందుకు మిగిలినవారు ప్రయత్నించారు. అందరూ ఒకరి తర్వాతమరొకరు ప్రమాదానికి లోనయ్యారు. విద్యార్థుల కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చేలోగా విగతజీవులుగా మారారు. ఈ ఘటనలో పదోతరగతి విద్యార్థులు మల్లికార్జున, బసవరాజ్, 9వ తరగతి చదివే దేవరాజ్, కుమార, 8వతరగతి విద్యార్థి గణేశ్ అక్కడికక్కడే కన్నుమూశారు.

## 26న క్షిపణి పరీక్ష కేంద్రానికి శంకుస్థాపన

హాజరుకానున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

నాగాయలంక, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా నాగాయలంక మండలంలోని గుల్లలమోదలో డీఆర్‌డీఓ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న క్షిపణి పరీక్ష కేంద్రానికి ఈ నెల 26న శంకుస్థాపన చేయనున్నారు. 154.42 హెక్టార్లకు సంబంధించి ఇటీవలే అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి తుది అనుమతులు వచ్చాయి. డీఆర్‌డీఓ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ తిమ్మయ్య నేతృత్వంలోని బృందం ఆదివారం కృష్ణా జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌ను విజయవాడలో కలిసింది. శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. నాగాయలంక వద్దనున్న ఓఎన్జీసీ హెలిప్యాడ్‌ను పరిశీలించారు. వరద పరిస్థితుల దృష్ట్యా వేదికను ఖరారు చేయలేదు. సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## హరిత చైతన్యం @ రెండు కోట్ల మొక్కలు

- ఎంపీ సంతోష్‌కుమార్ సవాల్‌కు రాష్ట్రవ్యాప్త స్పందన



హరిత సవాల్‌లో రెండు కోట్ల మొక్కలు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం మొక్క నాటిన ఎంపీ సంతోష్

ఈనాడు, హైదరాబాద్: 'మొక్క నాటండి, దాన్ని పరిరక్షించండి, మీలా చేయాలంటూ ముగ్గురిని ప్రోత్సహించండి' అనే నినాదంతో తెరాస రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభమైన హరిత సవాల్(గ్రీన్ ఛాలెంజ్) కార్యక్రమంలో ఏడాది వ్యవధిలో రెండు కోట్ల మొక్కలు నాటారు. 2018 జులై 28న హైదరాబాద్‌లో సంతోష్ మొక్కను నాటి స్వీయచిత్రం దిగి దానిని ట్విటర్లో పెట్టడంతోపాటు మొక్కలు నాటాలంటూ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్, నటుడు నాగార్జునలకు హరిత సవాల్ చేశారు. దీనికి వారు స్పందించి మొక్కలు నాటడంతోపాటు మరో ముగ్గురికి హరిత సవాల్ చేశారు. ఇలా... ఒకరి నుంచి ముగ్గురికి చొప్పున ఈ కార్యక్రమం సాగింది. ఇగ్నైటెడ్ మైండ్స్ సంస్థ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించింది. లక్ష్యం కోటికి చేరినప్పుడు తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మొక్కను నాటి ముగ్గురికి హరిత సవాల్ చేశారు. తాజాగా ఆదివారం నాటికి మొక్కల సంఖ్య రెండుకోట్లకు చేరింది. దీనికి గుర్తుగా సంతోష్ కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో మరో మొక్కను నాటారు. గత ఏడాది నాటిన మొక్క ఏపుగా పెరగగా... దానికి సమీపంలోనే తాజాగా మొక్కను నాటారు. 2022 నాటికి రాష్ట్రమంతా హరితవనాలు విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ట్విటర్ ద్వారా ఎంపీలు విజయ్‌సాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, జీఎంఆర్ గ్రూపు సంస్థ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, నటుడు అఖిల్ అక్కినేనిలకు హరిత సవాల్ చేశారు. రెండు కోట్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షించినందుకు ఇగ్నైటెడ్ మైండ్స్ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, రాఘవలను ఈ సందర్భంగా సంతోష్ అభినందించారు. బంగారు తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ ఇచ్చిన సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణలోని ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పిలుపు మేరకు కీసర అభయారణ్యాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నట్లు సంతోష్ తెలిపారు. సంతోష్ హరిత సవాల్‌కు స్పందించి నటుడు అఖిల్, ఎంపీ మిథున్‌రెడ్డిలు తాము మొక్కలను నాటుతున్నట్లు ట్విటర్‌లో పేర్కొన్నారు.



## వ్యాధులు కోడంగై పోవాల్సిందే!

ఆదిలాబాద్ జిల్లా... ఆదివాసీ ప్రాంతాల్లో ఎలాంటి కనీస సౌకర్యాలూ ఉండవు. వానొచ్చిందంటే గూడేలన్నీ బురదమయమే. అందులోకి దిగితే అనారోగ్యాలు వచ్చే ప్రమాదమూ లేకపోలేదు. కాళ్లకు బురద అంటుకోకుండా కర్రలపై నడిచే 'కోడంగ్' అనే సంప్రదాయాన్ని ఆదివాసీలు పాటిస్తున్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో చుక్కల అమావాస్య మొదలుకొని... పొలాల అమావాస్య వరకూ ఇలా చేస్తారు. ఖండాల మండలం లోహారలో చిన్నారులు ఇలా కర్రలపై ఉత్సాహంగా నడుస్తూ కనిపించారు.

– ఈనాడు, ఆదిలాబాద్

## ప్రకృతి మెలిక.. వయ్యారపు నడక



అందమైన గిరులు...పచ్చదనపు సోయగాల మధ్య మెలికలు తిరుగుతూ వయ్యారంగా సాగుతున్న ఈ రైలుబండి మనసును పరవశింప చేస్తుంది కదూ! ఈ సుందర దృశ్యం మనకు సమీపంలోనిదే. హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలోని వికారాబాద్ నుంచి తాండూరు వెళ్లే మార్గంలోని అనంతగిరి అటవీ ప్రాంతం ఈ ప్రకృతి అందాల కేంద్రం.

– ఈనాడు వికారాబాద్

## అధికరణం 370 రద్దు రాజ్యాంగ విరుద్ధం

మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ



అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: అధికరణం 370 రద్దు రాజ్యాంగ విరుద్ధమని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ పేర్కొన్నారు. కశ్మీర్ సమస్యకు అధికరణ 370 రద్దు పరిష్కారమా? అనే అంశంపై మానవ హక్కుల వేదిక, పౌరహక్కుల సంఘం తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో ఆదివారం నిర్వహించిన సభలో కృష్ణ ప్రసంగించారు. ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లు కశ్మీర్ సమస్య భారత్, పాకిస్థాన్ సరిహద్దు వివాదం కాదని, హిందూ, ముస్లిం మత సమస్య అంతకంటే కాదన్నారు. అది కశ్మీర్ ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే స్వయంప్రతిపత్తి ఆకాంక్ష అని చెప్పారు. భారత ప్రభుత్వం కశ్మీర్ ప్రజల ప్రాథమిక హక్కులను గౌరవించాలన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు మాట్లాడుతూ..అధికరణ 370 అమలు చేయకపోవడం కారణంగానే కశ్మీరీల సమస్య అపరిష్కృతంగా ఉండిపోయిందన్నారు. కశ్మీర్ జాతీయఉద్యమానికి ప్రజాస్వామికవాదులు మద్దతుగా నిలవాలని కోరారు.

## రాజధానిలో ట్రాఫిక్ వ్యవస్థ ప్రక్షాళన

- 'ఈనాడు' కథనంపై స్పందించిన డీజీపీ మహేందర్ రెడ్డి
- చలానా వసూళ్లకే పోలీసులు పరిమితం కారాదని అదనపు డీజీకి ఆదేశం
- ట్రాఫిక్ పోలీసులంతా విధుల్లో పాల్గొనేలా చర్యలు
- మూడు నెలలకోసారి యూటర్న్‌లపై సమీక్ష
- 'ఈనాడు'తో అదనపు డీజీ జితేందర్



అదనపు డీజీ జితేందర్

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. ట్రాఫిక్ పోలీసులు చలానాల కోసమే పనిచేయకుండా. . ట్రాఫిక్ నియంత్రణలో మమేకమయ్యేలా చేయడానికి ప్రణాళికను రూపొందించాలని అదనపు డీజీ జితేందర్‌ను డీజీపీ ఆదేశించారు. 'చలానాకేనా పోలీస్' శీర్షికన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల తీరుపై 'ఈనాడు' ప్రధాన పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనంపై డీజీపీ స్పందించారు. ఆదివారం ఉదయం అదనపు డీజీపీతో ఈ విషయమై చర్చించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

### ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు: అదనపు డీజీ

చలానాల విధింపు, వసూలు చేయడానికే ట్రాఫిక్ పోలీసులు ఉండకూడదని డీజీపీ అభిప్రాయపడ్డారని అదనపు డీజీ జితేందర్ చెప్పారు. 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై డీజీపీ స్పందన.. ట్రాఫిక్ సమస్య నివారణపై భవిష్యత్ కార్యాచరణ, ఇతర అంశాలపై ఆదివారం ఆయన 'ఈనాడు' ప్రతినిధితో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడమన్నది ట్రాఫిక్ పోలీసుల విధుల్లో ఒకటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ వ్యవస్థ గురించి మరోసారి సమీక్షించాలని ఆదేశించారన్నారు. కొద్దిరోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి ఇప్పుడున్న ట్రాఫిక్ పోలీసు వ్యవస్థలో లోపాలను గుర్తించి నివారణకు తక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పదుల సంఖ్యలో పోలీసులు ఒకచోట ఉండి చలానాలు రాసే పనిని నిలిపివేస్తామన్నారు. ట్రాఫిక్ పోలీసులంతా వాహనాల ట్రాఫిక్ నియంత్రణలో పాలుపంచుకునేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

### అధునాతన ట్రాఫిక్ సిగ్నల్స్‌పై కసరత్తు

హైదరాబాద్‌లోని ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణ బాధ్యతను బెల్ సంస్థకు అప్పగించామని అదనపు డీజీ వివరించారు. ఈ కాంట్రాక్టు వచ్చే నవంబరు నాటికి పూర్తవుతుందన్నారు. దీన్ని పునరుద్ధరించి మరింత అధునాతన సిగ్నల్స్ వ్యవస్థను రూపొందించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు కసరత్తు జరుగుతోందన్నారు. హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి వాటిని విస్తరించడంతో పాటు.. ఆ ప్రాంతాల్లో పోలీసులను ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన యూటర్న్‌ల్లో కొన్నిచోట్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని ఫిర్యాదులు వస్తుండటంతో ప్రతి మూడు నెలలకు వాటి పరిస్థితిని సమీక్షిస్తామని జితేందర్ తెలిపారు.

## కూలిన వినాయక భారీ మండపం

- త్రుటిలో తప్పిన ప్రమాదం

అక్కిరెడ్డిపాలెం(విశాఖపట్నం), న్యూస్‌టుడే: గాజువాక దరి నాతయ్యపాలెంలో వినాయక చవితిని పురస్కరించుకుని నిర్మిస్తున్న భారీ మండపం ఆదివారం కుప్పకూలింది. మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండపంపై పరిచిన టార్పాలిన్ ఒక్కసారిగా గాలికి పైకి ఎగిరింది. ఆ ధాటికి మండపం ఒక వైపునకు ఒరిగి కూలిపోయింది. మండపాన్ని నిర్మిస్తున్న ఆరుగురు సిబ్బంది అంతకు ముందే భోజనాలకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. రూ. 15 లక్షలతో నిర్మిస్తున్న మండపం పనులు చాలా వరకు పూర్తయ్యాయని, అది కూలిపోవడంతో ఉత్సవాలు రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

## వాగు దాటి.. వైద్య సేవ

- జోరు వానలో.. వైద్యుల అంకితభావం

జోరువానలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగును సైతం లెక్క చేయకుండా మారుమూల మన్యం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి సిబ్బంది అంకితభావం చాటారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రాళ్లచెలకలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి జోరుగా వర్షం కురుస్తున్నా.. జిల్లా వైద్య విభాగం పరిపాలన అధికారి పోటు వినోద్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రామకృష్ణ, ఆశా కార్యకర్త కౌసల్య శిబిరం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గ్రామ సమీపంలోని ఎర్రసాని వాగును దాటి వర్షంలోనే కిమీ దూరం నడుచుకుంటూ గ్రామానికి చేరుకున్నారు. వర్షం కారణంగా శిబిరానికి గొత్తికోయలు రాకపోవడంతో.. ఇంటింటికి వెళ్లి గర్భిణులు, బాలింతలు, పిల్లలను పరీక్షించి మందులు అందించారు.

– న్యూస్‌టుడే, పాల్వంచ గ్రామీణం





ఎర్రసాని వాగును దాటుతున్న ఏవో వినోద్, వైద్య సిబ్బంది ★ పిల్లల్ని పరీక్షిస్తున్న వైద్యుడు వినోద్

# ఈనాడు

## పన్ను పోట్లకు సమగ్ర వైద్యం!

క్రీకారణ్యాన్ని తలపిస్తున్న పన్నుల వ్యవస్థలో చెల్లించేవారిని చెండుకుతినే దుర్నీతి ధోరణి దశాబ్దాలుగా వర్ధిల్లుతున్న దేశం మనది. పన్ను ఎగవేతదారులపై కొరడా ఝళిపించాల్సిన యంత్రాంగం- అందరినీ ఒకే గాటన కట్టి వరస నోటీసులతో తీవ్రాందోళనలోకి నెట్టేస్తున్న అతి పోకడలు నిజాయతీపరుల్ని కుపితుల్ని చేస్తున్నాయి. కేఫ్ కాఫీ డే అధిపతి సిద్ధార్థ ఆత్మహత్య దరిమిలా 'పన్ను ఉగ్రవాదం'పై భయాందోళనలు దీర్ఘశ్రుతిలో చెలరేగిన దరిమిలా- నిజాయతీగా పన్ను చెల్లించేవారితో అనుమానాస్పదంగా వ్యవహరించరాదని ప్రధాని మోదీయే ఎర్రకోటనుంచి స్పష్టీకరించాల్సి వచ్చింది. పన్నుల యంత్రాంగం 'మైండ్ సెట్' మారాల్సి ఉందన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యల నేపథ్యంలో- చెల్లింపుదారులతో సమాచారాన్ని స్నేహపూర్వకంగా పంచుకొనే కొత్త విధానానికి తెరలేచింది. సమర్పించిన పన్ను పత్రాల్లో ఏదైనా ఖర్చునో, సమాచారాన్నో పేర్కొనని పక్షంలో ఐటీ విభాగంనుంచి ఆయా సెక్షన్లను ఉటంకిస్తూ ధాటిగా నోటీసులు దూసుకురావడం పరిపాటి. ఆ ఆనవాయితీకి చెల్లుకొట్టి మొట్టమొదటే వ్యక్తులను, సంస్థలను నోటీసులతో హడలకొట్టరాదని, టీడీఎస్ డిపాజిట్లపై సందేశాలు పంపినట్లుగానే సంక్షిప్త సమాచారం అందివ్వాలన్న నిర్ణయం సహర్షంగా స్వాగతించదగింది. చెల్లింపుదారుల సమస్త సమాచార నిధిని విశ్లేషించే యంత్రాంగాలు సిద్ధంగా ఉండటంతో భారీ నగదు డిపాజిట్లు, ఖరీదైన లావాదేవీల సమాచారాన్ని పన్ను పత్రాల సమర్పణ కంటే ముందే చెల్లింపుదారుల దృష్టికి తెచ్చే కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. పన్ను ఎగవేతపై గట్టి రుజువులు, పన్ను పత్రాల్లో భారీగా తేడాపాడాలున్నప్పుడు మాత్రమే అధికారులు చెల్లింపుదారుల్ని సంప్రతించాలని, అప్పుడు కూడా నోటీసులతో హడావుడి చెయ్యకుండా, తప్పు సరిదిద్దుకొనే అవకాశం ఇవ్వాలని తాజా నిర్దేశాలు చాటుతున్నాయి. దేశార్థిక స్థితి అధ్యయనంతోపాటు, పన్ను అధికారుల్లో పరివర్తన నిమిత్తం కేంద్రమంత్రి నిర్మల ఎనిమిది నగరాల్లో పర్యటించి క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోనున్నారు. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఏటికేడు రాబడి అంచనాల్ని అహేతుకంగా పెంచుకొంటూ పోవడమే అధికారుల 'అతి'కి ప్రధాన హేతువన్న విశ్లేషణల్ని ఏమాత్రం విస్మరించే వీల్లేదు!

గత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ నిర్దేశించిన రాబడుల లక్ష్యం రూ.12 లక్షల కోట్లు! మొన్న మార్చి 23నాటికి ఇంకా 14.9 శాతం రాబడి తరుగుపడిందంటూ- 'వెంటనే సాధ్యమైన అన్ని చర్యలూ తీసుకొని బకాయిల వసూళ్లపై దృష్టిపెట్టి లక్ష్యాన్ని సాధించా'లని సీబీడీటీ మార్చి 26న ప్రధాన ఆదాయ పన్ను కమిషనర్లకు చేసిన సూచన కలకలం రేపింది. ఈ తరహా ఉత్తర్వులు ఐటీ అధికారులపై ఒత్తిడి పెంచి అనుచిత వేధింపులకు కారణమవుతాయంటూ బాంబే, కర్ణాటక, లక్నో, సూరత్, అహ్మదాబాద్‌లకు చెందిన ఛార్టర్డ్ అకౌంటెంట్ సంఘాలు ప్రధానికి, విత్తమంత్రికి లేఖ రాశాయి. దాని కేపాటి మన్నన దక్కిందో తెలియదుగాని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాబడి లక్ష్యాన్ని సీబీడీటీ నిరుటికంటే 20శాతం పెంచింది! ఇలాంటి లక్ష్యాల చేదన ఐటీ అధికారుల్ని అక్షరాలా వేటగాళ్లుగా, అవినీతి ఆటగాళ్లుగా మార్చేస్తోంది. ముందు పన్నులు కట్టి దానిపై అప్పీలు ద్వారా తిరిగి సొమ్ములు రాబట్టుకోవాలని ఐటీ అధికారులే కార్పొరేట్లకు సలహాలిస్తున్న వాతావరణంలో, 2017-18లో వివాదంలో ఉన్న కార్పొరేట్ పన్ను మొత్తం రూ.3.99 లక్షల కోట్లకు చేరి, వివాద రహిత పన్నుకు 5.8 రెట్లుగా లెక్కతేలింది! 2018-19కి సంబంధించి సీబీడీటీ వెలువరించిన కేంద్రీయ కార్యాచరణ పథకం- ఆదాయ పన్ను కమిషనర్లు (అప్పీలు) నిర్ణీత కాలావధుల్లో కేసులు తేల్చేయాలని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉత్తర్వులిస్తే ప్రోత్సాహకాలుంటాయనీ ప్రకటించింది. దానిపై దాఖలైన కేసులో- ఏమాత్రం న్యాయబద్ధంగాని 'ప్రోత్సాహ ప్రతిపాదన'ను బాంబే హైకోర్టు మొన్న ఏప్రిల్‌లో తోసిపుచ్చింది. పై స్థాయినుంచీ పన్నుల వ్యవస్థ సక్రమంగా లేదనేందుకు సూచికలివి!

చెల్లించేవారిని వేధించే విధంగా పన్నుల వ్యవస్థ ఉండరాదన్న విఖ్యాత ఆర్థికవేత్త రాజా జె.చెల్లయ్య హితవాక్యం ప్రభుత్వాలకు ఏనాడో పరగడుపున పడిపోయింది. ఆదాయం, జవాబుదారీతనం, నైతిక ప్రవర్తన, సమాచారం, డిజిటలీకరణ అనే అయిదు స్తంభాలపై పన్నుల వ్యవస్థ కుదురుకోవాలన్న 2016 జూన్‌నాటి మోదీ సంకల్పం ఇంకా సాకారం కానేలేదు. 'ప్రాజెక్ట్ ఇన్‌సైట్' పేరిట సమాచార నిధిని మథించి పన్ను ఎగవేత అవకాశం ఉన్నవాళ్ల భరతం పట్టాలని ఐటీ విభాగం భావిస్తుంటే, సీబీడీటీ వెలువరించిన 32 పేజీల మార్గదర్శకాలు కొత్త భయాలు పెంచుతున్నాయి. అవినీతి అధికారుల చేతుల్లో అవి పీడనకు సాధనాలుగా మారే ప్రమాదం ఏమాత్రం తోసిపుచ్చలేనిది. రెండు నెలలనాడు కేంద్ర ప్రభుత్వం 27మంది సీనియర్ పన్ను అధికారుల్ని సాగనంపినా, ప్రక్షాళన పూర్తి అయిందని చెప్పే వీల్లేదు. 1961నాటి ఆదాయ పన్ను చట్టానికి అవసరానుగుణంగా సవరణలు చేస్తూ పోవడంతో చదువుకొన్నవారికీ ఒక పట్టాన అంతుపట్టని ప్రహేళికగా, అవినీతి పరులకు కామధేనువుగా అది భ్రష్టుపట్టిందనడంలో సందేహం లేదు. పన్నుల సరళీకరణ, హేతుబద్ధీకరణ, సమర్థ కార్యాచరణే లక్ష్యాలుగా ప్రత్యక్ష పన్నుల స్మృతిని పట్టాలకెక్కిస్తామన్న ప్రతిపాదనలు దశాబ్దకాలంగా నీరోడుతున్నాయి. చెల్లింపుదారుల పన్ను ఖాతాల తనిఖీ చెల్లింపుదారులతో ముఖాముఖి లేకుండా సాగడం, వివాదాల్ని పరిహరించడం, అప్పీళ్ల సత్వర పరిష్కారం వంటి కీలకాంశాల్నీ పరిశీలించి ప్రత్యక్ష పన్ను స్మృతి తెస్తామంటున్న మోదీ ప్రభుత్వం- అన్ని స్థాయుల్లోనూ దిద్దుబాటు చర్యల్ని వేగవంతం చెయ్యాలి. పన్ను రేట్ల హేతుబద్ధీకరణతోపాటు అధికారుల స్థాయిలో అవినీతి, దుర్విచక్షణల్ని రూపుమాపితే, ప్రగతిశీల సంస్కరణగా అది సన్నుతులందుకొంటుంది!



# సుందర కశ్మీరం... సంపూర్ణ భారతీయం



రవిశంకర్ ప్రసాద్

జమ్మూకశ్మీర్‌లోని సామాన్య ప్రజల ప్రయోజనంకోసం 370 అధికరణను రద్దు చేయవలసి వచ్చింది. ఏడు దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యకు, అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లో పరిష్కారం తలపెట్టి చరిత్ర సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదీ ధైర్యాన్ని, హోం మంత్రి అమిత్ షా సంకల్పాన్ని మనం అభినందించాల్సిన అవసరం ఉంది. అన్యాయమైన పరిస్థితుల్లో 370 అధికరణను భారత రాజ్యాంగంలో ఒక తాత్కాలిక నిబంధనగా చేర్చారు. 560కి పైగా రాచరిక రాజ్యాలు 370 అధికరణ వంటి తాత్కాలిక ఏర్పాట్లు ఏవీ లేకుండానే భారత్‌లో విలీనమయ్యాయి. ఆ రాజ్యాల్లో భిన్న సంస్కృతీ సంప్రదాయాలుగల అన్ని సమాజాల ప్రజలు నివసించేవారు. అయినప్పటికీ గొప్పజ్ఞానం, దూరదృష్టి కలిగిన భారత రాజ్యాంగ వ్యవస్థాపకులు ఆ రాజ్యాలకు 370 అధికరణ వంటి ఏ ప్రత్యేక నిబంధనలనూ అంగీకరించలేదు. 560కి పైగా రాచరిక రాజ్యాల్లో జమ్మూకశ్మీర్ తప్ప మిగిలిన అన్ని రాజ్యాల విలీనం సర్దార్ పటేల్ ఆధ్వర్యంలో సాకారమైంది. ఆ ప్రాంతాలు ఇవాళ భారతావనిలో అంతర్భాగమని సగర్వంగా చెప్పుకొనే పరిస్థితి ఉంది. ఉప ప్రధానమంత్రి పదవితో పాటు రాచరిక రాజ్యాల విలీనం అంశాన్నీ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ తన భుజస్కంధాలపైకి ఎత్తుకున్నారు. అయితే ఆయన కర్తవ్యాన్ని సంక్లిష్టంగా మారుస్తూ, సంకట పరిస్థితులు సృష్టిస్తూ జమ్మూకశ్మీర్ అంశంపై జవహర్‌లాల్ నెహ్రూ వ్యవహరించారు.

### ఎట్టకేలకు దిద్దుబాటు

ఏడు దశాబ్దాల జమ్మూకశ్మీర్ సమస్యను ఎదుర్కొనే క్రమంలో సుమారు 42 వేలమంది ప్రాణాలు కోల్పోయారు. కశ్మీరీ పండిట్ల తలలకు తుపాకీలు ఎక్కుపెట్టి, వారు బలవంతంగా తమ ఇళ్లను వదిలి బతుకు జీవుడా అంటూ మరో ప్రాంతానికి వలసపోవాల్సిన దురవస్థను తీసుకువచ్చారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే నిబంధనను తీసుకొచ్చారు. అక్కడ వేర్పాటువాదాన్ని, భారత వ్యతిరేకతను ప్రోత్సహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం- షేక్ అబ్దుల్లాకు జైలుశిక్ష విధించి ఆయనను పదకొండేళ్లు కారాగారంలో ఉంచింది. 1990-1996 మధ్యకాలంలో ఏడాదికి సరాసరిన 200 రోజులు కశ్మీర్ లోయలో కర్ఫ్యూ ఉండేది. జమ్మూకశ్మీర్‌పై నెహ్రూకు భావోద్వేగంతో కూడిన ప్రేమాభిమానాలున్నాయి. ఆ ప్రత్యేక ప్రేమే ఆ రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ లక్ష్యాలు దెబ్బతినడానికి కారణమైంది. 370 అధికరణ వల్ల ఎవరు ప్రయోజనం పొందారు? స్వాతంత్ర్యం వచ్చిన 73 ఏళ్ల తరవాత మనందరం తప్పక అడగవలసిన అత్యంత చట్టబద్ధమైన ప్రశ్న ఇది. దీనివల్ల జమ్మూకశ్మీర్ ప్రజలు ఎలాంటి ప్రయోజనమూ పొందలేదు. పహాడీలు, షియా సమాజం, గుజ్జర్లు, బక్కర్ వాలాలు, గడ్డీలు, ఇతర షెడ్యూల్డ్ జాతులు, షెడ్యూల్డ్ కులాలు, లద్దాఖ్, కార్గిల్‌లో నివసించే ప్రజలు ఈ అధికరణ ద్వారా ఏర్పాటైన నిబంధన నుంచి ఎటువంటి గణనీయమైన ప్రయోజనం పొందలేదు. ప్రభుత్వాల లోపభూయిష్ఠ విధానాలవల్ల జమ్మూకశ్మీర్ ప్రజలు అనుభవించిన సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఆ రాష్ట్రానికి చెందిన కొన్ని కులీన కుటుంబాలకు మేలు చేస్తే, మొత్తం రాష్ట్ర సమస్యలన్నీ తీర్చినట్లే అన్న ఆలోచనలో దిల్లీ ప్రభుత్వం ఉండేది. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, నియంత్రణను బలపరచుకోవడానికి, అవినీతి కార్యకలాపాల కోసం- కొన్ని కుటుంబాలు 370 అధికరణను వేదికగా ఉపయోగించుకున్నాయి. 370 అధికరణ నీడలో వారు ఆశ్రయం పొందారు. అధికారులు, రాజకీయ నాయకుల అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా, వారి వైఖరిని నిలదీయడానికి రూపొందిన అవినీతి నిరోధక చట్టం- జమ్మూకశ్మీర్‌లో ఎందుకు అమలు కావడం లేదు? దీన్ని ఎవరైనా ఎలా సమర్థిస్తారు? విద్యాహక్కు చట్టం, బాల్యవివాహ నిషేధ చట్టం, సమాచార హక్కు చట్టం, చేతితో పారిశుద్ధ్య పని చేయడాన్ని నిషేధించే చట్టం వంటివాటిని ఆ రాష్ట్రంలో ఎందుకు వర్తింపజేయలేదు? ప్రజలు స్వేచ్ఛగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించుకోవడానికి వీలులేకుండా 370 అధికరణను దుర్వినియోగపరచారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్న సమయంలో చాలా కాలం తరవాత ఓ ఎన్నిక సజావుగా జరిగింది. ఆ విషయం ఇప్పటికీ జన స్మృతిపథంలో ఉంది.

### అభివృద్ధి వైపే ఇక పయనం

సైనికాధికారి ఉమర్ ఫయాజ్, రైఫిల్ మ్యాన్ ఔరంగజేబ్ సహా ధైర్యంగా ముందుకు వచ్చిన ఎందరో కశ్మీరీ ముస్లిములు ఉగ్రవాదుల కిరాతకానికి బలైపోవడం గమనించాల్సిన చాలా ముఖ్యమైన విషయం. దాంతో 370 అధికరణకు వ్యతిరేకంగా ఎంతో ఆవేశంగా మాట్లాడినవారూ మౌనంలోకి జారుకున్నారు. రాష్ట్రానికి చెందిన అపారమైన సహజ వనరులపై పట్టు సాధించి ఆకస్మిక లాభాలు పొందేందుకు 370 అధికరణను కొన్ని కుటుంబాలు ఉపయోగించుకున్న విషయాన్ని- జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ జగ్‌మోహన్ రచించిన 'మై ఫ్రోజెన్ టర్బులెన్స్' అనే పుస్తకంలో విస్తృతంగా చర్చించారు. వాటన్నింటివల్ల ఆరోగ్య పరిరక్షణ, విద్యాభివృద్ధికి అక్కరకొచ్చే ఆదాయాన్ని ఆ రాష్ట్రం గణనీయంగా కోల్పోయింది. జమ్మూకశ్మీర్‌లో 1956లో రాజ్యాంగసభ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల్లోనే రాష్ట్రానికి రాజ్యాంగం రూపొందిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. 'జమ్మూకశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం' అన్న విషయాన్ని రెండో భాగంలోని, మూడో అధికరణలో ప్రత్యేకంగా పొందుపరచారు. ఆ రాజ్యాంగానికి సవరణగా, పన్నెండో భాగంలోని 147వ అధికరణను తీసుకువచ్చారు. అందులో మూడో సెక్షన్‌లో 'భారత్‌లో జమ్మూకశ్మీర్ అంతర్భాగం' అని పేర్కొన్న విషయంపై మార్పులు చేయడానికి వీలుగా ఎలాంటి బిల్లుకాని, సవరణ కాని రాష్ట్ర చట్టసభలు దేనిలోనూ ప్రవేశపెట్టడానికి లేదా చర్చ చేపట్టడానికి వీలులేదు' అనే విషయం స్పష్టంగా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమంటూ ఆ రాష్ట్రానికి చెందిన రాజ్యాంగసభ ఒకసారి రాజ్యాంగం రూపొందించాక దాన్ని ఇక ఎవరూ మార్చలేరన్నారు. ఆ సందర్భంలో 370 అధికరణ దాని ఔచిత్యాన్ని కోల్పోతుంది.

ఉద్దేశపూర్వకంగానే 370 అధికరణను తాత్కాలిక నిబంధనగా ఉంచారు. దాన్ని సమర్థించేవారు ఆ నిబంధనను శాశ్వతంగా మార్చేందుకు ఎప్పుడూ ఎందుకు ధైర్యం చేయలేదన్న విషయాన్ని ప్రధాని సరిగ్గా గమనించారు. రాజ్యాంగసభ రాజ్యాంగాన్ని రూపొందించగానే, ఆ అధికరణ దాని ప్రయోజనాన్ని అందించిందన్న విషయం గమనించడం చాలా ముఖ్యం. రాష్ట్ర రాజ్యాంగంలోని 147వ అధికరణ కింద ఇంకా ఏమైనా సవరణలు చేయాలంటే ఆ అధికారం రాష్ట్ర శాసనసభకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ప్రకటన ద్వారా దాన్ని ప్రకటించడం పూర్తిగా సమర్థనీయం. 370(3) అధికరణ కింద రాజ్యాంగసభ అంటే రాష్ట్ర శాసనసభ అని చదువుకోవాలి. అదేవిధంగా రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉంది కాబట్టి, భారత రాజ్యాంగంలోని 356(1)(బి) అధికరణ కింద ఆ అధికారాన్ని రాజ్యాంగం ప్రకారం పార్లమెంటు నిర్వహించింది. పార్లమెంటు ఉభయసభల్లో జరిగిన చర్చల్లో జమ్మూకశ్మీర్‌కు చెందిన అన్ని ప్రాంతాల వాదనలు విన్నారు. 370 అధికరణను తొలగిస్తామన్న హామీపై భాజపాకు భారత ప్రజలనుంచి అనూహ్య మద్దతు లభించిందన్న వాస్తవాన్ని సైతం నొక్కి చెప్పవలసిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఈశాన్య, గిరిజన ప్రాంతాల సంక్షేమానికి సంబంధించి అధికరణ 370 వంటి ప్రత్యేక నిబంధనలను సైతం తొలగించాలన్న వాదన పూర్తిగా తప్పు. 371 (ఎ) నుంచి (జె) వరకు ఉన్న అధికరణలు ప్రత్యేక నిబంధనలు. అవి తాత్కాలికమైన నిబంధనలు కావు. కాబట్టి అవి కొనసాగుతాయి. కొత్త రాష్ట్రాలు ఏర్పడిన తరవాత, ఒక ప్రత్యేక ప్రాంతం లేదా ప్రత్యేక తెగల అభివృద్ధికోసం ప్రత్యేక నిబంధనలు పొందుపరచారు. అవి ప్రత్యేక నిబంధనలు కాబట్టి శాశ్వతమైనవి!

### ముందున్నాయి మంచి రోజులు

కశ్మీర్ లోయకు చెందిన ముస్లిం బాలికలు ఆ రాష్ట్రానికి వెలుపలి యువకులను వివాహం చేసుకోవడంవల్ల వారు తమ హక్కులన్నింటినీ కోల్పోయారు. ఇటువంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల జమ్మూనుంచి వచ్చిన అఖిల భారత సర్వీసులకు చెందిన ఒక యువ అధికారిని కలిశాను. ఆమె హిందూ వర్గానికి చెందిన వ్యక్తి. రాష్ట్రానికి వెలుపల ఉండే ఒక సివిల్ సర్వెంటును వివాహం చేసుకోవడం వల్ల జమ్మూలో తన హక్కులన్నింటినీ కోల్పోయినట్లు ఆమె వెల్లడించారు. 370 అధికరణ రద్దు చేయడం ద్వారా తనకు గొప్ప న్యాయం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి చెమ్మగిల్లిన నయనాలతో ఆమె కృతజ్ఞతాభివందనాలు తెలియపరచారు. భారత ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. సర్కారు తీసుకుంటున్న సానుకూల చర్యల కారణంగా శ్రీనగర్, సోపోర్, బద్గామ్, భాదేర్వా, జమ్ము వంటి ప్రాంతాలనుంచి నేడు ఎన్నో బీపీఓలు పనిచేస్తున్నాయి. పౌరులకు డిజిటల్ సేవలు అందించేందుకు అక్కడ 3,158 సాధారణ సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆ ప్రాంతానికి నేనెప్పుడు వెళ్ళినా అక్కడి సేవా కేంద్రాల ఉద్యోగుల కళ్లలో ఆనందాన్ని చూడగలుగుతున్నాను. ఉజ్జ్వల భవిష్యత్తు దిశగా తమ నైపుణ్యాలకు సానపట్టేందుకు ఈ అవకాశాలు ఉపకరిస్తున్నాయని ఆ బాలబాలికల్లో కొందరు నాతో చెప్పారు. జమ్మూకశ్మీర్ అభివృద్ధి ప్రస్థానంలో ఇది ఓ నూతన ఉషోదయం. 370 అధికరణ రద్దుతో ఆస్తులు కోల్పోయిన వారికి, అణచివేతకు గురైనవారికి అద్భుత అవకాశం అందివచ్చినట్లయింది. మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్య ఉగ్రవాదులకు, వేర్పాటువాదులకు రుచించలేదు. ఆ శక్తులకు భారత్‌లో ఇకమీదట స్థానం లభించదు!

(రచయిత- న్యాయ, చట్ట, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల కేంద్రమంత్రి)

# వినియోగదారులకు రక్షాకవచం

'వినియోగదారు రారాజు' అనేది ఎప్పటి నుంచో వ్యాపారవర్గాలు పఠిస్తున్న మంత్రం. కొనేవారే లేకుంటే ఏ వ్యాపారమూ సాగదు. సమాచార, సాంకేతిక రంగాలు ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. దానివల్ల ఆధునిక సమాజంలో నిత్యం ఎన్నెన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆ మేరకు వ్యాపార ధోరణులూ కొత్తదనాన్ని సంతరించుకుంటున్నాయి. 'ఆన్‌లైన్' లావాదేవీలు సర్వసాధారణమయ్యాయి. ఇలాంటి మార్పుల గందరగోళంలో వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లకూడదు. వాటిని వాణిజ్యవర్గాలు తమ లాభాల సాధనకు అనువుగా మార్చుకోరాదు. ఈ తరహా పెడపోకడల నేపథ్యంలోనే పాలకులు కొత్త చట్టాలు తీసుకురావలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఇందులో భాగంగానే కేంద్రం నూతన వినియోగదారుల సంరక్షణ చట్టం (2019) ఆవిర్భవించింది. పాత చట్టం 1986నాటిది. కొత్త చట్టానికి ఆగస్టు తొమ్మిదిన రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. వినియోగదారుల హక్కులు కాపాడటం, అనైతిక వ్యాపార ధోరణులను అరికట్టడం ఈ చట్టం ప్రధానోద్దేశాలు. సత్వర ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను రూపొందించాలనీ చట్టం చెబుతోంది. 'ఆన్‌లైన్' క్రయవిక్రయాలను, విక్రయ సంస్థలనూ చేర్చి- చట్ట పరిధిని పెంచారు. విదేశాల్లో వినియోగదారులకు అత్యంత ప్రాధాన్యం ఉంది. అమెరికాలో 'యూఎస్ ఫెడరేషన్ ట్రేడ్ కమిషన్', ఆస్ట్రేలియాలో 'ఆస్ట్రేలియన్ కన్స్యూమర్ అండ్ కమిషన్' వినియోగదారుల హక్కుల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

కొత్త చట్టం మేరకు ప్రస్తుతమున్న వినియోగదారుల ఫోరాల స్థానంలో వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్‌లను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో ఏర్పాటు చేస్తారు. జాతీయస్థాయిలో కేంద్ర వినియోగదారు రక్షణ ప్రాధికార సంస్థ(సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ- సీసీపీఏ) ఏర్పాటవుతుంది. ఇది ముఖ్య కమిషనర్, ఉప కమిషనర్ల ఆధ్వర్యంలో కొనసాగుతుంది. నిబంధనలను అతిక్రమించేవారికి శిక్షలు, భారీ జరిమానాలు విధిస్తుంది. ఒక దర్యాప్తు విభాగం డైరెక్టర్ జనరల్ నేతృత్వంలో పని చేస్తుంది. కేంద్ర వినియోగదారు రక్షణ సంస్థకు తనిఖీలు, జప్తులు చేసే అధికారం ఉంటుంది. అనైతిక వ్యాపారం కొనసాగిస్తున్నారని కాని, వినియోగదారుల హక్కులకు భంగం కలిగించారంటూ ఫిర్యాదు అందితే, కలెక్టరు ద్వారా నివేదిక కోరవచ్చు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకోసం అవసరమైతే మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయవచ్చు. తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చినా, వాటిలో భాగస్వాములైనా ఆయా వ్యక్తులకు రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అధికారం సంస్థకు ఉంటుంది. మోసపూరిత ప్రకటనల్లో ప్రముఖులు పాల్గొంటే వారిపై ఏడాది నుంచి మూడేళ్ల వరకు నిషేధం విధిస్తారు. కల్తీలకు పాల్పడటం వల్ల హాని సంభవిస్తే, బాధ్యులకు ఆరు నెలల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించవచ్చు. కేంద్ర అథారిటీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకుంటే ఆరు నెలల వరకు జైలు, రూ.20 లక్షల



### కొత్త చట్టంలో కఠిన నిబంధనలు

వరకు జరిమానా విధించవచ్చు. వినియోగదారుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే ఉత్పత్తిదారు లేదా 'సర్వీస్ ప్రొవైడర్ల'కు రెండేళ్ల జైలుశిక్ష లేదా రూ.10 లక్షల జరిమానా విధిస్తుంది. అదే తప్పు పునరావృతమైతే అయిదేళ్ల వరకు జైలు లేదా రూ.50 లక్షల వరకు జరిమానా ఉంటాయి.

కొత్త చట్టంలో కేంద్ర ప్రభుత్వం కమిషన్ల పరిధిని నిర్ణయించింది. జిల్లా కమిషన్ కోటి రూపాయల వరకు విలువైన లావాదేవీలపై కేసులు స్వీకరించవచ్చని తెలిపింది. రాష్ట్ర కమిషన్ రూ.కోటికి మించి, రూ.10 కోట్ల వరకు విలువైన వస్తు లావాదేవీలకు సంబంధించిన కేసులను విచారిస్తుంది. రూ.10 కోట్లకు మించిన విలువైన కొనుగోళ్లపై కేసులు జాతీయ కమిషన్ పరిధిలోకి వస్తాయి. జిల్లా కమిషన్ తీర్పుపై రాష్ట్ర కమిషన్‌లో అప్పీలు చేయవచ్చు. ఇందుకోసం రావాల్సిన సొమ్ములో 50 శాతం లేదా రూ.25 వేలలో ఏది తక్కువైతే అది చెల్లించాలని షరతు విధించారు. రాష్ట్ర కమిషన్ తీర్పును జాతీయ కమిషన్‌లో అప్పీలు చేయాలంటే, రావాల్సిన సొమ్ములో 50 శాతం లేదా రూ.35 వేలలో ఏది తక్కువైతే అది చెల్లించాలి. తమ తీర్పులను పునస్సమీక్షించుకునే అధికారాన్ని రాష్ట్ర కమిషన్లకు కొత్త చట్టం కట్టబెట్టింది.

కొత్త చట్టంలో జిల్లా స్థాయి కమిషన్‌లో కొత్తగా వివాదాల సత్వర పరిష్కారం కోసం మధ్యవర్తిత్వ కేంద్రాలను నెలకొల్పే ఏర్పాటు చేశారు. నిర్దేశించిన గడువులోగా పరిష్కారం లభించకపోతే- జిల్లా స్థాయి కమిషన్ రాష్ట్ర, జాతీయ కమిషన్లకు నివేదిక పంపాల్సి ఉంటుంది. కొత్త చట్టాన్ని రాబోయే మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి రామ్‌విలాస్ పాసవాన్ పేర్కొన్నారు. ప్రతి పౌరుడు ఒక వినియోగదారుడే కాబట్టి, ఉత్పత్తిదారు మొదలుకొని మధ్యవర్తులు, అంతిమ వినియోగదారు వరకు తమవంతుగా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి. వినియోగదారు నిర్వచనాన్ని మరింత విస్తరించి, ప్రభుత్వం ద్వారా కల్పించే పౌరసేవల్ని చేర్చడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ఠ ఇనుమడిస్తుంది. ప్రజలకూ చట్టాలపై విశ్వాసం పాదుకొంటుంది. ప్రభుత్వ నిధులతో కొనసాగే సంస్థల ద్వారా వినియోగదారు అవగాహన సదస్సులు, విద్యాలయాల్లో కార్యశాలలు నిర్వహించడం ద్వారా హక్కుల ప్రాధాన్యత, వాటికి భంగం కలిగితే ఎదురయ్యే పర్యవసానాలను తెలియజేయవచ్చు. వస్తువుల నాణ్యతను నిర్వహించడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తే, నిర్దేశించిన ప్రమాణాలను పరిశీలించిన తరవాత వస్తువులను విపణిలోకి అనుమతించవచ్చు. దీనివల్ల నకిలీ వస్తువులను అరికట్టవచ్చు. చట్టాల అమలులో ప్రభుత్వాల నిబద్ధత, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. వినియోగదారుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడం, వారికి తగిన నష్టపరిహారం వెంటనే అందించడంవంటివి అత్యంత ఆవశ్యకం. వ్యాపార వర్గాలూ నిజాయతీగా వ్యవహరించినప్పుడే 'వినియోగదారు రారాజు' అనే మాట ఆచరణలో సార్థకమవుతుంది!

**- డాక్టర్ ఎం.బుచ్చయ్య**

(రచయిత- వాణిజ్య శాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులు)

## ఈనాడు లేఖలు

### నదుల అనుసంధానం అవసరం

పొరుగు రాష్ట్రాల్లో అధిక వర్షపాతంవల్ల తెలుగు రాష్ట్రాల్లోని జలాశయాలు కళకళలాడుతున్నాయి. తెలంగాణ, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికీ కరవుతో విలవిల్లాడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో పంటలు ఎండిపోయే స్థితికి చేరాయి. తాగునీటి ఎద్దడి సైతం పీడిస్తోంది. ఒకచోట అతివృష్టి, మరో ప్రాంతంలో అనావృష్టి నెలకొనడం పర్యావరణ సమతుల్యత దెబ్బతినడానికి సంకేతంగా నిలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అందరికీ సాగునీరు అందించేందుకు నదుల అనుసంధానానికి మించిన ప్రత్యామ్నాయం లేదు. నిధులు ఎక్కువైనా ప్రభుత్వాలు ఈ సాహసోపేత నిర్ణయం తీసుకోవాలి. సముద్రంలో కలిసే నీటిని కరవుప్రాంతాలకు అందించాలి. నదుల అనుసంధానానికి సిద్ధమయ్యే రాష్ట్రాలకు కేంద్రం ఉదారంగా నిధులివ్వాలి.

- వి.ఆర్.తల్లాప్రగడ, మదీనాగూడ, హైదరాబాద్

### విలువలు పెంపొందించాలి

సమాజంలో విలువలు క్షీణించి, పైశాచికత్వం పెచ్చరిల్లుతోందనడానికి చిన్నారులపై జరుగుతున్న 'హత్యాచార'కాండే నిదర్శనం. గతంలో తల్లిదండ్రులు పిల్లలకు మానవత్వం, నైతిక విలువలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేవారు. నేటి యాంత్రిక యుగంలో ఆ పరిస్థితి లేదు. కుటుంబసభ్యులు 'ఎవరికివారే..' అన్నట్లు ఉద్యోగాలు, ఇతర వ్యాపకాల్లో నిమగ్నమవుతున్నారు. పిల్లల పెంపకాన్ని గాలికొదిలేస్తున్నారు. మరోవైపు విద్యాసంస్థలు నైతిక విలువల అంశం తమకు సంబంధించినది కాదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ దుస్థితి భవిష్యత్తులో సమాజానికి మరింత చేటు చేస్తుంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా చొరవ తీసుకుని విద్యాబోధనలో విలువలను ఒక అంశంగా చేర్చాలి. కేంద్ర ప్రభుత్వం వైద్యవిద్యలో ఈ దిశగా తొలి అడుగులు వేయడం శుభపరిణామం. దీన్ని ప్రాథమిక విద్య నుంచే విస్తరింపజేయాలి.

- డి.సింధుజ, వరంగల్

## దైవలీల

కనిపించే ప్రపంచమంతా భగవన్మయం. ఈ ప్రపంచాన్ని సృజించి అందులో తానుగా, తనలో సృష్టిగా దృశ్య ప్రపంచాన్ని ఇముడ్చుకొని భగవంతుడు సృష్టికి ఆధారభూతంగా అలరారుతున్నాడు.

ఏ అవకరమైనా దైవ నిర్దేశితమే. ఆయన సృజనను త్రికరణాలతో ఆమోదించడమే విజ్ఞత. ఆయన ఆజ్ఞకు భిన్నంగా సృష్టిలో ఏదీ రూపుదిద్దుకోలేదని గ్రహించాలి. ఏదో ఒక ప్రయోజనం కోసమే జీవుడికి సంపద గానీ, దురదృష్టం కానీ అందివచ్చిందని, సంపద సృష్టిలో జీవుడి ప్రయోజకత్వం గానీ దరిద్రంలో అతడి అసమర్థత గానీ లేవని సాధకుడు గ్రహించాలి.

ఏ ఒక్కరిపైనా దైవానికి ప్రేమ గానీ, ద్వేషం కానీ ఉండవు. ధర్మ పక్షపాతిగా ఆయన శ్రీకృష్ణావతారంలో పాండవుల పక్షాన నిలిచి వారి శ్రేయస్సును కాంక్షించాడు.

దైవం కరుణామయుడు. తన సృష్టిని ఆయన ఎన్నడూ ఛిన్నాభిన్నం చేయడు. ఆయన కరుణా స్వభావంతోనే సమస్త ప్రాణులకు భూమ్యాకాశ సముద్రాల్లో ఆహారం లభిస్తోంది. ఆయన స్తోత్రప్రియుడు. మనకు అన్నీ ఇచ్చిన పరమాత్మను స్తుతించడంలో విజ్ఞత ఉంది. తనను ఎవరైనా ప్రశంసిస్తే మనిషికి సంతోషం కలుగుతుంది. మనిషికి ఈ స్తోత్రప్రియత్వం భగవంతుడి లక్షణం నుంచే సంక్రమించిందని గుర్తించాలి.

మంచి చెడులు భగవంతుడి సృష్టి. విరుద్ధ లక్షణాలు గల మంచీచెడుల మధ్య సంఘర్షణ సహజం! జగత్తును సృజన చేసి ప్రాణుల జీవన నాటక అభినయాన్ని చూసి వినోదించడం ఆయన లీలలో భాగమేగానీ ఆయనకు ఏ ఒక్కరి పైనా ప్రత్యేక శ్రద్ధ ఉండదు. పరమాత్మ ప్రణాళికలో భాగంగానే సృష్టి-స్థితి-లయం జరుగుతాయి. సృష్టి ఎంత సహజమో లయం కూడా అంతే సహజం. అవి నివారింప వీలుకాని విషయాలని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో స్పష్టం చేశాడు. దుష్టులైన రాక్షసులను అవ్యాజ కరుణతో సంహారానంతరం తనలో ఐక్యం చేసుకున్న ఉదంతాలు పురాణేతిహాసాల్లో అనేకం కనిపిస్తాయి.

ఎల్లప్పుడూ ఆనందంగా సాత్వికాంశతో జీవించడం పరమాత్మను ఆరాధించడమే. ఆనందమే దైవం. ఆనందమయ సాత్విక జీవనమే దైవారాధన!



### అంతర్యామి

దయ, దానగుణం, ఉపకార బుద్ధి వంటి విశేష గుణాల సాధన భగవదారాధనలో అంతర్భాగంగా సాధకుడు గ్రహించాలి.

కొన్ని సంకల్పాలు బలమైన కోరికలుగా మారి అవి తీరక ఉవ్విళ్లూరిస్తూ జీవుణ్ని వేధిస్తాయి. పరితాపం పెంచుతాయి. అనుకోని కొన్ని లాభాలు వరాలై మన ముంగిట వాలతాయి.

బలహీనులపై బలవంతుల దాష్టీకం సృష్టి సహజమే అయినా అహేతుకంగా నిర్దయగా వ్యవహరించే వారి తీరు దైవాన్ని తిరస్కరించడమే అవుతుంది. దుష్టులు కొందరు ఏ రూపంలో అభివృద్ధి చెందినట్లు కనిపించినా ఏదో నాటికి వారి పతనం తథ్యమని చరిత్ర పలుమార్లు ఎలుగెత్తింది.

దానం, కరుణ వంటి సద్గుణాలు అందించే మధురభావ సంతృప్తి అనితర సాధ్యం. స్వార్థం, నిర్దయ వంటి అవలక్షణాలతో మనిషి ఎన్నడూ ఆనందంగా జీవించలేడు.

భౌతిక వస్తుసేకరణ తప్పు కాదు. కానీ వాటి వల్ల ఆనందం లభ్యమవుతుందన్నది ఓ భ్రమ మాత్రమే అంటారు జ్ఞానులు. ఆ సత్యాన్ని సాధకుడూ అనుభవంతో తెలుసుకుంటాడు. తోటివారి ధర్మయుత ఐశ్వర్యం అసూయాపరులకు మోదాన్ని కలిగిస్తుంది. జనామోదమే దైవామోదమని సాధకుడు అనుభవంలో తెలుసుకుంటాడు.

భగవద్భక్తితో సాధించలేని ఏ లౌకిక విజయమూ ఉండదని పురాణేతిహాసాలు నివేదిస్తాయి. భక్తులకు ఆ మహాకార్యాలు పరమాత్మ సందేశాలని మానవుడు గ్రహించాలి.

**- గోపాలుని రఘుపతిరావు**

# పల్లెకూ మానసిక వైద్యం!

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- త్వరలోనే ప్రయోగాత్మకంగా రాష్ట్రంలో ప్రారంభం



దేశంలో మానసిక ఆరోగ్యం కునారిల్లుతోంది. వేర్వేరు రకాల మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నవారు సుమారు 14 శాతం మంది ఉంటారని అంచనా. వీరిలో ప్రతి 20 మందిలో ఒకరు మానసిక కుంగుబాటు(డిప్రెషన్)కు గురవుతున్నారంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మానసిక బాధితుల ప్రభావం వారి కుటుంబాలపై ప్రతికూలంగా పడుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల్లో నెలకు కనీసం రూ.1000-1500 వ్యయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పల్లె ముంగిటకు మానసిక వైద్యాన్ని తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. తాజాగా దిల్లీలో జరిగిన సమావేశంలో ఈ అంశంపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీలో తెలంగాణ నుంచి వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు. కేంద్ర మార్గదర్శకాల మేరకు.. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) స్థాయి నుంచి మానసిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని కొన్ని ఎంపిక చేసిన పీహెచ్‌సీల్లో చికిత్సను ప్రవేశపెట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. వారానికి ఒకరోజు ప్రత్యేకంగా ఈ చికిత్సల కోసమే ఓపీ నిర్వహించాలని భావిస్తున్నారు. వీరికి అవసరమైన ఔషధాలను కూడా అందుబాటులోకి తేనున్నారు. మానసిక వైద్యనిపుణుడి సలహా అవసరమని భావిస్తే.. టెలీమెడిసిన్ విధానంలో సలహాలు, సూచనలు పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవేళ ఆసుపత్రిలో ఉండి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంటే.. అప్పుడు ఉన్నతస్థాయి వైద్యశాలకు తరలిస్తారు. దీనికి సంబంధించిన కసరత్తును ఇప్పటికే ప్రారంభించినట్లు వైద్యవర్గాలు చెప్పాయి. ఈ మేరకు పీహెచ్‌సీల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. తొలుత పీహెచ్‌సీల్లో.. ఆ తర్వాత జిల్లా స్థాయిలో చేపట్టే ఈ చికిత్సలకు కేంద్రం ప్రత్యేకంగా నిధులు సమకూర్చనుంది.

### మానసిక సమస్యలు పలు రకాలు..

- మానసిక రుగ్మతల కారణంగా చెప్పలేనన్ని బాధలు, వైకల్యం, చివరకు ఆత్మహత్యలు కూడా సంభవిస్తున్నాయి.
- మానసిక కుంగుబాటు, ఆందోళన, మద్యానికి బానిసవ్వడం, ఆత్మహత్యకు ప్రయత్నించడం, మాదకద్రవ్యాలు తీసుకోవడం, నిద్ర సరిగా పట్టకపోవడం, ఇలాంటివన్నీ మానసిక సమస్యల పరిధిలోకే వస్తాయనే విషయం చాలా మందికి తెలియదు.
- వయసు, లింగభేదం, ప్రాంతాలు, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా మానసిక రుగ్మతలు ఎవరి మీదైనా ప్రభావం చూపించొచ్చు.
- 13-17 ఏళ్ల వయస్కుల్లో 7.3 శాతం మందిలో మానసిక రుగ్మతలున్నాయి.
- గ్రామీణంలో(6.9శాతం) కంటే మెట్రో నగరాల్లోని కౌమారుల్లో దాదాపు రెట్టింపు స్థాయి(13.5శాతం)లో మానసిక సమస్యలున్నాయి.
- బాధితుల్లో సుమారు 80 శాతం మంది ఏడాదికిపైగా చికిత్స పొందడంలేదు. దీంతో జీవనశైలి, విద్య, వృత్తి, ఉద్యోగం, పెళ్లిపై దుష్ప్రభావం పడుతోంది.
- కుంగుబాటుకు గురవుతున్నవారిలో సుమారు 50 శాతం మంది వారి సామర్థ్యానికి తగ్గట్లుగా దైనందిన జీవితాన్ని సాఫీగా గడపలేకపోతున్నారు.




- పురుషుల కంటే మహిళల్లో మానసిక కుంగుబాటు ఎక్కువగా కనిపిస్తుండగా.. 40-49 ఏళ్ల మహిళల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది.
- పొగాకుతో 20.9 శాతం, మద్యంతో 4.6 శాతం, ఇతర మత్తుపదార్థాలకు బానిసలైనవారు 0.6 శాతం మంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

# సీయే.. మోజు తగ్గిపాయె!

ఈనాడు, హైదరాబాద్, అమరావతి

ఛార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) కోర్సు పూర్తి చేసేందుకు ఏళ్ల తరబడి కుస్తీ పట్టే బదులు.. ఇంజినీరింగ్ వంటి కోర్సులను ఎంచుకోవడానికే విద్యార్థులు, తల్లిదండ్రులు ఇష్టపడుతున్నట్లు అర్థమవుతోంది. రిజిస్ట్రేషన్ల సంఖ్యలో ఏటా 4-5 శాతం హెచ్చుతగ్గులుంటాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రతినిధులు చెబుతున్నా.. 2012-13 గణాంకాలను 2017-18తో పోలిస్తే.. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు నమోదు చేసుకున్న వారి సంఖ్య దేశవ్యాప్తంగా 87,280 తగ్గింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ కలిపి మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్య 2012-13లో 3,11,207 ఉండగా.. 2017-18లో ఈ సంఖ్య 2,10,289 మాత్రమే. అంటే లక్ష మందికి పైగా విద్యార్థులు తగ్గారు.

### ఎందుకీ అనాసక్తి?

సీఏ కోర్సుని ఇంటర్ తర్వాత నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయవచ్చు. కానీ అలాంటి వారి సంఖ్య ఏళ్లపై లెక్కపెట్టే స్థాయిలోనే ఉంటుందని శిక్షణ అధ్యాపకుడు ఆకెళ్ల శివకుమార్ చెప్పారు. ఎక్కువ మందికి కనీసం అయిదేళ్ల సమయం పడుతుంది. అప్పటికీ పూర్తవుతుందనే గ్యారంటీ లేదు. ఎక్కువ మందికి అనేక దండయాత్రల తర్వాతే ఈ కోర్సు వశమవుతోంది.

### కోర్సులో మూడు దశలు

★ మొదట ఫౌండేషన్ పరీక్ష రాయడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకు ఇంటర్మీడియట్ అర్హత. 2017కు ముందు పదో తరగతి పూర్తి కాగానే రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. ఇంటర్మీడియట్ పూర్తి కాగానే మే-జూన్‌లో ఫౌండేషన్ పరీక్ష రాసేవారు. 2017 జులై 1 నుంచి ఈ నిబంధన మార్చారు. ఇంటర్ పూర్తయిన 6 నెలల తర్వాతే రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. దీంతో విద్యార్థుల్లో ఏడాది సమయం వృథా అవుతుందన్న భావన కలుగుతోంది. పరీక్షల విధానమూ మారింది. ప్రవేశ కోర్సుని కఠినతరం చేశారు. గతంలో సీపీటీ (ఇప్పుడు ఫౌండేషన్)లో కేవలం బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు ఉండేవి. ఇప్పుడు రెండు ప్రశ్నపత్రాలు బహుళ ఐచ్ఛికం, మరో రెండు ప్రశ్నపత్రాలు వ్యాసరూప ప్రశ్నలు ఉంటున్నాయి. ప్రవేశ స్థాయిలోనే ఎక్కువ మందిని వడపోయాలన్న అభిప్రాయంతో ఇలా మార్చినట్లు అధ్యాపకులు చెబుతున్నారు.

★ ఫౌండేషన్‌లో అర్హత సాధించాక సీఏలో ఇంటర్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏడాది శిక్షణతో ఇంటర్ పరీక్షలకు హాజరుకావచ్చు.

★ ఇంటర్‌లో అర్హత సాధిస్తే.. మూడేళ్లు ఏదైనా సంస్థలో శిక్షణ (ఆర్టికల్‌షిప్) పూర్తి చేయాలి. తర్వాత ఫైనల్‌కు నమోదు చేసుకోవాలి. సీఏ ఇంటర్, ఫైనల్‌లో ఒక్కో దాంట్లో గ్రూపు-1, 2 ఉంటాయి. అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత (40 శాతం) సాధించాలి. మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి. ఇంత కష్టపడితే ఉత్తీర్ణులవుతున్న వారి సంఖ్య స్వల్పం. 2015, 2016 సంవత్సరాల్లో ఉత్తీర్ణత శాతం మరీ తక్కువగా ఉండటంతో విద్యార్థులు షాక్‌కు గురైన పరిస్థితి.

### సీఏ ఇంటర్‌తోనూ మంచి ఉద్యోగాలు

సివిల్స్‌లో ప్రతిభ చూపితే ఐఏఎస్ లేకుంటే ఐపీఎస్, ఇతర గ్రూపులు వస్తాయి. సీఏకు మాత్రం ఒక్కటే ఆప్షన్. కాకపోతే సీఏ ఇంటర్ పూర్తయితే సర్టిఫికెట్ ఇస్తారు. దాంతోనూ మంచి ఉద్యోగాలు పొందవచ్చు. సీఏ ఫైనల్ పూర్తి చేస్తే జీవితాంతం ఆదాయం ఉంటుంది.

### బీటెక్ మంచిదా? సీఏనా?

ఇంటర్మీడియట్ తర్వాత జేఈఈ పరీక్షలకు సిద్ధమైతే అదే సంవత్సరం భవిష్యత్తు తెలిపోతుంది. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీల్లో సీటు దక్కకుంటే ఎంసెట్ ద్వారా ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరే అవకాశం ఉంది. మంచి పర్సంటేజ్‌తో మంచి కళాశాలలో బీటెక్ పూర్తి చేసినవారికి దేశవిదేశాల్లో భారీ ప్యాకేజీతో కొలువులు వస్తున్నాయి. అదే సీఏలో చేరితే పూర్తి చేస్తామన్న గ్యారంటీ లేకపోవడంతో తమ పిల్లల్ని ఆ కోర్సు వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు నచ్చజెబుతున్నారు. సీఏ ఫౌండేషన్ పరీక్షలో తేలిగ్గానే ఉత్తీర్ణులైనా ఇంటర్, ఫైనల్ పూర్తి చేయడం అధిక శాతం మందికి గగనమైపోతోంది. మధ్యలో వదిలేస్తే సాధారణ కొలువుతో స్థిరపడాల్సి వస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జేఈఈ పరీక్షలకు ఇంటర్ తర్వాత గరిష్ఠంగా ఒకటి రెండేళ్లు శిక్షణ తీసుకుంటారు. సీఏకు మాత్రం పూర్తయ్యేవరకు శిక్షణ తీసుకోవాలి. శిక్షణ రుసుము కూడా భారీగా ఉంటోంది. ఇటీవల రిజిస్ట్రేషన్ రుసుములు కూడా బాగా పెరిగాయి.

### కొంత హెచ్చుతగ్గులు ఉంటాయి



రిజిస్ట్రేషన్ల సంఖ్యలో కొంత హెచ్చుతగ్గులుంటాయి. గణాంకాలను పరిశీలిస్తే 4-5 శాతం తగ్గుతోంది. దీని ఆధారంగా సీఏకు ఆదరణ తగ్గుతుందని చెప్పలేం. ఇప్పటికీ మన దేశంలో 5 లక్షల మంది సీఏలు అవసరం. మన సీఏలకు సింగపూర్, దుబాయి వంటి ఎన్నో దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. సీఏలోకి వచ్చి ఉత్తీర్ణులు కాలేకుంటే ఐసీడబ్ల్యూఏ, కంపెనీ సెక్రటరీ, ఎంకాం వంటి కోర్సుల్లో చేరాలని చెబుతుంటాం.

- దేవరాజరెడ్డి, ఐసీఏఐ మాజీ ఛైర్మన్

### నిబంధనలు మార్చాలి



2017 జులై 1 నుంచి కొత్త విధానం వచ్చింది. సిలబస్ మార్చారు. గతంలో పదో తరగతి పూర్తయిన తర్వాత సీపీటీ (ఇప్పుడు ఫౌండేషన్) పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉండేది. 2017 నుంచి ఇంటర్ తర్వాత... అదీ 6 నెలల వ్యవధి అనంతరం రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిబంధన విధించారు. ఐఐటీల్లో ప్రవేశాల కోసం ఇంటర్ రెండో ఏడాది పూర్తికాకముందే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాస్తుంటే ఇక్కడ ఈ నిబంధన ఎందుకు? ఇలాంటివి మార్చాలి. దీనివల్ల ఈ రెండేళ్లలో వేలాది మంది రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఈ ఏడాది నుంచి మళ్లీ పుంజుకుంటుంది. కొత్త విధానం, సిలబస్ మారాక ఉత్తీర్ణత శాతం బాగా పెరిగింది.

- మోహన్, డైరెక్టర్, మాస్టర్ మైండ్స్ కళాశాల

## ప్రవాహమంతా సముద్రం వైపే

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా ప్రవాహమంతా దిగువకు వెళ్లిపోతోంది. ఆలమట్టి నుంచి పులిచింతల ప్రాజెక్టు వరకు అన్నీ పూర్తిగా నిండటంతో ఎగువ నుంచి వస్తున్న వరదను దిగువకు వదిలేస్తున్నారు. ఆలమట్టి వద్ద 1.50 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తుండగా ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 7.51 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ఎల్లంపల్లి దిగువన గోదావరి ప్రవాహం ఉండగా ధవళేశ్వరం ఆనకట్ట నుంచి 7.72 లక్షల క్యూసెక్కులు సముద్రంలో కలుస్తోంది.

### లక్ష్మీ బ్యారేజీ నుంచి 1.31 లక్షల క్యూసెక్కుల విడుదల

మహదేవ్‌పూర్, మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ (మేడిగడ్డ)బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోని 85 గేట్లలో 33 గేట్లను ఎత్తి 1.31 లక్షల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. సుందిళ్ల (పార్వతి)బ్యారేజీలో అయిదు గేట్లను ఎత్తి దిగువకు మూడు వేల క్యూసెక్కులను విడుదల చేశారు.

### కృష్ణా గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టుల్లో ఆదివారం నాటి నీటి నిల్వలు, ప్రవాహాల వివరాలు..

| ప్రాజెక్టు పేరు | పూర్తిస్థాయి నీటినిల్వ (టీఎంసీల్లో) | ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీల్లో) | వస్తున్న ప్రవాహం (క్యూసెక్కుల్లో) | దిగువకు విడుదల (క్యూసెక్కుల్లో) |
|---|---|---|---|---|
| **కృష్ణా పరీవాహకం** | | | | |
| ఆలమట్టి | 129.72 | 115.57 | 2,40,000 | 1,50,000 |
| నారాయణపూర్ | 37.64 | 33.42 | 2,00,000 | 1,48,992 |
| జూరాల | 9.66 | 8.34 | 3,50,000 | 3,32,296 |
| తుంగభద్ర | 100.86 | 100.43 | 41,018 | 42,177 |
| శ్రీశైలం | 215.81 | 200.20 | 5,98,513 | 4,73,187 |
| నాగార్జునసాగర్ | 312.05 | 301.87 | 4,24,368 | 4,24,368 |
| పులిచింతల | 45.77 | 37.62 | 5,29,635 | 5,55,005 |
| ప్రకాశం బ్యారేజీ | 3.07 | 3.78 | 7,51,384 | 7,51,384 |
| **గోదావరి పరీవాహకం** | | | | |
| సింగూరు | 29.91 | 0.45 | 00 | 20 |
| నిజాంసాగర్ | 17.80 | 0.14 | -- | 10 |
| శ్రీరామసాగర్ | 90.31 | 17.18 | 00 | 389 |
| కడెం | 7.60 | 6.88 | 888 | 818 |
| శ్రీపాద ఎల్లంపల్లి | 20.18 | 18.67 | 00 | 00 |
| ధవళేశ్వరం బ్యారేజీ | 2.93 | 2.94 | 7,73,657 | 7,72,102 |

## 'సంఘటితంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.సి.జైన్

అమీర్‌పేట, న్యూస్‌టుడే: సంఘటితంగా పోరాడితేనే విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆలిండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.సి.జైన్ పేర్కొన్నారు. ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏబీఆర్‌ఈఏ) వార్షిక సర్వసభ్య సమావేశాన్ని హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఆదివారం నిర్వహించారు. దీనికి హాజరైన ఎస్.సి.జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పెన్షన్ విధానానికి, ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ విధానానికి భారీ వ్యత్యాసం ఉందన్నారు. దశాబ్దాల కింద వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన బ్యాంకు ఉద్యోగులకు అందుతున్న పెన్షన్‌లో ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. పెన్షన్ విధానాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రస్తుత ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ సందర్భంగా ఏబీఆర్‌ఈఏ సర్వసభ్య సమావేశం విజయవంతం కావాలని కోరుతూ ఆంధ్రాబ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పకీర్‌స్వామి సందేశాన్ని పంపారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంకు జీఎం(హెచ్.ఆర్.డి) నాగరాజు, ఆలిండియా ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 15తో ముగియనున్న ప్రతిభ పరీక్ష రిజిస్ట్రేషన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశంలోని అన్ని పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించే "విద్యార్థి విజ్ఞాన మంథన్" ప్రతిభ పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకునే గడువు సెప్టెంబరు 15వ తేదీతో ముగియనుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ పరీక్షలు నిర్వహిస్తామని హైదరాబాద్ జిల్లా సైన్స్ అధికారి ప్రభాకర్ ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.vvm.org.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నవంబరు 4 లేదా 30వ తేదీల్లో పరీక్షల నిర్వహణ ఉంటుందని, డిసెంబరు 15న ఫలితాలు వెలువడతాయని పేర్కొన్నారు.

# కర్ణాటకలో ఫోన్ ట్యాపింగ్ కలకలం

- కేసు సీబీఐకి అప్పగింత
- 'కుమార'పై వేలాడుతున్న కత్తి



కుమారస్వామి యడియూరప్ప సిద్ధరామయ్య

ఈనాడు డిజిటల్, బెంగళూరు: కర్ణాటక రాజకీయాలను టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కుదిపేసింది. వారం క్రితం జనతాదళ్ బహిష్కృత నేత, మాజీ మంత్రి విశ్వనాథ్ చేసిన చిన్న ఆరోపణ చినికిచినికి గాలివానగా మారి.. సీబీఐ దర్యాప్తుదాకా తీసుకెళ్లింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తున్నట్లు ముఖ్యమంత్రి యడియూరప్ప ఆదివారం ప్రకటించారు. హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భాజపా నాయకులతో పాటు పలువురు పోలీసు అధికారులు, పాత్రికేయులు, సినీ తారల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సీసీబీ జాయింట్ కమిషనర్ సందీప్‌పాటిల్ అందించిన నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించామని యడియూరప్ప సమర్థించుకున్నారు. కేసును తొలుత రాష్ట్ర ప్రత్యేక తనిఖీ బృందాని(ఎస్ఐటీ)కి అప్పగించాలనుకున్నా మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు పలువురు విపక్ష నేతలు మరింత సమగ్ర తనిఖీకి డిమాండు చేశారు. చివరికి ముఖ్యమంత్రి సీబీఐ వైపు మొగ్గుచూపారు.

### మాజీ ముఖ్యమంత్రిపైనే గురి

ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి పేరే ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా మిత్రపక్షమైన కాంగ్రెస్ నేతలనూ నమ్మేవారు కారని సమాచారం. తన పదవికి ముప్పు వాటిల్లుతుందన్న భయంతోనే అప్పట్లో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో పాటు మరికొందరు జనతాదళ్ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేడీ(ఎస్) - కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. ప్రస్తుత బెంగళూరు పోలీస్ కమిషనర్ భాస్కరరావు కొందరు కాంగ్రెస్ జాతీయనేతలతో మాట్లాడిన ఫోన్ సంభాషణలు వైరల్‌గా మారాయి. అప్పుడే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీన్ని రాష్ట్ర డీజీ నీలమణి రాజు తీవ్రంగా పరిగణిస్తూ సీసీబీ జాయింట్ కమిషనర్ సందీప్‌పాటిల్‌ను దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వ్యాపారులు, సినీ, వ్యాపార రంగానికి చెందిన 300కు పైగా ప్రముఖుల ఫోన్లు ట్యాప్ అయినట్లు ఆ నివేదిక వెల్లడించింది. ఈ వ్యవహారంపై ఆరోపణలు, డిమాండ్లు ఎక్కువకావడంతో ముఖ్యమంత్రి చివరికి దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తూ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. సీబీఐ దర్యాప్తు కోసం సిద్ధరామయ్య పట్టుబట్టడంతో ఆయన అభిప్రాయానికి ప్రాధాన్యమిస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకొన్నందుకు ధన్యవాదాలంటూ మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "సీబీఐనే కాదు ట్రంప్‌తో కూడా విచారణ చేయించినా నాకేమీ అభ్యంతరం లేదు" అంటూ మండిపడ్డారు. "ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమే కాదు.. ఆపరేషన్ కమలపైనా సీబీఐతో విచారణ జరిపించాలి" అని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పట్టుపట్టారు.

### చిన్నతరహా పరిశ్రమలను ఆదుకోవాలి

గోల్కొండ, న్యూస్‌టుడే: మల్టీ నేషనల్ కంపెనీల ధాటికి కుదేలవుతున్న దేశంలోని చిన్నతరహా పరిశ్రమలను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. హైదరాబాద్ గోల్కొండ సమీపంలోని తారామతి-బారాదరిలో అసోసియేషన్ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ.. ఎఫ్‌డీఐ(ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్) వల్ల చిన్నవ్యాపారులు, డిస్ట్రిబ్యూటర్లు నష్టపోతున్నారని తెలిపారు. జీఎస్టీని సరళతరం చేయాలన్నారు. చిన్న వ్యాపారుల్లో అవగాహనలోపం వల్ల జీఎస్టీ పెనాల్టీలు కడుతున్నారని పేర్కొన్నారు. ఆల్‌ఇండియావ్యాపార మండలి ప్రధాన కార్యదర్శి వీ.కే.బన్సల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నేషనల్ ట్రేడ్ పాలసీని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ట్రేడర్స్ కోసం నేషనల్ లా కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం నేషనల్ డిస్ట్రిబ్యూటర్ల సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. దీని ఆమోదానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

# కత్తితో నరికి.. ఖండఖండాలు చేసి..

- తల్లి, చెల్లి ముందే తండ్రిని చంపిన తనయుడు
- మృతదేహాన్ని ముక్కలు చేసి బకెట్లలో ఉంచిన కిరాతకం



మారుతీ కిషన్ సుతార్

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: కన్న కొడుకే ఆ తండ్రి పాలిట కాలయముడయ్యాడు. కిరాతకం అనే పదానికే పరాకాష్ఠగా నిలిచాడు. తల్లి, చెల్లి చూస్తుండగానే కన్న తండ్రిని కత్తులతో దారుణంగా నరికి హత్య చేశాడు. అంతటితో ఆగలేదు...మృతదేహాన్ని ఖండఖండాలు చేశాడు. వాటిని తరలించడానికి వీలుగా బకెట్లలో నింపాడు. వారు నివసించే వీధిలో జనసంచారం ఎక్కువగా ఉండటంతో ఆ బకెట్లను బయటకు తరలించలేకపోయాడు. 3 రోజులు గడిచిన తర్వాత దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘోరం బయటపడింది. మహారాష్ట్రకు చెందిన మారుతీ కిషన్ సుతార్(80) రైల్వే గూడ్సు డ్రైవర్‌గా పదవీ విరమణ పొందారు. ఆయనకు భార్య గయ, కుమార్తెలు అనుపమ, ప్రఫుల్ల, కుమారుడు కిషన్(30) సంతానం. మరో కుమారుడు చిన్నతనంలోనే ఇంటి నుంచి పారిపోయాడు. అనుపమకు మారేడ్‌పల్లికి చెందిన ఆటోడ్రైవర్ రవితో వివాహమైంది. ఆయన... భార్య, కుమార్తె ప్రఫుల్ల, కొడుకు కిషన్‌లతో కలిసి ఆర్టీసీ కాలనీలోని ఎన్ఏ కృష్ణానగర్‌లో ఉంటున్నారు. తగిన సంపాదనలేని కిషన్ ఆర్థిక సమస్యలతో తండ్రితో తరచూ గొడవ పడేవాడు. దీనికితోడు తండ్రి మద్యం అలవాటు కుటుంబ సభ్యులకు నచ్చేదికాదు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని తండ్రిని అంతం చేయాలని కిషన్ నిర్ణయించుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తల్లి, చెల్లి ముందే కత్తులతో తండ్రిని పాశవికంగా హత్యచేశాడు. తర్వాత మృతదేహాన్ని ముక్కలుముక్కలు చేసి ఇంట్లోనే వేర్వేరు బకెట్లలో ఉంచాడు. ఆదివారం స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మారుతీ ఇంటిని పరిశీలించారు. హత్య తీరును తెలుసుకొని విస్తుపోయారు. హత్యచేసిన తర్వాత రెండు రోజులపాటు ఇంట్లో ఉన్న కుమారుడు తాజాగా కనిపించడంలేదు. పోలీసుల అదుపులోనే ఉన్నాడని తెలుస్తోంది.

### కోతి పిల్ల కోతికి ముద్దు



కోతికి కొబ్బరి చిప్ప దొరికితే దాని ఆనందమే వేరు. దాన్ని పట్టుకొని చెట్టుకొమ్మపైకి చేరి నక్కి నక్కి తింటుంది. అందుకు భిన్నంగా.. దొరికిన కొబ్బరి చిప్పను చిన్న కోతిపిల్లకు ఆప్యాయంగా తినిపిస్తూ, మురిపెంగా ముద్దాడుతూ రెండు కోతులు కనువిందు చేశాయి. కన్న ప్రేమను చాటిచెప్పేలా ఉన్న ఈ చిత్రం ఆదివారం విజయవాడలో కనిపించింది.

- ఈనాడు, అమరావతి

### సాహిత్యంలో రచయిత్రుల పాత్ర కీలకం

తెలుగు భాషా సాహిత్య విభాగం అధ్యక్షుడు మాడభూషి

ఈనాడు, దిల్లీ: కథ, కథనం, నాటకం, ఆధ్యాత్మికం, కవిత్వం వంటి ఏ రకమైన సాహిత్య ప్రక్రియలోనైనా మహిళా సాహితీవేత్తల కృషి, పాత్ర కీలకమని తెలుగు భాషా సాహిత్య విభాగం అధ్యక్షుడు ఆచార్య మాడభూషి శ్రీధరాచార్యులు అన్నారు. ఆంధ్రా అసోసియేషన్ డిల్లీ ఆధ్వర్యంలో హస్తిన రచయిత్రుల రెండో సాహిత్య సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. సమ్మేళనంలో శ్రీధరాచార్యులు మాట్లాడుతూ.. రుగ్వేద కాలంలో గార్గి, మైత్రేయి నుంచి ఆధునిక కాలంలోని కోడూరి కౌసల్యాదేవి, తురగా జానకీ రాణి వరకు వారి రచనలతో సమాజంపై ఎంతో ప్రభావాన్ని చూపారని కొనియాడారు. ఆచార్య ఏల్చూరి మురళీధర్‌రావు మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో బండారు అచ్చమాంబ, ముప్పాళ్ల రంగనాయకమ్మ, మాలతీచందూర్ వంటి వారు సాహిత్యంపై తమదైన ముద్రవేశారని చెప్పారు. సమ్మేళనంలో అబ్బూరి ఛాయాదేవి సాహిత్యంపై ఎం.వి.లక్ష్మి, దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్యంపై ఎన్.ఎస్.లక్ష్మి ప్రసంగించారు. సత్తిరాజు సుబ్బలక్ష్మి షిరిడీ సాయిబాబా భక్తిగీతాలు ఆలపించగా.. కొండూరి మాలతి తాను రచించిన కథ వినిపించారు. సమన్వయకర్తగా డి.సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఆంధ్రా అసోసియేషన్ డిల్లీ అధ్యక్షుడు మణినాయుడు పాల్గొన్నారు.



సాహిత్య సమ్మేళనంలో శ్రీధరాచార్యులు, ఏల్చూరి మురళీధరరావు తదితరులు

# సాగుచేయని కూరలు.. బాగుచేయును రోగాలు!

సంగారెడ్డి జిల్లాలో ఆకట్టుకున్న 'ఆకుకూరల పండుగ'



కూరల వివరాలు తెలుసుకుంటున్న పలు రాష్ట్రాల రైతులు

విత్తనాలు వేయరు.. కలుపు మందులు వాడరు.. అయినా వాటంతట అవే సీజన్లో పెరుగుతాయి. 'సాగుచేయని ఆకుకూరలు'గా పిలిచే ఇవి దాదాపు 150 రకాలదాకా ఉన్నాయంటే నమ్మాల్సిందే మరి. ఇలాంటి అరుదైన మొక్కలను గుర్తించి, పెంచి.. వండుకుని తినడం ద్వారా పౌష్టికాహార లోపం లేకుండా జీవించొచ్చని అవగాహన కల్పించేందుకు ఏటా సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఆకుకూరల పండుగ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం మాచునూర్ శివారులోని పచ్చసాలె ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి రైతులు, ఔత్సాహికులు పాల్గొన్నారు. వారిని క్షేత్ర సందర్శనకు తీసుకెళ్లిన డీడీఎస్ ప్రతినిధులు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. పంటల్లో కలుపు తీసేటప్పుడు కనిపించే సాగు చేయని ఆకుకూరలను సేకరించడం ఎలాగో తెలిపారు. సుమారు 150 రకాలను వారికి చూపించారు. వాటితో అక్కడే వంటకాలు తయారుచేసి తినే అవకాశం కల్పించారు.

- ఝరాసంగం, న్యూస్‌టుడే

# పంచాయతీలకు కరెంట్ షాక్!

## పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు రూ.2,570 కోట్లు

**మూడేళ్లలో రూ.1,097 కోట్ల పెరుగుదల ● సర్పంచులపై చర్యలకు పంచాయతీరాజ్ శాఖ యోచన**



ఆదిలాబాద్ జిల్లాలోని ఓ గ్రామంలో పగలు సైతం వెలుగుతున్న వీధి దీపం

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో.. విద్యుత్ వాడకం ఇప్పుడు ఒక సమస్యగా పరిణమించింది. విద్యుత్ బిల్లుల బకాయిలు ప్రస్తుతం రూ.2,570 కోట్లకు చేరినట్లు అంచనా. పంచాయతీల నిధుల నుంచి సర్కారు కొంత మేర బకాయిలను రాబట్టుకుంటున్నప్పటికీ.. పాలక వర్గాల పొదుపు చర్యలంటూ కొరవడటంతో మూడేళ్ల వ్యవధిలోనే బకాయిలు రూ. 1,097 కోట్ల మేర ఎగబాకాయి. బిల్లులను సక్రమంగా చెల్లించని సర్పంచులపై ఇక కఠిన చర్యలే తరుణోపాయంగా పంచాయతీరాజ్ శాఖ భావిస్తోంది.

గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందంటూ 2010లో ఉమ్మడి రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు ఇవ్వటంతో అప్పటి నుంచి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. బిల్లుల భారం లేకపోవటంతో.. విద్యుత్‌ను విచ్చలవిడిగా వాడటం పెరిగింది. పంచాయతీల్లో సాధారణంగా రక్షిత మంచినీటి పథకాలకు, వీధిలైట్లకు విద్యుత్ అవసరమవుతుంది. బిల్లులను ప్రభుత్వమే చెల్లించే విధానం వల్ల దుబారా పెరిగిపోతున్నట్లుగా గ్రహించిన తెలంగాణ సర్కారు.. ఇక వాటిని పంచాయతీలే చెల్లించుకోవాలంటూ 2016లో ఆదేశాలు ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2010లో ఉత్తర్వులైతే ఇచ్చిందే తప్ప పంచాయతీల బిల్లులు కట్టకపోవటంతో 2016 నాటికి బకాయిలు రూ.1,473 కోట్లకు చేరాయి. బకాయిలను సైతం వసూలు చేయాలని నిర్ణయించిన సర్కారు.. 2016 నుంచి పంచాయతీల నిధుల నుంచి 30 శాతం మేర రాబట్టటం మొదలు పెట్టింది. దీనిపై అప్పట్లో సర్పంచుల నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో దాన్ని 20 శాతానికి కుదించింది. నిబంధనలను విధించినప్పటికీ విద్యుత్ వాడకం బాగా పెరిగిపోవటం, అందుకు తగ్గట్టుగా బిల్లులను చెల్లించకపోవటం వల్ల బకాయిలు ప్రస్తుతం రూ.2570 కోట్లకు చేరాయి. బకాయిల సమస్య తీవ్రంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఒక సమీక్షా సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఇక్కడి నిర్ణయాలకు అనుగుణంగా.. ఇక బిల్లులను కట్టని సర్పంచులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ భావిస్తోంది. రాష్ట్ర ఆర్థిక సంఘం త్వరలో ప్రభుత్వానికి అందజేసే నివేదికలో.. విద్యుత్ వాడకం, బకాయిల అంశాలను విశ్లేషించే అవకాశం ఉంది. ఆర్థిక సంఘం ఛైర్మన్ రాజేశం గౌడ్.. ఇటీవల రాష్ట్ర ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావుతో భేటీ అయ్యి స్థానిక సంస్థల్లోని విద్యుత్ వాడకం, దుబారాలపై చర్చించారు.




### గ్రామాల్లో 15.32 లక్షల వీధిలైట్లు

రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రస్తుతం 15.32 లక్షల వీధిలైట్లు ఉన్నాయి. మొత్తం 16.87 లక్షల విద్యుత్ స్తంభాలు ఉండగా.. వాటిలో 90.82 శాతం స్తంభాలు వీధిలైట్లను కలిగి ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ తాజాగా లెక్కతేల్చింది. మిగతా జిల్లాలతో పోలిస్తే.. నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యధికంగా 95 శాతం, మహబూబాబాద్ జిల్లాలో అతి తక్కువగా 80 శాతం స్తంభాలకు వీధిలైట్లు ఉన్నాయి. రాష్ట్రంలోని గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లే అత్యధికంగా ఉన్నాయి.



## బోనాల ఉత్సవాల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

చార్మినార్, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు ఆవరణలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాలు సంబురాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్‌తో పాటు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సూర్యకిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చలపతిరావు, సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హోమియోతో జీవనశైలి వ్యాధుల నివారణ

- రాష్ట్ర హోమియో వైద్య సదస్సులో చినజీయర్ స్వామిజీ



రాష్ట్ర హోమియో వైద్య సదస్సులో ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామిజీ. వేదికపై ఎస్.వేణుగోపాలాచారి

ఈనాడు, హైదరాబాద్: తక్కువ ఖర్చుతో మంచి ఆరోగ్యాన్నిచ్చే మందు హోమియోపతి అని, దీని ద్వారా జీవనశైలి వ్యాధుల నివారణ సాధ్యమని త్రిదండి చినజీయర్ స్వామిజీ అన్నారు. మూలాల్లోకి వెళ్లి జబ్బును నయం చేసే గుణం హోమియోలో ఉందని..ఇతర మందుల మాదిరి ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియో వైద్య ఫిజీషియన్స్(ఐఐహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ హోమియో వైద్య రెండో సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే రాష్ట్రాల్లో హోమియో అత్యధిక ప్రాచుర్యం పొందిందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉండే మన దేశంలో తక్కువ ఖర్చయ్యే హోమియో వైద్యం అవసరం ఎంతైనా ఉందన్నారు. సదస్సుకు హాజరైన కాబోయే వైద్యులు హోమియో వైభవాన్ని తెలుసుకుని.. అనుభవజ్ఞుల సలహాలు తీసుకుంటూ సమాజం ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. యుక్త వయసులో ఉన్నప్పుడు తనకు ఎదురైన అనుభవం హోమియోపై విశ్వాసం పెంచేందుకు దోహదం చేసిందన్నారు. దేశంలో హోమియో వైద్యం వాడే వారి శాతం 26.3కు పెరిగినట్లు ఆయుష్ మంత్రిత్వ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని దిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి, సదస్సు రిసెప్షన్ కమిటీ ఛైర్మన్ వేణుగోపాలాచారి అన్నారు. దేశంలో హోమియోపతి మార్కెట్ ప్రపంచ మార్కెట్ కంటే వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. ఆయుష్‌విభాగం అదనపు సంచాలకులు జనార్దన్‌రెడ్డి, సునిర్మల్ సర్కార్, ముక్తిందర్‌సింగ్ మాట్లాడారు.

### యాదాద్రిలో జీయర్ ఆశ్రమం!

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి ఆశ్రమంతో పాటు కుటీరం నిర్మించనున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన దృఢ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో స్వామిజీ సలహాలు తీసుకొంటూ ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నారు. స్వామి గౌరవార్థం ఆశ్రమ నిర్మాణానికి రెండున్నర ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం. పెద్దగుట్టపై లేదా గండిచర్ల ప్రాంగణంలో స్థలాన్ని కేటాయించే అవకాశాలున్నాయి.

## 29 నుంచి పీజీఈసెట్ రెండో విడత కౌన్సెలింగ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణ పీజీఈసెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగస్టు 29వ తేదీ నుంచి మొదలవుతుందని సెట్ కన్వీనర్ రమేశ్ బాబు తెలిపారు. తొలివిడత కౌన్సెలింగ్‌లో 6,096 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. కన్వీనర్ కోటాలో 8,694 సీట్లకు 8,963 మంది ఐచ్ఛికాలు(ఆప్షన్లు) ఇచ్చుకోగా తొలివిడతో 6,096 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. ఆంధ్రాబ్యాంకులో చలానా చెల్లించి ఆగస్టు 23వ తేదీలోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని, 26వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

## బీబీనగర్ ఎయిమ్స్‌లో 27 నుంచి తరగతులు

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని ఎయిమ్స్ లో ఈ నెల 27 నుంచి వైద్య విద్య తరగతులు ప్రారంభమవుతాయని భోపాల్ ఎయిమ్స్ డైరెక్టర్, బీబీనగర్ ఎయిమ్స్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ శర్వాన్ సింగ్ తెలిపారు. బీబీనగర్‌లో ఎయిమ్స్‌కు కేటాయించిన భవన సముదాయాల్లో వైద్య విద్య తరగతుల ఆరంభానికి జరుగుతున్న పనులను ఆదివారం పరిశీలించారు. విద్యార్థుల వసతి గృహ సముదాయాలు, తరగతులు, ల్యాబ్‌లను చూసి నిర్మాణ విభాగపు అధికారులకు పలు సూచనలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ..ఈ ఏడాది తరగతులను ప్రారంభించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 50 వైద్య విద్య సీట్లకు కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థుల ఎంపిక పూర్తయ్యిందని తెలిపారు. తరగతులకు హాజరయ్యే వారి పూర్తి వివరాలు త్వరలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడిస్తుందని చెప్పారు. ఆయన వెంట భోపాల్ ఎయిమ్స్ రిజిస్ట్రార్ అబ్రహం, డీన్ అర్మిత్ ఆరోరా, నిమ్స్ పర్యవేక్షకుడు మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర వైద్య విద్యాధికారులు ఉన్నారు.

## కాళేశ్వరం.. పెద్ద కుంభకోణం

- విచారణ చేయాలని అమిత్‌షాను కలుస్తా
- బలం లేకే భాజపా ఇతర పార్టీల నేతల్ని చేర్చుకుంటోంది: భట్టివిక్రమార్క



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో తెరాస ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో చేపట్టిన ప్రాజెక్టుల్లో భారీ కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాను కలిసి కోరతామని చెప్పారు. దీనిపై భాజపా రాష్ట్ర నాయకత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కేసీఆర్ స్కీములన్నీ స్కాములేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఇప్పుడు అంటున్నారని.. వీటిపై కాంగ్రెస్ పార్టీ ఆరేళ్లుగా పోరాటం చేస్తోందని తెలిపారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో భట్టివిక్రమార్క విలేకర్లతో మాట్లాడుతూ.. రూ.28వేల కోట్లతో పూర్తయ్యే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్ల వ్యయం చేస్తున్నారని ఆరోపించారు. రీడిజైనింగ్ పేరుతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పెద్ద కుంభకోణమని అన్నారు. సీతారామసాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులదీ అదే దారి అని చెప్పారు. మరోవైపు తెరాసకు కాంగ్రెస్ తోక పార్టీ అని లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 2014 ఎన్నికల తర్వాత నుంచి కేంద్రంలో భాజపా, తెరాస కలిసి పనిచేస్తున్న విషయం అందరికీ తెలుసన్నారు. కేంద్రంలో భాజపాకు అవసరమైనప్పుడల్లా తెరాస మద్దతిస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో పట్టు లేకనే, ఎక్కడా అవకాశం లేని ఇతర పార్టీల నేతలను భాజపా చేర్చుకుంటోందన్నారు. రాష్ట్ర నిధులు ఒక కుటుంబానికే దక్కేలా కార్యాలయాల్లో కూర్చుని టెండర్లను నిర్ణయిస్తున్నారని, కొంతమంది సూత్రధారుల ద్వారా పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. రూ.59వేల కోట్ల మిషన్ భగీరథ పనులూ అలాగే చేశారన్నారు.

## కాళోజీ వర్సిటీలో 19 పోస్టులకు నియామక ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో 19 పోస్టులను శాశ్వత నియామక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు వర్సిటీ ప్రకటన వెలువరించింది. 15 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 4 జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టులకు ఈనెల 18వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సెప్టెంబరు 7 రుసుము చెల్లించడానికి.. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. అక్టోబరు 20న రాతపరీక్షను నిర్వహిస్తారు. అందులో వచ్చిన మార్కుల ప్రాతిపదికన రిజర్వేషన్ నిబంధనలను అనుసరించి పోస్టులను భర్తీ చేస్తారు.

## సర్వాయి పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తాం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గౌడలకు హామీ ఇచ్చారు. తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలో సర్వాయి పాపన్నగౌడ్ 369వ జయంతిని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, భాజపా నాయకులు మురళీధర్‌రావు, కె. లక్ష్మణ్, దత్తాత్రేయ తదితరులు వేర్వేరుగా పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గొప్ప బహుజన పోరాట యోధుడన్నారు. ఆయన చరిత్రను భావి తరాలకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో భాజపా అధికారంలోకి వచ్చాక కల్లు అమ్మకాలను సొసైటీలకు అప్పగించడంతోపాటు జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు బాలరాజుగౌడ్, నాగరాజుగౌడ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న విగ్రహం వద్ద గౌడల ఐక్యతపై నినదిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే గోపాల్, గౌడ సంఘం నాయకులు

ఛాయాచిత్ర పోటీల్లో విజేతలుగా నిలిచిన ఫొటోగ్రాఫర్లకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బహుమతులు అందజేశారు. వారిలో బహుమతులు అందుకున్న ఈనాడు ఫొటోగ్రాఫర్లు వరుసగా ఆవుల శ్రీనివాస్, కంది శివప్రసాద్, కె.శ్రీనివాస్, రాజమౌళి, రమేశ్, రాఘవేందర్, రవీందర్




# ప్రమాదానికి ప్రయాణం

➡ పేరు 7 సీటర్ ఆటో.. ఎక్కేది 15-20 మందిపైనే ➡ ప్రమాదాలకు గరిష్ఠ అవకాశం

➡ గాలిలో దీపాల్లా ప్రయాణికుల ప్రాణాలు ➡ కరవైన ప్రభుత్వ నియంత్రణ

ఈనాడు - హైదరాబాద్

✦ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ వద్ద సోమవారం పోలీసుల కంటపడిన 7 సీటర్ ఆటోలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య అక్షరాలా 24.

✦ మహబూబ్‌నగర్ జిల్లాలో మిడ్జిల్ నుంచి వెళుతున్న ఓ ఆటోలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య 16. ఇదే మండలంలో గడిచిన వారంలో ఎదురుగా వస్తున్న లారీ.. ఆటోను ఢీ కొట్టడంతో 13 మంది మృత్యువాత పడ్డారు.

పరిమితికి మించి ప్రయాణికులను కుక్కి ప్రయాణించే వాహనాలు కనిపించని ఘడియ లేదు. రక్తంతో తడవని రహదారి లేదు. అయినా నియంత్రణ దిశగా యంత్రాంగం పటిష్ఠ కార్యాచరణతో ముందుకు రావడం లేదు. కేవలం ఆటోలనే కాదు, జీపులు, పలుచోట్ల ఆర్టీసీ బస్సుల పరిస్థితీ ఇలానే ఉంది. ప్రజా రవాణా పటిష్ఠంగా లేకపోవటం, సామర్థ్యాన్ని మించి ప్రయాణికులతో వెళ్లే వాహనాలను కట్టడి చేసే యంత్రాంగం లేకపోవడం, పట్టుపడితే భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న భయం వాహన డ్రైవర్లలో లేకపోవటం.. ఏదో ఒక వాహనం ఎక్కి.. కాస్త సర్దుకునైనా త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్న ప్రజల బలహీనత.. వెరసి రహదారులు రణక్షేత్రాలవుతున్నాయి. అమాయక ప్రజలు అర్ధాయుష్షుతో జీవితం చాలిస్తున్నారు. మృతుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



ఆదిలాబాద్ జిల్లా సిరికొండ-వాయిపేట మార్గంలో మ్యాక్సీ జీప్ లోపల, పైన కిక్కిరిసిన ప్రయాణికులు

### లోపం ఎక్కడ

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ సర్వీసులు పరిమిత సంఖ్యలోనే ఉండడంతో ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలే శరణ్యమవుతున్నాయి. ప్రయివేటు రవాణా రాజ్యమేలుతోంది. ఆటోలు, జీపులే కాదు ఆర్టీసీ బస్సులూ జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకుంటే మృతుల సంఖ్య ఆందోళన కలిగించే సంఖ్యలో ఉంటోంది. ప్రజల అవసరాలకు తగిన సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడపలేని పరిస్థితి ఇందుకు కారణమన్న అభిప్రాయం వ్యక్తం అవుతుండగా.. పీకల్లోతు అప్పులు, నష్టాల్లో ఉన్న ఆర్టీసీ, ప్రజల అవసరాలకు తగినట్లు బస్సులు నడపలేని పరిస్థితిలో ఉందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సమస్యకు మూలాన్ని గుర్తించి, దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ప్రైవేటు వాహన నిర్వాహకులు, ప్రయాణికుల్లో అవగాహన కల్పించటంతో పాటు నిబంధనలను కఠినతరం చేయాల్సి ఉంది.




లోపల కిటకిటలాడుతున్న ప్రయాణికులు. పైన ప్రమాదకరమైన గ్యాస్ సిలిండర్‌తో నిండుకుండలా ప్రయాణిస్తున్న ఆటో. ప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం అంచనాకు కూడా అందని పరిస్థితి. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ రోడ్డులో ఈ దృశ్యం కనిపించింది

## శంషాబాద్ విమానాశ్రయంలో తూటాల కలకలం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఓ ప్రయాణికుడి సామగ్రిలో తూటాలు లభించిన ఘటన ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో కలకలం రేపింది. హై అలర్ట్ కొనసాగుతున్న తరుణంలో విమానాశ్రయంలో తూటాలు దొరకడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే సదరు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని ఆర్జీఐఏ ఠాణా పోలీసులకు అప్పగించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన అంకిత్‌సింగ్ మహర(39) హైదరాబాద్‌లోని ఓ ఆటోమొబైల్ సంస్థలో పని చేస్తున్నాడు. దిల్లీ వెళుతున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం టికెట్ తీసుకొని ఒకటి ఉపయోగించని, మరొటి వాడిన తూటాలను తన సామగ్రిలో పెట్టుకుని విమానాశ్రయానికి వచ్చాడు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో ఆ రెండు తూటాలు లభించాయి. తూటాలకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను చూపించకపోవడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### నకిలీ టికెట్లతో దిల్లీ వెళ్లడానికి యత్నించిన ఇద్దరిపై కేసు

నకిలీ టికెట్లతో దిల్లీ వెళ్లడానికి యత్నించిన ఇద్దరు ప్రయాణికులను ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలోని రాయచూరుకు చెందిన దౌల్‌సాబ్, లక్ష్మీలు ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో దిల్లీ వెళ్లడానికి విమానాశ్రయానికి చేరుకున్నారు. సదరు ప్రయాణికుల ప్రవర్తనపై అనుమానం రావడంతో టికెట్లు, గుర్తింపు పత్రాలను పరిశీలించి నకిలీ టికెట్లుగా తేల్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# విదేశాల్లో పాస్.. దేశంలో ఫెయిల్!

- ఇతర దేశాల్లో వైద్యవిద్య అభ్యసించిన వారిలో 80 శాతానికిపైగా ఎంసీఐ అర్హత పరీక్షలో విఫలం
- 2015-18 ఎఫ్ఎంజీఈ ఫలితాల వివరాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: స్వల్ప రుసుము.. సమాన గౌరవంతో చేతికందే పట్టా తదితర సానుకూలాంశాలతో భారత విద్యార్థులు విదేశాల్లో వైద్యవిద్య వైపు మొగ్గుచూపుతున్నా.. స్వదేశంలో నిర్వహించే పరీక్షలో సత్తా చాటలేకపోతున్నారు. 2015-18 మధ్య విదేశాల్లో వైద్యవిద్యను పూర్తిచేసుకొని మన దేశంలో అర్హత పరీక్షను రాసి ఉత్తీర్ణత సాధించినవారి సమాచారాన్ని భారతీయ వైద్యమండలి(ఎంసీఐ) ఆదివారం వెల్లడించింది. అర్హత పరీక్ష(ఎఫ్ఎంజీఈ)లో సగటున కేవలం 20 శాతం కంటే తక్కువగా ఉత్తీర్ణత ఉండడం గమనార్హం. ఏటా భారత్ నుంచి చైనా, ఉక్రెయిన్, నేపాల్, ఫిలిప్పీన్స్, రష్యా, హంగేరీ, బల్గేరియా, కిర్గిస్థాన్ తదితర దేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 15 వేలకుపైనే ఉంటోందని అంచనాకాగా అందులో ఒక్క తెలుగు రాష్ట్రాల నుంచి విదేశీ వైద్యవిద్యకు వెళ్లేవారే ఏటా 3000 మంది వరకూ ఉంటారని తెలుస్తోంది. మరోవైపు ఎఫ్ఎంజీఈ కూడా ఇక మనుగడలో ఉండదు.

### ఎందుకు విదేశాల వైపు?

◆ మన దేశంలో ప్రైవేటు కళాశాలల్లో ఎంబీబీఎస్ ఐదేళ్ల కోర్సుకు సగటున రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ ఖర్చవుతోందని అంచనా. అదే విదేశాల్లో ఐదారేళ్ల వైద్యవిద్యను పూర్తిచేయడానికి వసతి, భోజనాదులన్నీ కలిపి అయ్యేది ఇందులో సగమే!

◆ ఉదాహరణకు చైనా, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్‌లలో రూ.20-25లక్షలు, కిర్గిస్థాన్‌లో రూ.16-20లక్షలు, రష్యాలో రూ.20-22 లక్షలు ఖర్చవుతుందని చెబుతున్నారు.

### వైఫల్యానికి కారణాలు?

◆ మన దేశ వైద్యవిద్య నాణ్యత ప్రమాణాలకు తగ్గట్టుగా కొన్ని దేశాల్లో వైద్యవిద్యను అందించలేకపోవడం.

◆ కళాశాల ఎంపికలోనే పొరపాటు పడడం.

◆ స్థానిక భాష అర్థం కాకపోవడం..

◆ కేవలం అకడమిక్‌గా ఉత్తీర్ణత సాధిస్తే చాలనే ధోరణిలో పాఠ్యాంశాలపైనే దృష్టిపెట్టడం

### విదేశాల్లో కళాశాల ఎంపికలో జాగ్రత్తలు

◆ ఎంసీఐ అనుమతించిన దేశాలను, కళాశాలలను మాత్రమే ఎంచుకోవాలి.

◆ విదేశీ వైద్య కళాశాలలో చేరడానికి ముందే.. ఎంసీఐ నుంచి అర్హత ధ్రువపత్రాన్ని(ఈసీ) పొందాలి.

◆ ఆంగ్లంలో బోధించే కళాశాలను ఎంచుకోవడం ఉత్తమం.

◆ అర్హత పరీక్షను దృష్టిలో ఉంచుకొని వైద్య కళాశాలలో చేరిన తొలిరోజు నుంచే ఈ దిశగానే కృషిచేయాలి.

(విదేశాల్లోని వివిధ కళాశాలల్లో వైద్యవిద్య చదివిన భారత విద్యార్థులు.. ఎంసీఐ పరీక్షలో ఉత్తీర్ణతా శాతం వివరాలు ఈనాడు.నెట్‌లో..)

## మాజీ ఎమ్మెల్యే రాజా సోంభూపాల్ కన్నుమూత



చిన్నచింతకుంట, న్యూస్‌టుడే: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరచింత మాజీ ఎమ్మెల్యే రాజా సోంభూపాల్(92) అనారోగ్యంతో కన్నుమూశారు. చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌కు చెందిన ఆయన హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 1962, 1967లో స్వతంత్ర ఎమ్మెల్యేగా, 1972లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆత్మకూర్ సంస్థానం చివరి రాజుగా చక్కని పాలనతో ప్రజల మన్ననలు పొందారు. నిజాం రాజ్యం విలీనం తర్వాత రాచరిక వ్యవస్థ రద్దవ్వడంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు.

## కొట్టేసిన జీవో అమలుకు ఆందోళన విడ్డూరం: టీఎస్‌పీటీఏ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నష్టం కలిగించే జీవో-15ను కోర్టు కొట్టేసినా అమలు చేయాలని పండిట్, పీఈటీలు ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందని టీఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.విశ్వనాథ సత్యం అన్నారు. సికింద్రాబాద్‌లో ఆదివారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్జీటీలకు నష్టం కలిగించే ఆందోళనకు మద్దతు తెలిపే సంఘాలను సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు నిలదీయాలని పిలుపునిచ్చారు.

ఓ చిత్రంలో అచ్చెరువొందే ప్రకృతి దృశ్యాలుంటాయి. మరోదాంట్లో ఆశ్చర్యపరిచే విశేషాలుంటాయి. అదే చిత్రంలో మనసున్న మారాజులుంటే.. పది మందికీ స్ఫూర్తినిస్తుంది. ఈ ఛాయాచిత్రాల వెనకున్న కథలు మానవత్వానికి చిరునామాలు..

మనసు చిత్రం



నేడు ప్రపంచ ప్రెస్ ఫొటోగ్రఫీ దినోత్సవం



## ...హరి ఉన్నారు!

విశాఖపట్నం.. రద్దీగా ఉన్న ఓ దారి. రోడ్డు పక్కన చింపిరి జుట్టుతో, నెరిసిన గడ్డంతో ఓ అభాగ్యుడు.. అందరూ ఛీదరించుకుంటున్నారు. ఇంతలో ఓ యువకుడు వచ్చాడు. అతన్ని ఆప్యాయంగా పలకరించాడు. ఆ పక్కనే కూర్చోబెట్టి.. కటింగ్, షేవింగ్ చేశాడు. ఆ మనిషి ముఖంలో కొత్త తేజస్సు, కళ్లల్లో నీళ్లు. తోచిందేదో అతడి చేతిలో ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడా యువకుడు. వృద్ధులకు, మతిస్థిమితం కోల్పోయిన వారి బాగోగులు చూసుకునే ఆ యువకుడి పేరు హరిప్రసాద్. ఎంబీఏ చదువుతున్నాడు. సమాజ సేవలో ఎప్పుడూ ముందుంటాడు. 2008లో యువసేన ఫౌండేషన్ స్థాపించాడు. రక్తదానాలు, మన్యంలో గిరిజనులకు అవగాహన సదస్సులు, వృద్ధులకు సపర్యలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

బి.గోపికృష్ణ, విశాఖపట్నం




## రీతులు మార్చే రాతలు

'నాకెందుకు?' మనసు స్పందించాల్సిన ప్రతిసారీ.. వెనక్కి నెట్టే మాట ఇది. ఆయన అలా అనుకోలేదు. 'నా వంతుగా' అనుకున్నారు. అంతటితో వదిలేయలేదు. రోజుకు రెండు గంటలు కష్టపడుతున్నారు. నెలకు రూ.800కు పైగా ఖర్చు చేస్తున్నారు. మెరుగైన సమాజం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం ఎనిమిదేళ్లుగా కృషి చేస్తున్నారు చిత్తూరువాసి మురళి. యోగా శిక్షకుడు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్లాస్టిక్ వాడకం, పర్యావరణ కాలుష్యంపై కలత చెందారు. ప్రకృతిని కాపాడడానికి సమాజాన్ని జాగృతం చేయాలనుకున్నారు. తన సంకల్పానికి అక్షర రూపమిచ్చి.. సూక్తులుగా గోడలపై రాయడం మొదలుపెట్టారు. చిత్తూరు పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల్లో కలిపి 12,000 ప్రాంతాల్లో కర్తవ్యబోధ చేశారు. వేలాది మొక్కలు నాటారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇంకుడు గుంతలు తవ్వించడం, మట్టి గణపతుల పంపిణీ, ప్లాస్టిక్ వ్యతిరేక సదస్సులు ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంట్లో వాళ్లు వ్యతిరేకించినా, ఆర్థిక వనరులు చాలకున్నా, ఆరోగ్యం సహకరించకున్నా.. తన రాతలు ఒక్కరిలో మార్పు తెచ్చినా అదే పదివేలు అంటారు మురళి.

ఫొటో: సుబ్రహ్మణ్యం, చిత్తూరు

## ఆకలి తీర్చే వీధి

ఇంటికి అతిథి వస్తే.. ఇప్పుడెందుకు వచ్చాడనుకునే రోజులు. ఎప్పుడు వెళ్లిపోతాడా అని చూసే మనుషులు. ఈ కాలంలోనూ వచ్చిన వారికి కాదనకుండా భోజనం పెడుతున్నారీ దంపతులు. దారినపోయే వారెవరైనా సరే.. ఆకలితో ఆ వీధిలోకి వెళ్తే ఖాళీ కడుపుతో తిరిగిరారు. ఈ నిత్యాన్నదానం విజయవాడ మ్యూజియం రోడ్డులో జరుగుతోంది. కె.ఎల్ యూనివర్సిటీ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ ఆయన భార్య శివకాంచన లత పదిహేనేళ్లుగా ఈ బృహత్కార్యాన్ని నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. తమ కళాశాల హాస్టల్‌లో వండిన ఆహార పదార్థాలను నిత్యం అన్నార్తులకు దానం చేస్తారు. సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర ప్యాకెట్లు కట్టి వచ్చిన వారికి లేదనకుండా పంచుతారు. నగరానికి పనిపై వచ్చే వాళ్లు, నిరుద్యోగులు, నిరుపేద వృద్ధులు ఇలా ఎందరో ఇక్కడ ఆకలి తీర్చుకుంటుంటారు.

ఫొటో: బి.మరిడయ్య



వారి నినాదం

# హైజలాబాద్!

**బ్యాంకులో డబ్బు ఎలా దాచుకుంటామో...**
**భూగర్భంలో నీటిని అలా దాచుకోవాలి..**
**లేదంటే మనుగడ లేదు. ఇప్పటికే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయ్...**
**అతి చిన్న కార్యాచరణ... మీ ఇంటి భూగర్భాన్ని నీటితో నింపుతుంది.**
**కొద్దిపాటి శ్రమ మీతో పాటు పదిమంది దాహం తీరుస్తుంది...**
**అంటున్నారు విజయరామ్...**
**సేంద్రియ వ్యవసాయవేత్తగా ఖ్యాతి పొందిన ఈయన హైదరాబాద్‌కు అవసరమైన నీటి సంరక్షణ ప్రణాళికలను వినూత్న పద్ధతిలో ప్రచారం చేస్తున్నారు. నెల రోజులుగా ఉద్యమంలా దీన్ని ముందుకు తీసుకెళుతున్నారు.**



తీసుకున్నప్పుడు ఇవ్వడం కూడా తెలిసుండాలి.

లేకుంటే చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది...

ప్రకృతి నుంచి ఎన్నో తీసుకుంటున్న మనం తిరిగి ఇస్తోందేంటి?

విధ్వంసాన్ని...

దాని పర్యవసానం కూడా అంతే తీవ్రంగా ఉంటుంది...

ప్రకృతి మనకిచ్చే రిటర్న్ గిఫ్ట్...

విలయం... దుర్భిక్షం

ఆ పరిస్థితులు రాకుండా ఉండాలంటే మనం మేల్కోవాలి.

హైదరాబాద్ మహా నగరం... జనాభా కోటికి చేరుతోంది.

ఇరవై ఏళ్ల క్రితం పుష్కలంగా భూగర్భ జలాలు అందుబాటులో ఉండేవి. నగరంలోని చాలా ప్రాంతాల్లో 150 అడుగుల్లో నీరుండేది. ఇప్పుడు 500 అడుగుల లోపు భూగర్భ జలాలున్న ప్రాంతాలు చాలా అరుదు. దీనికి కారణం మనమే. అందినంతమేరా నీటిని వాడుకున్న మనం తిరిగి భూమి పొరల్లోకి జలాలను పంపలేదు. ఇప్పుడు ఆ పనికి సమాయత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందంటున్నారు విజయరామ్. ఇంకుడు గుంతలతో నగర గర్భాన్ని సస్యశ్యామలం చేసే ప్రయత్నం మొదలుపెట్టారు. దీనికి కావాల్సింది కొద్దిపాటి స్థలం, కొంచెం శ్రమ. అంతే... అంటూ విజయరామ్ బృందం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. ఈ స్ఫూర్తితో నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంకుడు గుంతల తవ్వకం కార్యక్రమం జరుగుతోంది.

..............................

అనగనగా ఓ కాకి

ఎక్కడా నీరు దొరకలేదు..

ఓ కుండలో అడుగున ఉన్న నీటిని తాగి దాహం తీర్చుకోవాలనుకుంది.

నాలుగు రాళ్లను కుండలో వేసి నీటిని పైకి వచ్చేలా చేసింది.

చిన్నప్పుడు చదువుకున్న కథ.

కుండలో నీళ్లు అందనప్పుడు గులకరాళ్లు వేసి నీటిమట్టాన్ని పెంచి తన దాహాన్ని తీర్చుకుందా కాకి...

ఇప్పుడు మన కింకర్తవ్యమూ అదే. మీ



**ఇంట్లో ఓ గుంత తీసి నాలుగు రాళ్లు వెయ్యి చాలు... ఆ రాళ్లు రత్నాలుగా మారతాయి. భూగర్భంలో జలజలారావాలు వినిపిస్తాయి. వాటిని మీరూ వినొచ్చు. దానికి కావాల్సింది కేవలం మీ సంకల్పం...**

నగరంలో 100 గజాల్లో ఎక్కువ నివాసాలున్నాయి. 300-500 గజాల్లో గ్రూప్ హౌస్‌లు, అపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రతిచోటా ఆరు అడుగుల స్థలం కేటాయించడం పెద్ద కష్టమైన విషయం కాదు. ఆరు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పు, ఎనిమిది అడుగుల లోతున్న ఇంకుడు గుంత 250 నుంచి 500 గజాల భూగర్భాన్ని నీటితో నింపుతుంది. మరి ఈ మాత్రం చోటు కూడా లేని వాళ్లేం చేయాలి?... ద్విచక్ర వాహనం పెట్టుకునే కింది భాగాన్ని ఇంకుడు గుంతగా మార్చి దానిపై పార్కింగ్ చేసుకోవచ్చు. మూడు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పు భూమి దొరికినా చాలు దాన్ని జలవంతం చేయొచ్చని చేసి చూపిస్తున్నారు. చదరపు గజం భూగర్భంలో మనం 824 లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. కానీ ఆ విషయాన్ని ఎవరూ లక్ష్య పెట్టడం లేదు. కురుస్తున్న వానలో 92 శాతం వృథాగా కాలువల వెంట వెళ్లిపోతుంటే కళ్లప్పగించి చూస్తున్నాం. వాటికి అడ్డుకట్ట వేయాల్సిన విధానాలను వారు ప్రచారం చేస్తున్నారు.

### వట్టిపోయిన బోర్లకు జీవం...

హైదరాబాద్ నగరంలో నీటి చెమ్మ కూడా లేకుండా ఎండిపోయిన బోర్‌వెల్స్ కొన్ని వేలున్నాయి. నీరందక ఓ మూలన పడిపోయిన ఈ గొట్టపు బావులను ఇంకుడు గుంతలుగా మార్చడంపై వీరు ప్రత్యేకంగా దృష్టిపెట్టారు.

సాధారణంగా అలా నీరింకిన ఆ గొట్టపు బావులను కేసింగ్ పైపుతో సహా అలాగే వదిలేస్తాం. వీళ్లేం చేస్తున్నారంటే... ఎండిపోయిన ఆ బోర్ చుట్టూ ఉన్న భాగాన్ని లోతుగా తవ్వుతారు. కేసింగ్‌పైపుకు నాలుగు వైపులా ఓ పద్ధతిగా రంధ్రాలు చేస్తారు. దానికి స్టీల్ మెష్‌ను చుట్టి, గులకరాళ్లు, ఇసుకతో దాన్ని నింపేస్తారు. ఇప్పుడా కేసింగ్ పైపునకు ఇంటి పైనుంచి నీరు పడే గొట్టాన్ని అనుసంధానం చేస్తారు. అంతే ఆ పనికి రాని బోర్‌వెల్ కాస్తా అద్భుతమైన ఇంకుడు గుంతగా మారిపోతుంది. సాధారణంగా వీటి ద్వారా భూగర్భంలోకి జలం చేరి అక్కడ నీటి మట్టం పెరగడానికి కొన్ని నెలలు పడుతుంది. అయితే ఈ బోర్‌వెల్‌ను ఇంకుడు గుంతగా మార్చినచోట నీటిమట్టం రెండురోజుల్లోనే గణనీయంగా పెరిగిన ఉదాహరణలు చాలా ఉన్నాయని విజయరామ్ చెబుతున్నారు. ఇలాంటి బోర్లు ఉన్న ఎక్కడైనా ఇలా చేయొచ్చు. మంచి ఫలితాలు పొందొచ్చని చెబుతున్నారాయన. దీనికయ్యే ఖర్చూ తక్కువే.



నగరాల్లో పేవ్‌మెంట్లు, ట్రాఫిక్ ఐలండ్లు, డివైడర్ల కింది భాగాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చు. వాటన్నిటినీ ఇంకుడు గుంతలుగా మార్చే ప్రణాళిక అమలుకు ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధమంటున్నారు.

### ఇలా చేస్తే:

- నగరంలో ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు శనివారం కూడా సెలవు ప్రకటించాలి. దాన్ని నీటి సంరక్షణ కార్యక్రమాలకు కోసం కేటాయించాలి.
- ప్రతి ప్రభుత్వ శాఖలోనూ ఈ విషయంపై విస్తృత ప్రచారం చేయాలి. పని వెసులుబాటు ఉన్న ఫైర్ డిపార్టుమెంట్ వంటి వాటిని జలసంరక్షణ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి.
- వైద్యులు రాసే ప్రిస్క్రిప్షన్ కింది భాగంలో నీటి విలువను గురించిన సూచనలు పెట్టి ఇవ్వచ్చు.

–మేకల రవికుమార్



**చిన్నపుడు జరిగిన ఒక సంఘటన..**
**అతన్ని ఏనుగుల డాక్టర్‌ను చేసింది.**
**ఏటా 700 గజరాజులకు సేవలందించేలా చేసింది.**
**ఎలిఫెంట్ మ్యాన్ ఆఫ్ ఏషియా అనే పేరుకు కారణమైంది.**
**60 ఏళ్ల వయసులోనూ హుషారుగా ట్రాన్‌క్విలైజర్ చేతపట్టుకుని, మందుల కిట్ నడుముకు బిగించుకుని వందల కొద్దీ కి.మీ. ప్రయాణం చేసేలా చేస్తోంది.**
**ఆ సంఘటన ఏంటో.. ఆ కథేంటో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం!**

# ఏనుగుల మనసు ఆయనకు తెలుసు!

నా పేరు కుశాల్ కున్వార్ శర్మ. నేను పుట్టిందీ పెరిగిందీ అసోంలోని నల్బారి జిల్లా బరామా అనే కుగ్రామంలో. 35-40 మంది ఉండే మా ఉమ్మడి కుటుంబంలో లక్ష్మి అనే ఏనుగు కూడా ఉండేది. అప్పుడు నాకు 7-8 ఏళ్లుంటాయి. లక్ష్మి, నేను చెట్టాపట్టాలేసుకుని దగ్గరున్న అడవుల్లో స్నేహితుల్లా తిరిగేవాళ్లం. ఆ సమయంలో మా నాన్నకు వేరే ప్రాంతానికి బదిలీ అయింది. నేను, అమ్మ, నా సహోదరులతో అక్కడకు వెళ్లాం. ఓ రెండేళ్ల తర్వాత తిరిగి అమ్మమ్మ దగ్గరకు వచ్చాను. లక్ష్మి కోసం చూశాను. కానీ ఎక్కడా కనిపించలేదు. ఏదో ఇన్‌ఫెక్షన్ సోకి అది చనిపోయిందని తర్వాత తెలిసింది. నా మనసు మనసులో లేదు. ఆ తర్వాత చాలా కాలం పాటు నాకు కలలో లక్ష్మీనే కనిపించేది. ఆ సంఘటనే నన్ను ఓ జంతు వైద్యుడిగా, ప్రొఫెసర్‌గా మార్చింది. 1978లో ఇంటర్ తరువాత వైద్య విద్యతో పాటు ఇంజినీరింగ్, బీఫార్మసీ, ఫిషరీస్ వంటి వాటికి కూడా నాకు ప్రభుత్వ సీటు, స్కాలర్‌షిప్‌లు వచ్చాయి. అయితే నేను మాత్రం వెటర్నటీ కళాశాల వైపు అడుగులు వేశాను. చదువు పూర్తయ్యాక గువహటిలోని అసోం అగ్రికల్చరల్ యూనివర్సిటీలో వెటర్నరీ సర్జరీ, రేడియాలజీలో పీహెచ్‌డీ కూడా చేశాను. రిమోట్ ఇంజెక్షన్ టెక్నిక్‌ను నేర్చుకున్నాను. వన్యమృగ రక్షణ ధోరణుల్లో ఇది విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. ఆ తర్వాత నేను ఏనుగులకు మత్తుమందు ఇవ్వడంపైనా పీహెచ్‌డీ చేశాను. ఇక అప్పటి నుంచి వన్యప్రాణుల రక్షణే ధ్యేయంగా సేవలందిస్తున్నాను.



ఈ 32 ఏళ్లలో ఏటా 700కు పైగా ఏనుగులకు సేవలందించాను. వేలకొద్దీ వన్యమృగాలకూ సర్జరీలు చేసి ఉంటాను. ప్రారంభంలో నేను ఆసియా ఏనుగుల ఆరోగ్య సంరక్షణపై, వాటి నుంచి గ్రామాలను కాపాడడంపై దృష్టి సారించాను. తర్వాత మనుషుల, ఏనుగుల మధ్య ఉన్న సంఘర్షణను తగ్గించడానికి... వన్యమృగ సంరక్షణకు పనిచేయడం మొదలుపెట్టాను. గత 32 ఏళ్లలో నా కోసం కానీ, నా ఇద్దరు పిల్లల కోసం కానీ వారాంతపు సెలవును వినియోగించుకోనేలేదు. వాళ్లు కూడా నన్ను అర్థం చేసుకున్నారు. బహుశా అందుకేనేమో నా కూతురు కూడా వన్య మృగ వైద్యురాలిగా మారింది.

### 20 సార్లు బయట పడ్డా...

ఇప్పటికి దాదాపు 20 సార్లు వెంట్రుకవాసిలో ప్రాణాపాయాల నుంచి తప్పించుకున్నాను. 139 గాడితప్పిన మగ ఏనుగులను దారిలోకి తెచ్చాను. వందకు పైగా గజరాజులను ప్రమాదాల నుంచి కాపాడాను. అసోం, పశ్చిమ బంగ, ఉత్తర్ ప్రదేశ్‌లలో విధ్వంసం సృష్టించిన 40 రైనోలకు దూరం నుంచి ట్రాన్‌క్విలైజర్ ద్వారా మత్తుమందు ఇచ్చాను. అలాగే పులులు, చిరుత, అడవి దున్నలనూ దారిలోకి తెచ్చాను. వీటన్నిటితో చాలా అనుభవాలున్నాయి. చాలా నిద్రలేని రాత్రులున్నాయి. ప్రాణాల మీదకు వచ్చిన పరిస్థితులూ ఉన్నాయి.

**భారత్‌లో 27,000కు పైగా ఏనుగులు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసియా ఏనుగుల జనాభాలో ఇది సగానికి సమానం. మన వద్ద ఏనుగులపై గౌరవం ఎక్కువే. అయితే అవి నివసించే ప్రాంతాలు కుచించుకుపోతున్నాయి. అందువల్లే గ్రామాలపై దాడుల వంటివి కనిపిస్తుంటాయి. ఏనుగులు విత్తనాలను పారజల్లడం ద్వారా అడవులు పెరగడానికి దోహదం చేస్తాయి. భూమిని కాపాడతాయి. అంతే కాదు.. ఇప్పుడు ఏనుగుల్లోని జీన్ పీ53 ద్వారా కొన్ని రకాల క్యాన్సర్లకు శాస్త్రవేత్తలు చికిత్సను కూడా కనిపెట్టారు. కాబట్టి మనం బతకడమే కాకుండా.. వాటిని బతకనివ్వాలన్న విషయం మనం గుర్తుపెట్టుకోవాలి.**

అవార్డులు: వైల్డ్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్ అవార్డ్, లేట్ శ్రీ ఎల్.ఓ. దాండే మెమోరియల్ సిల్వర్ జూబ్లీ అవార్డ్, జ్యోతి ప్రోవా బోరా ఫౌండేషన్ అవార్డ్, జ్యోతి ప్రోవా, మఖాన్ చంద్ర బోరా మెమోరియల్ ఫౌండేషన్ అవార్డు.

-బెజవాడ వెంకటేశ్వర్లు

# ఈనాడు సినిమా

## ఒక ప్రశ్న ఒక జవాబు



కీరవాణి

**ప్రశ్న: ఓ సినిమా సరిగా ఆడకపోతే... అందులో సంగీత దర్శకుడి బాధ్యత ఎంత?**

కీరవాణి: సినిమా అనే కారుకి నాలుగు చక్రాలుంటాయి. అందులో సంగీతం ఓ చక్రం మాత్రమే. ఓ టైరు లేకుండా కారుని నడపమంటే వంకరగా పోతుంది. అంతే తప్ప ప్రయాణం ఆగదు. సినిమా ఫలితం ఎప్పుడూ దర్శకుడి చేతుల్లో, కథ చేతుల్లో ఉంటుంది. మంచి పాటల్ని రాబట్టుకోవాలంటే సదరు దర్శకుడికి సంగీతాభిరుచి ఉండాల్సిందే. కె.రాఘవేంద్రరావు, రాంగోపాల్ వర్మ, కె.విశ్వనాథ్, రాజమౌళి.. వీళ్లందరికీ సంగీతంపై అవగాహన ఉంది. అలాగని రాఘవేంద్రరావు గిటారు ప్లే చేయరు. వర్మ తబలా వాయించరు. ఎలాంటి పాట కావాలో వాళ్లకు స్పష్టత ఉంటుంది. మేం ఏమైనా చెబితే స్పందిస్తారు. అలాంటి చోట తప్పకుండా మంచి పాటలే వస్తాయి.

# ఒక్క సన్నివేశాన్ని కూడా వృథాగా తీయలేదు



వెంకట్ రామ్‌జీ

"ఒక కథ ఆధారంగా... మరో కథని పునః సృష్టించడంలోనే ఎక్కువ సవాళ్లు ఉంటాయి" అన్నారు వెంకట్ రామ్‌జీ. ఇటీవల విడుదలైన 'ఎవరు'తో పరిచయమైన యువ దర్శకుడీయన. తొలి చిత్రంతోనే ప్రేక్షకులకి థ్రిల్‌ని పంచి విజయాన్ని సొంతం చేసుకొన్నారు. అడివి శేష్, రెజీనా జంటగా పీవీపీ సినిమా పతాకంపై తెరకెక్కిన చిత్రమిది. ఆ సినిమా ప్రయాణం గురించి వెంకట్ రామ్‌జీ ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు...

"కథా ప్రపంచం ఎక్కడైనా ఒక్కటే. పాత్రలే కథని మరింత ఆసక్తికరంగా ముందుకు తీసుకెళతాయని నమ్ముతా. అందుకే పాత్రలపైనే ఎక్కువగా దృష్టిపెట్టి 'ఎవరు' స్క్రిప్టుని సిద్ధం చేశా. విక్రమ్ వాసుదేవ్, సమీర, అశోక్ అని ప్రత్యేకంగా ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారంటే కారణం అదే. మొదట ఈ సినిమా మల్టీప్లెక్స్‌ల్లోనే ఆడుతుందనుకొన్నా. కానీ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. ప్రతి సన్నివేశానికీ స్పందిస్తున్నారు. దీన్ని నేనొక ప్రతీకార కథలాగే చూశాను, అలాగే తీశాను. అదొక మంచి థ్రిల్లర్‌గా కూడా మళ్లింది. ప్రేక్షకుల స్పందన కిక్కిచ్చింది".

- "దర్శకులు గుణ్ణం గంగరాజు, కె.రాఘవేంద్రరావు దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశా. వాళ్లిద్దరి శైలి భిన్నం. ఒకరు లాజిక్ గురించి ఎక్కువగా ఆలోచిస్తే, మరొకరు డ్రామాకి ప్రాధాన్యమిస్తారు. ఆ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ నేను 'ఎవరు' కథని సిద్ధం చేశా. మొదట ఒక థ్రిల్లర్ కథని తయారు చేసి నిర్మాత ప్రసాద్ వి.పొట్లూరికి వినిపించా. అప్పుడాయన 'ది ఇన్విజిబుల్ గెస్ట్' ఆధారంగా సినిమా తీయాలని ఈ కథ చెప్పారు. ఇందులోని ప్రధానాంశం నాకూ బాగా నచ్చింది. ఎప్పుడైనా కథకి భావోద్వేగాలే కీలకం. ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేది వాటికే. అందుకే మాతృక ఆత్మని మార్చకుండా... మనవైన భావోద్వేగాలు, పాత్రలకి ప్రాధాన్యమిస్తూ కథని పునః సృష్టించాం. ఆ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం. ఇందులో ప్రధాన పాత్రధారులుగా శేష్, రెజీనాలని ముందే అనుకొన్నాం. కానీ నవీన్ చంద్ర ఈ పాత్ర చేస్తారని అనుకోలేదు. కథ పరంగా అడివి శేష్, అబ్బూరి రవి చాలా సాయం చేశారు. విరామం నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు మరింత పకడ్బందీగా ఉండాలని అబ్బూరి రవి సలహా ఇవ్వడంతో వాటిని మార్చి రాసుకొన్నా. పతాక సన్నివేశాలకి ప్రేక్షకుల నుంచే కాకుండా, పరిశ్రమ నుంచీ మంచి స్పందన లభించింది".
- "దర్శకత్వ శాఖ మొదలుకొని... మార్కెటింగ్ వరకు పలు విభాగాల్లో పనిచేశా. ఆ అనుభవం ఈ సినిమాకి ఎంతో మేలు చేసింది. మా స్క్రిప్టు 118 పేజీలు. నా సినిమా కూడా 118 నిమిషాలు. ఒక్క సన్నివేశాన్ని కూడా వృథాగా తీయలేదు. దర్శకులు కె.రాఘవేంద్రరావు, క్రిష్, ప్రకాష్ తదితరులంతా ఫోన్ చేసి మెచ్చుకున్నారు. రవితేజకి మా సినిమా బాగా నచ్చింది. నా తదుపరి సినిమా కూడా థ్రిల్లర్ కథతోనే ఉంటుంది".

## గీతోపదేశం

పూలలో ఉన్నాయి వేల రకాలు
పక్షులలో ఉన్నాయి లక్ష విధాలు
రేకులు ఉంటేనే పువ్వంటాము
రెక్కలు ఉంటేనే పక్షంటాము
మతాలు ఏవైనా కులాలు వేరైనా
మంచి మనసు ఉంటేనే మనిషంటాము
మనుషులమై మనమంతా కలిసుంటాము

గీతం: అందరికీ ఒక్కడే దేవుడు...
చిత్రం: ఒకే కుటుంబం రచన: దాశరథి
- పంపినవారు: వి.సాయిశంకర్, మల్యాల

## పంచ్ డైలాగ్

నీకు మత్తు ఇవ్వడమే తెలుసు. నాకు మత్తు దించడమూ తెలుసు.
చిత్రం: కిక్ 2
- పంపినవారు: కృష్ణమాచారి, ఈమెయిల్

# రథసారథుల ఉత్సవం



అమ్మిరాజు, దిల్‌రాజు, సి.కల్యాణ్

"సినిమా మొదలైనప్పట్నుంచి... పూర్తయ్యే వరకు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. వాళ్ల సంక్షేమం కోసం నిర్వహించబోతున్న వేడుకకి సినీ పరిశ్రమ మొత్తం అండగా ఉంటుంది" అన్నారు నిర్మాతలు దిల్‌రాజు, కె.ఎస్.రామారావు, సి.కల్యాణ్. తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబరు 8న హైదరాబాద్‌లో 'సినీ రథ సారథుల రజతోత్సవం' పేరుతో ఓ వేడుకని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. "నిర్మాతలుగా తెరపైన మా పేరే ప్రముఖంగా పడినా కష్టం ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌లదే. వాళ్ల సంక్షేమం పరిశ్రమకి ఎంతో అవసరం. వేడుకకి తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామ"న్నారు కె.ఎస్.రామారావు. నిర్మాతల మండలి తరఫున సహకారం ఉంటుందని నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో 'మా' అధ్యక్షుడు వి.కె.నరేష్, దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్, 'మా' ప్రధాన కార్యదర్శి జీవితా రాజశేఖర్, కోశాధికారి రాజీవ్ కనకాల, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ నాయకులు అమ్మిరాజు, ఆర్.వెంకటేశ్వరరావు, సతీష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



సుజీత్, శ్రద్ధాకపూర్, ప్రభాస్, ప్రమోద్, విక్కీ



శ్రద్ధాకపూర్, ప్రభాస్ సరదా ముచ్చట్లు

# ఈసారి చెప్పకుండానే చేస్తా

\- ప్రభాస్

"ఏడాదికి రెండు సినిమాలు చేస్తానని ఇదివరకు అభిమానులందరికీ మాటిచ్చా. కానీ 'సాహో'ని ఈ స్థాయిలో చేయడం వల్ల కుదరలేదు. ఈసారి మాట ఇవ్వకుండానే రెండు సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నా" అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమిది. శ్రద్ధాకపూర్ కథానాయిక. యూవీ క్రియేషన్స్ నిర్మించింది. ప్రమోద్, వంశీ, విక్కీ నిర్మాతలు. సుజీత్ దర్శకుడు. ఈనెల 30న విడుదల అవుతోంది. ఆదివారం రాత్రి రామోజీ ఫిలింసిటీలో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు.

## నిక్కరుతో వచ్చాడు: ప్రభాస్

ప్రభాస్ మాట్లాడుతూ "డై హార్డ్ ఫ్యాన్స్ అని ఇందులో సంభాషణలు రాసింది సుజీతే. తనకి మాస్ పల్స్ తెలుసు. గొప్ప సాంకేతిక నిపుణులు పనిచేసిన చిత్రమిది. 'మిర్చి'కి కెమెరా బాధ్యతలు నిర్వర్తించిన మది ఈ సినిమాకి పనిచేశారు. ఈ సినిమా చేయమని సాబు సిరిల్‌ని నేనే అడిగా. కథ నచ్చితేనే చేస్తానన్నారు. సుజీత్ కథ చెప్పగానే ఒప్పుకున్నారు. స్క్రీన్‌ప్లే ప్రధానమైన ఈ సినిమాకి చాలా సహకారం అందించారు ఎడిటర్ శ్రీకర్‌ప్రసాద్. కమల్ కణ్ణన్ ఈ సినిమాకి అంతర్జాతీయ లుక్ తీసుకురావడానికి కారకులయ్యారు. 'బాహుబలి : ది కన్‌క్లూజన్' కూడా ఆయనే చేశారు. జిబ్రాన్ సంగీతం ఎలా ఉంటుందో టీజర్‌తోనే తెలిసిపోయింది. జాకీష్రాఫ్ సర్‌తో ఈసారి చేయడం కుదిరింది. చంకీ పాండే, అరుణ్ విజయ్, లాల్, నీల్ నితిన్ ముఖేష్, మందిరాబేడి తదితరులతో కలిసి పనిచేయడం మంచి అనుభవం. నిర్మాతలు అనిల్ టడానీ, భూషణ్ కుమార్ తొలి రోజు నుంచే ఈ సినిమాకి సహకారం అందించారు. తొలిసారి నా దగ్గరికి వచ్చినప్పుడు సుజీత్ నిక్కరు వేసుకొని వచ్చాడు. 22 ఏళ్ల వయసులో 'రన్ రాజా రన్' చేశాడు. ఆ తర్వాత తను చెప్పిన కథ నిర్మాతలకి నచ్చింది. ఆ తర్వాత నా దగ్గరికి వచ్చి కథ చెప్పాడు. కథ చెప్పిన విధానం చూస్తే నలభయ్యేళ్ల వయసు వ్యక్తిలా అనిపించాడు. చిత్రీకరణ మదలైనప్పుడు అందరూ పెద్ద సాంకేతిక నిపుణులే. వాళ్లని ఎలా హ్యాండిల్ చేస్తాడా అని కంగారుపడ్డాం. సుజీత్ ఒక్క రోజు కూడా కోపం లేకుండా హ్యాండిల్ చేసిన విధానాన్ని చూసి గొప్ప దర్శకుడు అయిపోతాడనిపించింది. బహుశా అంతర్జాతీయ దర్శకుడు అయిపోతాడేమో. ఈ సినిమా కోసం రెండేళ్లు పనిచేసింది శ్రద్ధ. ఒక నటి రెండేళ్లపాటు పనిచేయడమంటే ఆషామాషీ కాదు. తను నటించడం మా అదృష్టం. చాలా బాగా నటించింది, యాక్షన్ కూడా బాగా చేసింది. నిర్మాతలు ప్రమోద్, వంశీ, విక్కీ నా స్నేహితులు. ఈ సినిమాని జాగ్రత్తగా చేసుంటే... రూ.100 కోట్లు లాభం వచ్చేది. అంత లాభం వదులుకొని ఈ సినిమాని ఇంత భారీగా తీశారు. మనందరికీ అలాంటి స్నేహితులు ఉండాలి" అన్నారు.

## రామోజీ ఫిలింసిటీకి 'సాహో' ప్రపంచం

యుద్ధ విమానాలు, రేసు కార్లు, ట్యాంకర్లు, మిషన్ గన్లు... 'సాహో' వేడుకలో కనిపించిన దృశ్యాలివి. సినిమా వేడుక జరుగుతోందా? లేదంటే యుద్ధ రంగంలో ఉన్నామా? అనిపించేంతలా మాయ చేసింది 'సాహో' చిత్రబృందం. ఈ చిత్రంలో యాక్షన్ ఘట్టాలకు ప్రాధాన్యం ఉంది. బడ్జెట్‌లో సగం పోరాటాల కోసమే కేటాయించారు. హాలీవుడ్ స్థాయి యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమాలో పొందుపరిచారు. ఇంగ్లిష్ చిత్రాల్లో చూసే అరుదైన కార్లు, యుద్ధ ట్యాంకర్లు, మిషన్ గన్లు ఈ సినిమా కోసం వాడారు. వాటన్నింటినీ 'సాహో' విడుదల ముందస్తు వేడుకలో ప్రదర్శనకు ఉంచారు. అధునాతన ఆయుధాలు ఒక పక్క, తెలుగు సినిమాల్లో చూసే కత్తులు, గొడ్డళ్లూ మరో పక్క. ఈ చిత్రంలో ప్రభాస్ వాడిన జెట్ సూట్లు, రేసు కార్లు చూపరులను ఆకట్టుకున్నాయి. బంగారు బిస్కెట్ల దొంగతనం నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆ బిస్కెట్లనీ తరలించడానికి వాడిన ట్రక్కుల్ని కూడా 'సాహో' వేడుక కోసం రామోజీ ఫిలింసిటీకి తరలించారు.



అభిమానులకు కృష్ణంరాజు, ప్రభాస్ అభివాదం

## బాహుబలిని మించిపోతుంది: కృష్ణంరాజు

కృష్ణంరాజు మాట్లాడుతూ "ట్రైలర్ విడుదల తర్వాత సినిమా అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. హాలీవుడ్ స్థాయికి పోటీపడే సినిమా అని చాలా మంది ఫోన్లు చేసి చెప్పారు. ఇందులో పోరాట ఘట్టాల్ని స్టంట్ మాస్టర్ కెన్నీ బేట్స్ చేశారు. ఐదారుసార్లు ఇక్కడికి వచ్చి రిహార్సల్స్ చేసి, కంప్యూటర్ గ్రాఫిక్స్ లేకుండా ఛేజింగ్ సన్నివేశాలు తీర్చిదిద్దాడు. ప్రభాస్ చాలా కష్టపడి పనిచేశాడు. 'బాహుబలి' తర్వాత ప్రభాస్ ఈ కథని రాజమౌళికి చెప్పగానే ఆయన వెంటనే ఓకే అన్నారట. సుజీత్ చిన్నవాడైనా పెద్ద బాధ్యతల్ని నిర్వర్తించాడు. కథపై నమ్మకంతో వంశీ, ప్రమోద్, విక్కీ ఈ చిత్రాన్ని నిర్మించారు. రాజమౌళి చెప్పినట్టుగా సుజీత్ ఈ సినిమాతో జాతీయ స్థాయి దర్శకుడు అవుతాడు. ప్రభాస్‌పై అభిమానంతో ఇది నాదీ అనుకొని ప్రతి ఒక్కరూ పనిచేశారు. సినిమా చాలా బాగా వచ్చింది. ఎన్ని అంచనాలున్నా యాభయ్యేళ్ల అనుభవంతో చెబుతున్నా కచ్చితంగా విజయం సాధిస్తుందీ చిత్రం. ఈ నెల 30 తర్వాత 'సాహో' సినిమాతో ప్రభాస్‌కి 'బాహుబలి'ని మించిన పేరొస్తుంది. గొప్ప అంతర్జాతీయ స్టార్ అవుతాడనే నమ్మకం ఉంది" అన్నారు.



ప్రభాస్, రాజమౌళి

## సుజీత్ భుజాలపై నిలబడిన సినిమా ఇది: రాజమౌళి

రాజమౌళి మాట్లాడుతూ "తమ హీరో సినిమా హిట్టవ్వాలని ప్రతి అభిమానీ కోరుకుంటాడు. అందరి హీరోల అభిమానులు 'ప్రభాస్ సినిమా హిట్టవ్వాల'ని కోరుకుంటారు. ప్రభాస్ సానుకూల ఆలోచనలు, దృక్పథం అంతమంది అభిమానుల్ని సంపాదించిపెట్టింది. ప్రభాస్‌కి దూరదృష్టి ఎక్కువ. బాహుబలి కథ చెప్పినప్పుడే తన తరువాతి సినిమా కథ గురించి ఆలోచించడం మొదలెట్టాడు. చాలా తపన పడ్డాడు. ఓరోజు నా దగ్గరకు వచ్చి 'సుజీత్ కథ చెప్పాడు.. చాలా బాగుంది' అని ఉత్సాహంగా చెప్పాడు. 'బాహుబలి తరవాత ఇలాంటి సినిమా చేస్తే జనాలకు నచ్చుతుంది' అని నమ్మి చేశాడు. ఇంత పెద్ద సినిమాని మోయగలడా? అని సుజీత్‌పై చాలామంది అనుమాన పడ్డారు. ఫస్ట్‌లుక్ చూశాక తన సమర్థత గురించి అర్థమైపోయి ఉంటుంది. తన భుజాలపైనే ఈ సినిమా నిలబడింది. ప్రభాస్ ఇప్పటికే ఆల్ ఇండియా స్టార్. తనని మరింత ముందుకు తీసుకెళ్లాలి" అన్నారు.

ప్రముఖ నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ "ముసలోళ్ల నుంచీ, పసిపిల్లల వరకూ అందరికీ ప్రభాస్ డార్లింగే. మనిషిగా తను చాలా స్వచ్ఛమైనవాడు. సానుకూల దృక్పథంతో ఉంటాడు. రాకెట్‌లా దూసుకుపోతున్నాడు. రెండేళ్ల ముందు రాజమౌళితో కలసి ఓ చరిత్ర సృష్టించాడు. మరోసారి ఈ సినిమాతో దేశం మొత్తం దద్దరిల్లాలి. తెలుగువాడి సత్తా తెలియాలి" అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "'మిస్టర్ పర్‌ఫెక్ట్' కంటే డబుల్ బడ్జెట్‌తో 'మిర్చి' సినిమా తీశారు. ఎందుకింత ఖర్చు పెడుతున్నారని వంశీ, ప్రమోద్‌లను అడిగాను. 'మా ప్రభాస్ కోసం కదా.. పెట్టేశాం' అన్నారు. ఆ సినిమా చాలా పెద్ద విజయం అందుకుంది. ప్రభాస్ డేట్లు ఇస్తే డబ్బులు సంపాదించాలని చూస్తారు. కానీ 'బాహుబలి 2' కంటే ఎక్కువ బడ్జెట్ పెట్టి 'సాహో' తీశారు. ఇంత బడ్జెట్ పెట్టారేంటి? అని అడిగితే, ఇప్పుడు కూడా 'ప్రభాస్ కోసం కదా' అన్నారు. నన్ను చూసి నిర్మాతలం అయ్యామని వాళ్లిద్దరూ చెబుతుంటారు. కానీ వాళ్లని చూసి ఓ సినిమాని దేశ వ్యాప్తంగా చూసేలా ఎలా తీయాలో నేర్చుకున్నా. సుజీత్ అదృష్టవంతుడు. పాన్ ఇండియా సినిమా తీయడానికి రాజమౌళిగారికి 15 ఏళ్లు పట్టింది రెండో సినిమాకే సుజీత్ ఆ ఘనత దక్కించుకున్నాడు. నేను చాలా మంది స్టార్ హీరోల్ని చూశాను. కానీ ప్రభాస్ దగ్గరకు వెళ్తే.. ఓ హీరో దగ్గరకు వెళ్తున్నట్టు కాదు, ఓ స్నేహితుడి దగ్గరకు వెళ్తున్నట్టు ఉంటుంది. 'బాహుబలి'లా ఈ సినిమా కూడా పెద్ద విజయం అందుకోవాలి. తెలుగువాళ్లంతా గర్వపడాల"న్నారు. శ్రద్ధా కపూర్ మాట్లాడుతూ "హైదరాబాద్ నా రెండో ఇల్లులా మారిపోయింది. 'సాహో'ని మీరంతా ఇష్టపడతారని భావిస్తున్నాను. ఈటీమ్‌తో పనిచేయడం ఓ గొప్ప అనుభవం. ఇదే నా తొలి తెలుగు సినిమా. ప్రభాస్‌తో నటించడం చాలా బాగుంద"న్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ "ఈ నిర్మాతలకు మనుషులకు ఉండే గుండె కాకుండా, సింహాలకూ, పులులకు ఉండే గుండె ఉందేమో..? ఈ సినిమా బడ్జెట్ చూసి అంతా భయపడున్నారు. కానీ నిర్మాతలు భయపడడం లేదు. వాళ్ల ధైర్యం ప్రభాస్. బాహుబలి తరవాత రాజమౌళి గురించి ప్రపంచం అంతా ఎలా మాట్లాడుకున్నారో, ఈ సినిమా చూశాక సుజిత్ గురించి ప్రపంచమంతా మాట్లాడుకోవాలి. ప్రభాస్ లాంటి ఫ్రెండ్ జీవితంలో ఉంటే ఇంకేం అవసరం లేదు. అర్ధరాత్రి ఫోన్ చేసినా ఫోన్ తీసేది తానొక్కడే. స్నేహితులకు ఇచ్చే విలువ అలాంటిది. ట్రైలర్ చూసి పిచ్చెక్కి పోయింది. హిందీలో తొలిరోజు రూ.42 కోట్ల షేర్ రావడం రికార్డని తెలిసింది. ఈ సినిమాకి మాత్రం రూ.50 కోట్లు వస్తాయని చెబుతున్నారు. తెలుగు సినిమాని రూ.వెయ్యి కోట్లు, రూ.రెండు వేల కోట్ల స్థాయికి తీసుకెళ్లిపో" అన్నారు. సుజీత్ మాట్లాడుతూ "ప్రభాస్ అభిమానుల ఓపికకు హ్యాట్సాఫ్. బాహుబలి తరవాత వెంటనే ఓ సినిమా రావాలని ప్రభాస్ అభిమానులు భావిస్తారు. కానీ రెండేళ్లు ఓపిగ్గా ఈసినిమా కోసం ఎదురుచూశారు. అందుకే వాళ్లని డైహార్డ్ ఫ్యాన్స్ అన్నాను. ఇంత ధైర్యంగా నేను ఉన్నానంటే దానికి కారణం ప్రభాస్" అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "మన తెలుగు కథానాయకుడికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అందరూ గర్వపడాల్సిన విషయం. వంశీ, ప్రమోద్‌లకు భయం అనే చిప్ లోపల పెట్టలేదు. వాళ్లకు భయం అంటే ఏంటో తెలీదు. రూ.వందల కోట్లు ఖర్చు పెట్టి 'ఇంతకు ముందు రాలేదు, ఇక మీద రాబోదు' అనే స్థాయిలో ఈసినిమా తీశార"న్నారు. మురళీ శర్మ మాట్లాడుతూ "నాకు ఇంటి భోజనం అంటే చాలా ఇష్టమని ఓసారి ప్రభాస్‌తో చెప్పాను. 70 రోజులు షూటింగ్ చేస్తే 50 రోజులు ప్రభాస్ ఇంటి నుంచి భోజనం వచ్చింది. అందుకే తను డార్లింగ్ అయ్యార"న్నారు. కళా దర్శకుడు సాబు సిరిల్ మాట్లాడుతూ "ప్రభాస్ నన్ను పిలిచి ఈ అవకాశం ఇచ్చారు. నా ప్రతిభను చూపించుకునే వేదిక కల్పించారు. యాక్షన్ సన్నివేశాల్లో కళా దర్శకులకు పెద్దగా పనేముంటుందని అందరూ అడుగుతుంటారు. వాటి కోసం ఏమేం చేశామో.. అన్నీ ఈ వేదిక దగ్గర ప్రదర్శించాం" అన్నారు. కార్యక్రమంలో అరుణ్, కృష్ణకాంత్, రవివర్మ, విజయ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'సాహో'ను చైనాలో చూస్తాం!

మేము.. మీ సినిమాను ఇక్కడ చూడలేకపోతున్నాం. కచ్చితంగా చైనాలో చూస్తామంటూ ఇద్దరు చైనీస్ మహిళా అభిమానులు ప్రభాస్‌కు లేఖ రాశారు. చైనాకు చెందిన ఇద్దరు ప్రభాస్ మహిళాభిమానులు ఆదివారం హైదరాబాద్‌లోని ప్రభాస్ ఇంటి వద్దకు వచ్చారు. ఆయన లేరని తెలుసుకున్న వారిద్దరు ఓ లేఖ రాశారు. 'మేము చైనాకు చెందిన అభిమానులం. సాహో చిత్రాన్ని ఆగస్టు 1న చూద్దామనుకున్నాం.. విడుదల తేదీ మార్చారు. ఆగస్టు 18న చైనాకు తిరిగివెళ్తున్నాం. భారత్‌లో మేము ఈ చిత్రాన్ని చూడలేకపోతున్నాం. చైనాలో విడుదల కోసం ఎదురుచూస్తుంటాం' అని చైనా ప్రభాస్ ఫ్యాన్స్ క్లబ్‌కు చెందిన మిర్చి, వివియన్ ఆ లేఖలో పేర్కొన్నారు. అభిమానానికి హద్దులు లేవని నెటిజన్లు వారిని అభినందనల్లో ముంచెత్తారు.

\- న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

# వసుంధర

చిన్న ఓటమికే జీవితం ముగిసిందనుకునేవారెందరో... కానీ వారలా కుంగిపోలేదు. ఎన్ని అడ్డంకులెదురైనా... ఎదిరించి నిలబడ్డారు. జీవితమే సవాలుగా మారినా... పోరాడి సాధించారు... పక్షవాతం అచేతనంగా చేసినా... అంచెలంచెలుగా ఎదిగి రాజీవ్ ఖేల్ రత్న పురస్కారానికి నామినేట్ అయ్యింది ఒకరైతే, పేదరికంలో పెరిగి... పరుగుల రాణిగా పేరొందింది మరొకరు... వారే దీపా మాలిక్, హిమాదాస్. వారి జీవిత విశేషాలు మీకోసం


దీపామాలిక్

## క్రీడారంగంలో కీర్తి కెరటాలు

### మట్టిలో మాణిక్యం...!

ఆత్మవిశ్వాసమే ఉంటే... ఎన్ని ఆటంకాలెదురైనా విజయం సాధించగలం. అందుకే ఉదాహరణే హిమాదాస్. తాజాగా చెక్ రిపబ్లిక్‌లో జరుగుతున్న అథ్లెటిస్కి మీటింగ్ మహిళల 300 మీటర్ల పరుగులో స్వర్ణం సాధించింది. గత 45రోజుల్లో ఆమెకిది ఆరో పసిడి కావడం విశేషం. గెలుపు తీరాల్ని తాకుతోన్న ఈ కెరటం జీవితంలో ఎన్నో మలుపులు.. హిమదాస్‌ది అసోంలోని నగావ్ జిల్లాలోని దింగ్ అనే గ్రామం. కనీస సౌకర్యాల ఊసేలేని మారుమూల కుగ్రామం అది. మొదటిసారి హిమ కామన్‌వెల్త్ క్రీడలకు ఎంపికైనప్పుడు ఆ ఆనందాన్ని తన తల్లిదండ్రులతో పంచుకోవాలనుకుంది. ఫోన్ చేస్తే ఆరేడు గంటల తరువాత లైన్ దొరికింది. ఫోన్ ఎత్తిన ఆ తల్లి కూతురు చెప్పింది విని 'నువ్వు టీవీలో కనిపిస్తావా' అని అడిగిందట. వారికి ఆ పోటీల ప్రాధాన్యం తెలియదు. హిమ గెలుపుని చూడటం ఒకటే తెలుసు మరి.

#### బురదనేలలో పరుగు...

హిమ తల్లిదండ్రులకు నలుగురు సంతానం. వారిలో ఆమే పెద్దది. చిన్నప్పటి నుంచీ ఆటలంటే హిమకు ప్రాణం. ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్...అన్నింటిలోనూ తను ఉండాల్సిందే. స్థానికంగా జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొనేది. ఆ ఊరికి రోడ్లే లేవు. ఇక క్రీడలు సాధన చేయడానికి ప్లేగ్రౌండ్‌లు, రన్నింగ్ ట్రాక్‌లు ఎక్కడుంటాయి. అంతదాకా ఎందుకు కాళ్లకు కనీసం సరైన చెప్పులే లేవు. అయినా సరే! ఆమె వాటికోసం ఆలోచించలేదు. బురద నేలలో ఒట్టి కాళ్లతోనే పరుగెత్తడం మొదలుపెట్టింది. ఆటల్లో ప్రతిభ చూపుతోన్న కూతుర్ని చూసి ఆ తండ్రి మురిసిపోయాడు. ఎంత కష్టమైనా ఆమెను ప్రోత్సహించాలనుకున్నాడు. ఆమె జవహర్ నవోదయ పాఠశాలలో ఎంపికైతే చదువుతో పాటు తగిన పోషకాహారమూ లభిస్తుందని, ఆటల్లో రాణించగలుగుతుందని భావించాడు. అలా ఆమె అక్కడ చేరింది.


హిమదాస్

#### అతడే కొనిచ్చాడు..

ఓసారి మెరుపువేగంతో పరుగెడుతోన్న హిమను గమనించాడు వ్యాయామ ఉపాధ్యాయుడు. ఆయనే అథ్లెటిక్స్‌లోకి మారు అంటూ సలహా ఇచ్చాడు. అథ్లెటిక్ కోచ్ అయిన నిపాన్ దాస్‌ని పరిచయం చేశాడాయన. ఆటలంటే మాటలేం కాదు...ఊళ్లో సరదాగా ఆడటం వేరు...ప్రొఫెషనల్‌గా మారాలంటే తగిన క్రీడా దుస్తులు, చెప్పులు వంటివన్నీ కావాలి. నిపాన్ పట్టుబట్టి ఆమె తల్లిదండ్రులను ఒప్పించి గుహవాటిలోని ఓ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చేర్చాడు హిమని. తన సొంత ఖర్చుతో ఆమెకు షూలు, దుస్తులు కొనిచ్చాడు. అతడితో పాటు అక్కడి మరో కోచ్ నవజీత్ మల్కర్ ఆమెను తీర్చిదిద్దారు. జాతీయ స్థాయిలో వంద రెండు వందల మీటర్ల పరుగు పందాలెన్నో అలవోకగా దాటేసేది.. దాంతో మొదటి సారి నైరోబీలో యూత్ చాంపియన్‌షిప్‌కి ఎంపికైంది. కానీ అక్కడికెళ్లేందుకు డబ్బులు సర్దే పరిస్థితి ఆమె కుటుంబానిది లేదు. ఈ సారీ ఆమె కోచ్‌లే అప్పులు చేసి పంపారు. అక్కడ ఐదో స్థానంలో నిలిచి...అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోచ్ గలేనా బుఖారియా దృష్టిలో పడింది. హిమ దాస్ ఏకైక భారతీయ అథ్లెట్...ఐఏఏఎఫ్ వరల్డ్ యూ 20 ఛాంపియన్‌షిప్స్ నాలుగు వందల మీటర్ల పరుగుపందెంలో ఆసియన్ గేమ్స్ ఇన్ ఇండోనేషియాలో బంగారు పతకం అందుకుని ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. యూరోప్‌లో జరుగుతోన్న వివిధ పోటీల్లో కేవలం నలభైఐదు రోజుల తేడాతో ఆరుబంగారు పతకాలు అందుకుని....సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరి మన్ననలూ అందుకుంటోంది. ఒకప్పుడు కాళ్లకు చెప్పులు కూడా లేని ఆమె పేరున ప్రముఖ బ్రాండ్ అడిడాస్ షూలనే విడుదల చేసింది. హిమదాస్ మట్టిలో మాణిక్యం అనడానికి ఇవన్నీ చక్కటి ఉదాహరణలు. ఎందుకంటే....తానెక్కడున్నా, ఎన్ని విజయాలందుకున్నా రవ్వంతైనా తన నేపథ్యాన్ని మరిచిపోలేదు. తన సొంత ఊరి సమస్యల కోసం ఎక్కడున్నా గళమెత్తుతూనే ఉంటుంది

ఆ మధ్య దింగ్ చుట్టు పక్కల గ్రామాల్లో కల్తీ మద్యంపై జరుగుతోన్న పోరుని ముందుండి నడిపించి శెభాష్ అనిపించుకుంది. మొన్న వరదలతో మునిగిన అసోం గ్రామాల పునర్నిర్మాణానికి తన వంతుగా జీతాన్ని విరాళంగా అందించింది. అందుకే ఆమె నేపథ్యాన్ని, ప్రతిభను గుర్తించిన యునిసెఫ్ ఇండియా ఈ స్ప్రింటర్‌ని తొలి యువ రాయబారిగా నియమించింది.

### పక్షవాతం బాధించినా...

పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా...వాటిని తమకు అనుకూలంగా మార్చుకుని విజయం సాధించేవారు అరుదుగా ఉంటారు. అలాంటివారిలో దీపామాలిక్ ఒకరు. ఆమె కిందపడిన ప్రతిసారి కసితో పైకి లేచింది. దీప హరియాణాలో జన్మించింది. తండ్రి ఆర్మీ అధికారి. ఐదేళ్ల వయసున్నప్పుడు వెన్నెముకపై కణితి వచ్చింది. మూడేళ్లపాటు ఆమె తల్లిదండ్రులు రకరకాల చికిత్సలు చేయించారు. ఎన్నో కఠినమైన ఫిజియోథెరపీలు చేయించుకుంది. అంత అనారోగ్యంలోనూ ఎప్పుడూ చురుగ్గానే ఉండేది. ఆటలన్నా, బైక్ రైడింగ్ అన్నా ఆమెకు చాలా ఇష్టం. ఇరవై ఏళ్లవయసులో ఆర్మీ అధికారితో పెళ్లయ్యింది.

#### ఆపరేషన్ తప్పదన్నారు...

దీపకు ఇద్దరు పిల్లలు. ఏ పని చేసిన ప్రోత్సహించే భర్త. ...జీవితం ఆనందంగా గడిచిపోతోంది అనుకున్న సమయంలో ఓ పెద్ద కుదుపు. వెన్నెముకపై ఉన్న కణితి సమస్య తీవ్రం అయ్యింది. వైద్యులను సంప్రదిస్తే... 'కణితి తొలగించుకోకపోతే.. క్యాన్సర్ మహమ్మారి బారిన పడి మరణించే అవకాశం ఉందని చెప్పారు. అలాగని సర్జరీ చేయించుకుంటే పక్షవాతం బారిన పడి జీవితాంతం వీల్‌ఛైర్‌కే పరిమితం అయ్యే అవకాశం ఉందనీ తేల్చేశారు. అందరిలోనూ తీరని ఆవేదన. చివరికి దీప నిర్ణయం తీసుకుంది. సర్జరీకి ఓకే చెప్పింది. కణితి తొలగించడానికి మొత్తం మూడు సర్జరీలు చేశారు. 183 కుట్లేశారు. అప్పటి నుంచి ఆమె శరీరంలోని కింది భాగం మొత్తం పక్షవాతానికి గురైంది. అప్పటి వరకు ఆడుతూ పాడుతూ సాగిన ఆమె అచేతనంగా మారిపోయింది. ఆరేళ్లపాటు ఫిజియోథెరపీ చేయించుకుంది. ఆ సమయంలో శక్తినంతా కూడగట్టుకుని జీవితంలో నిలబడాలనే తపనతో ఉండేది. ఆ స్థితిలోనూ హెమీప్లెగియాతో బాధపడుతున్న తన పెద్ద కూతురు ఆలనపాలనను చూసుకునేది.

దీపామాలిక్ ఇప్పటి వరకూ ఈతలో, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్ గేమ్స్‌లో, రైడర్‌గా ...23 అంతర్జాతీయ పతకాలు, 68 రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు సాధించింది. భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డులైన అర్జున, పద్మశ్రీలను అందుకుంది. తాజాగా రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న పురస్కారానికి నామినేట్ అయ్యింది.

#### రికార్డుల పంట పండిస్తూ...

దివ్యాంగురాలైన దీప రైడింగ్‌లో లైసెన్స్ సాధించిన మొదటి దివ్యాంగురాలుగా రికార్డు సాధించింది. 2009లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో ఎనిమిది రోజుల్లో 17 వందల కిలోమీటర్లు ప్రయాణించి 18 వేల అడుగుల ఎత్తుకు చేరి హిమాలయా రైడ్ పూర్తి చేసింది. రైడింగ్ శిక్షణలో భాగంగా ఈత నేర్చుకుంది. చెన్నై నుంచి దిల్లీ వరకు 3,278కిలోమీటర్లు ప్రయాణించి మొదటి పారాప్లెగిక్ మహిళగా నిలిచింది.

#### నలభై ఏళ్లకు...

2016లో జరిగిన రియో పారాలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందంలో అందరికంటే పెద్దది దీపా. ఈ క్రీడల్లో షాట్‌పుట్ విభాగంలో రజత పతకం సాధించింది. పారాలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది. గతేడాది దుబాయ్‌లో జరిగిన ఎఫ్ 53/54 జావెలిన్ స్పోర్ట్ అథ్లెటిక్ గ్రాండ్ ప్రిక్స్‌లో బంగారు పతకం సాధించింది. ఆమెపై ఫర్హాన్ అక్తర్ ఓ సినిమాను సైతం తెరకెక్కిస్తున్నారు. ఆమె దివ్యాంగుల కోసం వీలింగ్ హ్యాపీనెస్ ఫౌండేషన్‌ను నిర్వహిస్తున్నారు. మోటార్ స్పోర్ట్స్, అడ్వెంచరస్ గేమ్స్‌లో వారికి శిక్షణ ఇస్తోంది. 'నా విజయం దివ్యాంగుల మీద సామాన్య ప్రజల దృక్పథాన్ని మారుస్తుందనుకుంటున్నా. మానసికంగా దృఢంగా ఉంటే వయసు, వైకల్యం ఏదీ అడ్డురాద'ని దీప చెబుతోంది.

---

సౌందర్య పరిరక్షణలో షీట్ మాస్కుల పాత్ర రోజురోజుకీ పెరుగుతోంది. ఫేస్ ప్యాక్‌లకు బదులుగా వీటిని నేరుగా ముఖంపై పూతలా వేసుకోవచ్చు.

## ఫేస్ ప్యాక్‌లకు బదులుగా



ఒకప్పుడు జపాన్, దక్షిణ కొరియాలకే పరిమితమైన షీట్ మాస్కులు ఇప్పుడు ప్రపంచమంతా విస్తరించాయి. ముఖానికి క్రీమ్‌లతో ఫేస్ ప్యాక్‌లు వేసుకోవడం పాత పద్ధతి. ఈ షీట్‌లు ముఖానికి సరిపోయే కొలతల్లో లభిస్తాయి. పాలిథీన్ లేదా ఫైబర్ షీట్లను ఇందుకోసం ఉపయోగిస్తారు. వీటిని కీరా, బొప్పాయి, దానిమ్మ, బత్తాయి... వంటి పండ్ల రసాల్లో ముంచుతారు. తరువాత కొన్ని రకాల సౌందర్య ఉత్పత్తులను వాటికి పూతలా వేస్తారు.

- ప్యాకింగ్ నుంచి తీసి, నేరుగా ముఖానికి అంటుకునేలా వేసుకోవాలి. ఇరవై నిమిషాల తరువాత దాన్ని తీసివేయాలి. దానికి అంటుకొని మిగిలిపోయిన లేపనాన్ని చేత్తో తీసుకుని ముఖానికి రాసుకోవాలి. మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. ఆరాక దాన్ని తొలగించి శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇలా పదిహేను రోజులకోసారైనా వేసుకుంటే చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.

### నజరానా

బంతి ఆకుల్ని ఎండబెట్టి పొడిగా చేసి దానికి కొద్దిగా దాల్చిన చెక్కపొడి కలపాలి.
ఈ మిశ్రమాన్ని గది మూలల్లో ఉంచితే చీమలు, దోమలు రావు.

---

## పరదాలు పదిలంగా...

అందంగా కనిపించాలని కాస్త ఖరీదు ఎక్కువైనా పరదాలు కొని వేలాడదీస్తాం. మరి అవి ఎక్కువ కాలం మన్నాలంటే... ఏం చేయాలో తెలిసి ఉండాలిగా!

- పరదాలపై దుమ్ము సులువుగా పడుతుంది. దాన్ని వదిలించాలంటే... కనీసం వారానికోసారి వాటిని దులపాలి. కనీసం నెలకోసారి ఉతికితే... కొత్తవాటిలా కనిపిస్తాయి.
- ముదురు రంగు పరదాలపై ఎండ నేరుగా పడకుండా చూడాలి. లేదంటే ఎక్కువ ఎండ, వేడికి వాటి రంగు వెలిసిపోయే అవకాశం ఉంటుంది. ఒకవేళ పరదాలకు లైనింగ్ లాంటిది ఉంటే... డ్రైక్లీనింగ్‌కి ఇవ్వడమే మంచిది. మందంగా, కాస్త ఖరీదైన పరదాలనూ ఇంట్లో కన్నా బయట ఉతికించడమే మంచిది.



- కర్టెన్‌లను ఇంట్లో ఇస్త్రీ చేయాలనుకుంటే... తిరగేసి చేయండి. పూర్తిగా ఆరాక కాకుండా.. కాస్త తడిపొడిగా ఉన్నప్పుడే చేయాలి.
- మెరిసే పరదాలను ఉతికినప్పుడు త్వరగా ముడతలు పడతాయి. వాటిని ఉతికాక పిండకుండా అలాగే ఆరేయాలి. అన్ని రకాల కర్టెన్లను కలిపి నానబెడుతుంటారు. దీనివల్ల ఒకదాని రంగు మరొకదానికి అంటుకునే అవకాశాలు ఎక్కువ. పరదాలను చల్లటి నీటిలోనే నానబెట్టి ఉతకాలి.
- చాలా తక్కువ వేడిలోనే వీటిని ఇస్త్రీ చేయాలనే ప్రాథమిక నియమం మర్చిపోవద్దు. అదనంగా ఉన్నవాటిని మామూలు మడతల్లో పెట్టి అల్మారాలో పెట్టేయొద్దు. వాటికోసం ప్రత్యేకించి జిప్‌లాక్ కవర్లు మార్కెట్‌లో దొరుకుతాయి. వాటిలో భద్రపరిస్తే ఎక్కువకాలం మన్నుతాయి.

---

## కలయికలో కలతలా...

కలయికను ఆనందించాలి... ఆస్వాదించాలి. అలా కాకుండా... ఆ సమయంలో నొప్పితో విలవిల్లాడుతుంటే... అసౌకర్యంతోపాటు... అయిష్టతా పెరిగిపోతోంటే... ఆలస్యం చేయకండి. రకరకాల కారణాల వల్ల ఎదురయ్యే ఈ సమస్యను పరిష్కరించుకోవడమే మంచిది.

భార్యాభర్తల మధ్య అనుబంధం పెరగడానికి, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, చక్కటి వైవాహిక జీవితం వెనుక లైంగికచర్య పాత్ర ఎంతో ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నా... అన్ని జంటలు ఆనందించలేవు. కొన్ని సమస్యలు, మరికొన్ని భయాలే అందుకు కారణం. అవేంటీ... వాటిని తగ్గించుకోవడానికి ఏం చేయొచ్చో చూద్దాం. ముందు భయం, అసౌకర్యంతో మొదలు పెడదాం. సాధారణంగా కలయిక పట్ల ఉన్న భయం అసౌకర్యానికి లోనుచేస్తుంది. నొప్పి ఉంటుందేమో, తాము సరిగ్గా స్పందించలేకపోతే ఎదుటివారు ఇబ్బంది పడతారేమో, అధిక బరువున్నాం కాబట్టి కలయికను ఆనందించలేమేమో... ఇలా చాలా భయాలుంటాయి. వాటితోనూ నొప్పి బాధిస్తుంది. వీటికి పరిష్కారం దంపతుల చేతుల్లోనే ఉందంటారు నిపుణులు. ఆ భయాలను అధిగమించేందుకు ప్రయత్నించాలి. పెరిగిన వాతావరణం, చిన్నప్పటినుంచీ కలయికకు సంబంధించి విన్న మాటలు కొన్నిసార్లు ఈ భయానికి దారితీస్తాయి. ఇలాంటివారు అవసరం అనుకుంటే... సెక్సువల్ కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిది. శరీరాకృతిపరంగా భయపడుతోంటే... ఈ రోజుల్లో సన్నగా మారడం పెద్ద కష్టమేమీ కాదు. రోజూ ఓ గంటసేపు వ్యాయామం చేస్తూ, ఆహారంలో కొన్ని మార్పులు పాటిస్తే చాలు. రోజూ వ్యాయామం చేయడం వల్ల లైంగికజీవితమూ మెరుగవుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



#### అవగాహన లేకే అయిష్టత...

కొందరు కలయికను యాంత్రికంగా భావిస్తారు. ఇద్దరిమధ్యా అవగాహనా లోపం, పనిఒత్తిళ్లు, చిన్న చిన్న మనస్పర్థలు... దానికి కారణం. అదే కొనసాగితే... సంభోగాన్ని ఆస్వాదించలేక వారి మధ్య దూరమూ పెరుగుతుంది. ఈ సమస్యను అదుపులో ఉంచాలంటే... ఇద్దరిలోనూ మార్పు రావాలి. వ్యక్తిగతంగా, అభిప్రాయాల పరంగా ఏవయినా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి. కలిసి కూర్చుని మాట్లాడుకోవాలి. భావవ్యక్తీకరణ తప్పనిసరి. అన్నీ బాగున్నా... ఆ సమయంలో సంతోషంగా లేరంటే...లోపం ఎక్కడుందో తెలుసుకోవాలి. ఒకరి నుంచి మరొకరు ఏం ఆశిస్తున్నారో నిర్మొహమాటంగా మాట్లాడుకోవాలి. ఫోర్‌ప్లేకి ప్రాధాన్యం ఇవ్వడమూ మంచిదే. ఇద్దరూ కలిసి తరచుగా ఏకాంత సమయం గడిపేందుకు ప్రాధాన్యం ఇచ్చినా మార్పు ఉంటుంది.

#### అనారోగ్యాలా...

ఆ సమయంలో నొప్పి చాలామంది మహిళల్ని ఇబ్బంది పెట్టే సమస్య. డిస్పెరూనియాగా చెప్పుకొనే ఈ పరిస్థితి ప్రభావం వైవాహిక జీవితంపైనా పడుతుంది. లైంగికచర్య మొదలుపెట్టగానే నొప్పి బాధించడం, మూత్రవిసర్జన సమయంలో మంట, కలయిక తరువాత కొద్దిగా రక్తస్రావం కనిపించడం, వైట్ డిశ్చార్జి, నెలసరి క్రమం తప్పినా, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు ఎదురవుతున్నా... వీటన్నింటితో ఆ ఆసక్తి సన్నగిల్లుతున్నా... నిర్లక్ష్యం చేయకూడదు. ఏదో ఒక కారణం ఉంటేనే... ఇలా అవుతుంది కాబట్టి వైద్యుల్ని సంప్రదించాలి. ఎలాంటి కారణాలంటే...

- కొందరిలో జననాంగాలు పొడిబారతాయి. మెనోపాజ్ దశలోనూ ఇలా కావొచ్చు. ఈస్ట్రోజెన్ హార్మోను విడుదల కాకపోవడం వల్లే ఈ సమస్య ఎదురవుతుంది. మెనోపాజ్ తరువాత యోనిమార్గంలోని పొర పల్చగా మారుతుంది. ఆ భాగం పొడిబారడం వల్ల కలయిక సమయంలో నొప్పి వేధిస్తుంది. ఇలాంటప్పుడు భయపడకుండా వైద్యుల్ని కలవాలి. వారు దీనికి ల్యూబ్రికెంట్లు, ఈస్ట్రోజెన్ క్రీమ్‌లను సూచిస్తారు. పరిస్థితిని బట్టి మాత్రల్నీ వాడమంటారు.
- ఈస్ట్ ఇన్‌ఫెక్షన్లు, గర్భాశయ ముఖద్వారానికి సంబంధించిన సమస్యలు ఉన్నా ఇలా కావొచ్చు. ముఖ్యంగా గర్భాశయంలో ఫైబ్రాయిడ్లు ఈ నొప్పికి ప్రధాన కారణం. అండాశయాల్లో సిస్టులు ఉన్నా... ఎండోమెట్రియం పొర గర్భాశయంలో కాకుండా బయట పెరిగినా... నొప్పితోపాటు, మంటా వేధిస్తుంది. సమస్యను బట్టి చికిత్స సూచిస్తారు. యాంటీబయాటిక్స్ మందులు వాడటమే కాదు, అవసరం అనుకుంటే... చిన్నపాటి శస్త్రచికిత్సలూ చేయాల్సి రావొచ్చు.
- లైంగికంగా సంక్రమించే హెర్పిస్, ఇతర వ్యాధులు ఉన్నప్పుడు... ప్రసవ సమయంలో యోనిభాగానికి ఏదయినా గాయం అయినప్పుడు కలయిక అసౌకర్యంతోపాటు నొప్పికీ దారితీయడానికి కారణం అవుతాయి. లైంగికంగా సంక్రమించే వ్యాధులకు భార్యాభర్తలిద్దరూ చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. కండోమ్ తప్పని సరిగా వాడాల్సి ఉంటుంది. ప్రసవ సమయంలో సమస్య ఎదురైతే... దానికి ప్రత్యేక చికిత్స తీసుకోవాలి.
- పైవేవీ కాకుండా... ఏదయినా అనారోగ్యంతో ఈ సమస్య ఎదురవుతోందని వైద్యులు గుర్తిస్తే సెక్సువల్ థెరపీని సూచిస్తారు.

#### ఇలా అధిగమించొచ్చు...

- పరిస్థితిని బట్టి వెజైనల్ రిలాక్సేషన్ వ్యాయామాలు సిఫారసు చేస్తారు. దినచర్యలో వ్యాయామం భాగం చేసుకోవడం వల్ల చాలా సమస్యలు తగ్గుతాయి.
- వ్యక్తిగత పరిశుభ్రతకు పరిమళాలున్న సబ్బుల్ని వాడకూడదు. వెజైనల్ డియోడరంట్లకు దూరంగా ఉండాలి. సింథటిక్ లోదుస్తులు వాడకూడదు.
- కలయిక సమయంలోనూ భంగిమలు మార్చడం వల్ల నొప్పిని కొంతవరకూ అదుపులో ఉంచుకోవచ్చు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. భాగస్వామితో పంచుకోవడం తప్పనిసరి.
- ఒత్తిడితోపాటు కలయిక పట్ల భయం ఉన్న వారికి యాంటీడిప్రెసెంట్లు వాడమంటారు... బిహేవియర్ థెరపీ సైతం కొంతవరకూ పనిచేస్తుంది.

---

## బాబు సమస్య ఏమిటో తెలిసేదెలా?

? మా బాబుకు నాలుగేళ్లు. స్పష్టంగా మాటలు రావడం లేదు. చెప్పింది గ్రహించడం లేదు. సరిగానూ నడవలేకపోతున్నాడు. వాడి పరిస్థితి చూస్తే భయమేస్తుంది. ఇదేమైనా సమస్యా? – ఓ సోదరి



తల్లి గర్భంలో ఉన్నప్పుడు లేదా ప్రసవ సమయంలో బాబు మెదడుకు చిన్నపాటి గాయమై ఉండొచ్చు. మెదడు అభివృద్ధిలో ఏదైనా సమస్య ఉన్నా ఇలా జరుగుతుంది. సిజేరియన్ సమయంలో, నొప్పులు... ప్రసవానికి మధ్య చాలా సమయం పట్టొచ్చు. ఇలాంటప్పుడు బాబు మెదడుకు గాయాలయ్యే అవకాశం ఉంటుంది. ఈ సమస్య ఉన్న చిన్నారుల్లో మోటార్ కో-ఆర్డినేషన్ సిస్టమ్ బలహీనంగా ఉంటుంది. మెదడు, కండరాల మధ్య సమన్వయం బలహీనమవుతుంది. వారిలో కండరాల సాంద్రత (మజిల్ టోన్), సామర్థ్యం కాస్త తక్కువగానే ఉంటుంది. దాంతో అందరిలా నడవలేరు. మాటలూ స్పష్టంగా పలకలేరు. అంతేకాదు చెప్పింది సరిగా గ్రహించలేరు. తరచూ అనారోగ్యానికీ గురవుతుంటారు. మీరు భయపడకుండా ముందు బాబును పిల్లల వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి చూపించండి. సమస్యను చెప్పండి. వారి సలహా మేరకు స్పీచ్, ఫిజియోథెరపిస్ట్‌లను సంప్రదించవచ్చు. అవసరం అనుకుంటే... పరీక్షించి ఐక్యూటెస్ట్‌నీ నిర్వహిస్తారు. ఈ రోజుల్లో ప్రతి సమస్యకు పరిష్కారం ఉంది కాబట్టి... భయపడకండి.

డియర్ వసుంధర


డా. మండాది గౌరీదేవి
పిల్లల మానసిక నిపుణురాలు

- మీ సందేహాలను vasukid@eenadu.net కు పంపించగలరు.

**అనుకోని పరిస్థితుల్లో ఉద్యోగ జీవితంలో కొంత విరామం వస్తుంది. ఆ దశ దాటి, తిరిగి కెరియర్‌ను కొనసాగించాలని వుంటుంది. ఎలా ముందుకు సాగాలో తెలియదు. ఇలాంటి దశను ముఖ్యంగా యువతులు ఎదుర్కొంటుంటారు. ఒక్క అవకాశం వస్తేనా.. అని ఎదురుచూస్తుంటారు. 'కెరియర్‌ను పునః ప్రారంభించాలనుకున్నవారికి ఆ అవకాశం మేమందిస్తాం' అంటున్నాయి కొన్ని సంస్థలు. వాటి వెబ్‌సైట్‌లను తరచూ గమనిస్తూ ప్రకటన వచ్చినపుడు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాంటివారి నుంచి మౌఖికపరీక్ష ద్వారా కొందరిని ఎంపిక చేసుకుని, శిక్షణ ఇచ్చి ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. ఉత్సాహంగా సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించాలనుకుంటున్నవారిని ప్రోత్సహిస్తున్నాయి!**




కెరియర్ 2.0

# మానేసినా.. మరో ఛాన్స్!

స్మిత.. బీటెక్ పూర్తయ్యాక రెండేళ్లపాటు ఉద్యోగం చేసింది. ఆపై బాబు ఆలనాపాలనా చూసుకోవడానికి కెరియర్‌ను పక్కన పెట్టింది. అలా ఆరేళ్లు గడిచాక తిరిగి తన ఉద్యోగ జీవితాన్ని మొదలుపెట్టాలనుకుంది. ఆరు నెలల్లో కార్పొరేట్ ప్రపంచంలోకి తిరిగి అడుగుపెట్టింది.

ఈ ఉదాహరణ వింటే చాలామందికి ఆశ్చర్యం కలుగుతుంది. 'జాబ్ మార్కెట్‌లో మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ఏటికేడాది నేర్చుకోవాల్సిన నైపుణ్యాలు మారిపోతున్నాయి. అలాంటిది ఆరేళ్ల తరువాత కోరుకున్న ఉద్యోగంలోకి అడుగుపెట్టడం ఎలా సాధ్యం?' అని! అది సాధ్యమేనంటూ అవకాశాలిస్తున్నాయి కొన్ని సంస్థలు.

కెరియర్‌ను మగవారితో సమానంగా ప్రారంభించినా ఏదో ఒకదశలో కామా పెట్టడం యువతులకు తప్పనిసరి. పెళ్లి, మెటర్నిటీ, స్థలమార్పిడి వంటివి ఇందుకు ప్రధాన కారణాలవుతున్నాయి. కొంతకాలం విరామం తరువాత తిరిగి కెరియర్‌ను ప్రారంభించాలనుకున్నా కొందరి విషయంలో అది ఆచరణలోకి రావటంలేదు. సెంటర్ ఫర్ టాలెంట్ ఇన్నొవేషన్ (సీటీఐ) నివేదిక ప్రకారం దేశంలో 36% మంది వర్కింగ్ ప్రొఫెషనల్స్ విరామం తీసుకుంటుంటే వారిలో 58% మంది మాత్రమే తిరిగి ఫుల్‌టైం ఉద్యోగాల్లో చేరగలుగుతున్నారు.

చాలామంది తమ అర్హతలకు తగిన వాటిని పొందలేకపోతున్నారు. కుటుంబానికి ఆర్థిక ఆసరా అవసరమైతే పరిస్థితులకు సర్దుకుపోతున్నవారూ ఉన్నారు. ఒక చిన్న విరామం ప్రతిభకు అవరోధం కాకూడదనే ఉద్దేశంతో కొన్ని సంస్థలు మహిళలకు తిరిగి ఉద్యోగంలో చేరేలా ప్రత్యేక ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. ఏదైనా సంస్థలో సంబంధిత రంగంలో కనీస అనుభవం ఉన్నవారిని ఎంచుకుని, కొంత శిక్షణనిచ్చి, ఉద్యోగానికి తిరిగి సిద్ధం చేస్తున్నాయి. పైగా వయఃపరిమితి లేదు. చాలావరకూ ప్రోగ్రామ్ సమయంలో వేతనం చెల్లిస్తున్నాయి కూడా!



## ఏ సంస్థలో ఏ ప్రోగ్రామ్?

### ఆక్సెంచర్- కెరియర్ రీబూట్

కెరియర్ బ్రేక్ తరువాత తిరిగి ఉద్యోగంలోకి చేరడానికి అవసరమైన నైపుణ్యాలను మెంటర్ల ఆధ్వర్యంలో అందిస్తారు. ఇందులో భాగంగా పరిశ్రమ నిపుణులు, వాటి లీడర్‌షిప్ టీమ్‌లతో కలిసి పనిచేసే అవకాశం కల్పిస్తారు. వీరు కెరియర్ పునరుద్ధరణకు అవసరమైన నైపుణ్యాలు, చిట్కాలు అందిస్తారు. ఆరు నెలలపాటు ఈ ప్రోగ్రామ్ సాగుతుంది. నచ్చిన విభాగం/రంగాన్ని ఎంచుకోవచ్చు. ముఖ్యంగా ఫైనాన్స్- అకౌంటింగ్, బీపీఓ నేపథ్యం వారికి ఇది అనుకూలం. రెజ్యూమెను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు అవసరమైన వివరాలను అందించాల్సి ఉంటుంది. సంస్థ ప్రతినిధులు అభ్యర్థిని సంప్రదించి, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారు.

https://www.accenture.com/in-en/careers/career-reboot

### కాప్‌జెమినీ- కాప్టివేట్

వృత్తి నిపుణులై ఉండి, తిరిగి ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించాలనుకునేవారికి సాయం అందించాలనే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించారు. కనీసం మూడేళ్ల పని అనుభవం ఉండి, కనీసం ఏడాదిపాటు విరామం తీసుకున్నవారు దీనికి ప్రయత్నించవచ్చు. వెబ్‌సైట్‌లో తమ అనుభవానికి తగ్గవాటికి దరఖాస్తు చేసుకోవచ్చు. సాంకేతిక నైపుణ్యాలు, గత ఉద్యోగ హోదా, నిర్వహించిన బాధ్యతలు మొదలైనవాటిని పరిశీలిస్తారు. అర్హత గలవారిని టెక్నికల్, మేనేజీరియల్ ఇంటర్వ్యూ నిమిత్తం పిలుస్తారు. అవసరమైన శిక్షణ, నైపుణ్యాలను అందిస్తారు. మెంటరింగ్, నిపుణులతో సంప్రదింపులు జరిపే అవకాశాన్ని కల్పిస్తారు. టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ రంగాలవారు దీనికి ప్రయత్నించవచ్చు.

https://www.capgemini.com/in-en/

### గోద్రెజ్- కెరియర్ 2.0

ప్రోగ్రామ్ వ్యవధి 3 నుంచి 6 నెలల వరకు ఉంటుంది. కనీసం రెండేళ్ల అనుభవం ఉండి, ఆరు నెలలకు పైగా విరామం తీసుకున్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే మాన్యుఫాక్చరింగ్/ ఇంజినీరింగ్, సేల్స్ అండ్ మార్కెటింగ్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ డిజైనింగ్, లీగల్ అండ్ ఆడిట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, స్ట్రాటజీ/ జనరల్ మేనేజ్‌మెంట్ విభాగాలకు చెందినవారే అర్హులు. ఆసక్తి ఉన్నవారు సంస్థ వెబ్‌సైట్‌లో ఇచ్చిన మెయిల్ ఐడీకి తమ రెజ్యూమెను పంపాల్సి ఉంటుంది. అర్హులను గుర్తించి టెలిఫోనిక్ ఇంటర్వ్యూ, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. వీరికి విద్యార్హతలు, అనుభవం ఆధారంగా ప్రాజెక్టులను కేటాయిస్తారు. ప్రాజెక్టులో అభ్యర్థికి సాయపడేలా, కలిసి పనిచేసేలా ఒక మెంటర్‌ను కేటాయిస్తారు. దీని ద్వారా అవసరమైన శిక్షణతోపాటు, నెట్‌వర్కింగ్ అవకాశాలనూ పొందొచ్చు.

https://www.godrejcareers.com/careers2.0.aspx

### హిందుస్థాన్ యూనిలీవర్- కెరియర్ బై చాయిస్

మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, సప్లై చెయిన్, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ల్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. పని గంటలు, దినాలను ఎంచుకునే వీలును కల్పిస్తున్నారు. ఎంపికైనవారికి ఇన్ హౌజ్ ట్రైనింగ్, ప్రాజెక్ట్ వర్క్, వివిధ రంగాల నిపుణులతో కలిసి పనిచేయడం వంటి మూడు విధానాల్లో శిక్షణనిస్తారు. అభ్యర్థి అర్హతలనుబట్టి ప్రాజెక్టులను కేటాయిస్తారు. వీరితోపాటు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేలా, కలిసి పనిచేసేలా ఒక మెంటర్‌ను కేటాయిస్తారు. వీరు అభ్యర్థికి అవసరమైన మెలకువలను నేర్పిస్తారు. ఆసక్తి ఉన్నవారు రెజ్యూమెను సంస్థ మెయిల్ ఐడీకి పంపాల్సి ఉంటుంది. ముంబయిలో మాత్రమే ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయి.

https://www.hul.co.in/careers/professionals/career-by-choice/

### టాటా- ఎస్‌సీఐపీ

టాటా- సెకండ్ కెరియర్స్ ఇన్‌స్పైరింగ్ పాసిబిలిటీస్ (ఎస్‌సీఐపీ). నచ్చిన చోట, నచ్చిన దానిలో, నచ్చిన సమయంలో, వీలైన వేగంతో పనిచేయడం అనే కాన్సెప్ట్‌తో పనిచేస్తోంది ప్రోగ్రామ్. ప్రాజెక్టులు (3-6 నెలలు), కన్సల్టెంట్ (6-12 నెలలు), ఫుల్ టైంల్లో అభ్యర్థి తనకు నచ్చినదానికి దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం వరుసగా రెండేళ్లపాటు పనిచేసిన అనుభవం ఉండాలి. ఒక నెల నుంచి ఏళ్లపాటు విరామం తీసుకున్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతం మాత్రం ఖాళీగా ఉండాలి. కెరియర్ డొమైన్లు- మార్కెటింగ్, లీగల్, కార్పొరేట్ ప్లానింగ్, అడ్వర్టైజింగ్/ కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హాస్పిటాలిటీ, ఇంజినీరింగ్, మాన్యుఫాక్చరింగ్, రిటైల్, సేల్స్, డిజైన్, సీఎస్ఆర్, ఫైనాన్స్/ అకౌంటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇతర కార్పొరేట్ ఫంక్షన్స్. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అందుబాటులో ఉన్నవాటికి దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైనవారిని సంస్థ ప్రతినిధులు సంప్రదిస్తారు.

http://www.tatasecondcareer.com/index.asp

### గోల్డ్‌మన్ శాక్స్- రిటర్న్‌షిప్

ప్రోగ్రామ్ కాలవ్యవధి 8 వారాలు. రెండు, అంతకుమించిన సంవత్సరాల విరామం తీసుకున్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్థలోని వివిధ విభాగాలు, నెట్‌వర్క్‌తో పనిచేసే అవకాశాన్ని కల్పిస్తారు. గతంలో అభ్యర్థి పనిచేసినప్పటికీ, ఇప్పటికీ ఉన్న తేడా ఆధారంగా అవసరమైన నైపుణ్యాలను అందిస్తారు. కొత్త విభాగంలో నైపుణ్యం సాధించే అవకాశం కల్పిస్తారు. ప్రోగ్రామ్‌కు సంబంధించి ప్రకటన విడుదల చేస్తారు. ఆసక్తి ఉన్నవారు మెయిల్ ద్వారా సంప్రదించాల్సి ఉంటుంది. అర్హులైనవారిని సంస్థ ప్రతినిధులు సంప్రదిస్తారు.

https://www.goldmansachs.com/careers/professionals/returnship/

### ఐబీఎం- టెక్ రీ ఎంట్రీ ప్రోగ్రామ్

విరామం తీసుకున్న వృత్తి నిపుణుల కోసం రూపొందించారు. కనీసం రెండేళ్ల విరామం తీసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిలో జాబ్ ప్రాజెక్టులు, కొత్త టెక్నాలజీల గురించి తెలుసుకునే వీలు, మల్టీ డిసిప్లినరీ విభాగాలతో పనిచేసే వీలుంటుంది. క్లౌడ్ సేల్స్ అంశాలపై ఆసక్తి ఉన్నవారికి అనుకూలం. ప్రతి ఒక్కరికీ మెంటర్ ఉంటారు. వీరు కొత్త టెక్నాలజీలనే నేర్పించడంతోపాటు రియల్ టైం ప్రాజెక్టులపై పనిచేసే వీలును కల్పిస్తారు. ప్రోగ్రామ్ పూర్తయ్యాక అవసరమైతే ఫుల్ టైం ఎంప్లాయ్‌మెంట్ అవకాశాలనూ కల్పిస్తారు. ఏడాదిలో నిర్ణీత సమయంలో ప్రకటన విడుదల చేస్తారు. అప్పుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూ నిర్వహించి అవకాశం కల్పిస్తారు.

https://www.ibm.com/in-en/employment/techreentry.html

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### హెచ్‌పీసీఎల్, ముంబయి

ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టులు-ఖాళీలు:** ప్రాజెక్ట్ ఇంజినీర్ (మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఇనుస్ట్రుమెంటేషన్)-116, రిఫైనరీ ఇంజినీర్ (కెమికల్)-10, లా ఆఫీసర్-04, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్-20, హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్-08, ఫైర్ & సేఫ్టీ ఆఫీసర్-06.

**మొత్తం ఖాళీలు:** 164 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, లా, పీజీ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ టాస్క్, మూట్ కోర్ట్ ఆధారంగా.

**దరఖాస్తు:** ఆన్‌లైన్. **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 19 నుంచి **చివరితేది:** సెప్టెంబర్ 16

**వెబ్‌సైట్:** https://www.hindustanpetroleum.com/

#### ఎయిమ్స్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

నాగపూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ఫ్యాకల్టీ పోస్టులు

**పోస్టులు-ఖాళీలు:** ప్రొఫెసర్-07, అడిషనల్ ప్రొఫెసర్-06, అసోసియేట్ ప్రొఫెసర్-08, అసిస్టెంట్ ప్రొఫెసర్-29. **విభాగాలు:** అనస్థీషియా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పాథాలజీ, తదితరాలు.

**అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎండీ/ ఎంఎస్ ఉత్తీర్ణత, టీచింగ్ అనుభవం. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ. **దరఖాస్తు:** ఈమెయిల్/ ఆఫ్‌లైన్ ద్వారా. **ఈమెయిల్ ద్వారా దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 17. **దరఖాస్తు హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేది:** అక్టోబరు 2. **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in/

#### కేఎన్ఆర్‌యూహెచ్ఎస్, వరంగల్

తెలంగాణ రాష్ట్రానికి చెందిన వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టులు-ఖాళీలు:** జూనియర్ అసిస్టెంట్-15, జూనియర్ స్టెనోగ్రాఫర్-04. **మొత్తం ఖాళీలు:** 19 **అర్హత:** సంబంధిత సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత, టైపింగ్ వచ్చి ఉండాలి. **వయసు:** 18-34 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ప్రొఫిషియన్సీ టెస్ట్. **పరీక్షతేది:** అక్టోబరు 20. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 18 **చివరితేది:** సెప్టెంబరు 09 https://www.knruhsrt.in/

#### సీబీఎస్ఈ - సీటెట్

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 13వ ఎడిషన్ సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్-డిసెంబరు 2019)కి నోటిఫికేషన్ విడుదల చేసింది.

● సీబీఎస్ఈ - సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్-డిసెంబరు 2019) **ఎంపిక:** అర్హత పరీక్ష ద్వారా. **పరీక్షతేది:** డిసెంబర్ 8, 2019 **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 19 **చివరితేది:** సెప్టెంబర్ 18 **వెబ్‌సైట్:** https://ctet.nic.in/

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో

## మెకానికల్.. నానో ఏది మేలు?

Q&A

**టీఎస్ పీజీఈసెట్‌లో మెకానికల్‌లో 46వ ర్యాంకు, నానో టెక్నాలజీలో 3వ ర్యాంకు సాధించాను. ఈ రెండింటిల్లో దేన్ని ఎంచుకుంటే భవిష్యత్తు బాగుంటుంది? నానోటెక్నాలజీకి జేఎన్‌టీయూ- కరీంనగర్‌ను ఎంచుకోవచ్చా? మరో సందేహం- ఆర్ఎఫ్‌సీఎల్ లాంటి పరీక్ష ఫలితాల్లో అవకతవకలకు ఆస్కారముందా?** - నాగరాజు తూటి



ఓయు పరిధిలో పీజీఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసింది. భవిష్యత్తు అవకాశాల దృష్ట్యా నానో టెక్నాలజీ కోర్సు ఉత్తమ ఎంపిక. మనదేశంలో మాత్రం ఇది ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. సమీప భవిష్యత్తులో సర్వీస్, మెటీరియల్స్ విభాగాల్లో నానోటెక్నాలజీ 5 లక్షల ఉద్యోగాలను అందించనుందని అంచనా! ఐఐటీలు, ఐఐఎస్‌సీలు, కొన్ని సంస్థలు నానోటెక్నాలజీలో పరిశోధనకు ప్రాముఖ్యమిస్తున్నాయి. మీకు కూడా పరిశోధనపై ఆసక్తి ఉంటే దీన్ని ఎంచుకోవచ్చు. రిస్క్ తీసుకోవడం ఇష్టం లేదనుకుంటే మెకానికల్‌ను ఎంచుకోండి. ముందు ఎంటెక్ ఎందుకు చేయాలనుకుంటున్నారో స్పష్టం చేసుకోండి. కేవలం ఎంటెక్ అర్హత ఉన్న ఉద్యోగాలకు ప్రయత్నించాలనుకుంటున్నారా? లేదా రిసెర్చ్ కూడా చేయాలనుకుంటే ఏ కోర్సు అయినా ఫర్వాలేదు. నానోకు సంబంధించి కొత్త విభాగం కాబట్టి, పీహెచ్‌డీ త్వరగా పూర్తి చేసుకునే అవకాశమూ ఎక్కువే. అలాకాకుండా ఎంటెక్‌ను ఉద్యోగం వచ్చేంతవరకూ బిజీగా ఉంచే సాధనంగా భావిస్తే ఏ కోర్సూ ఉపయోగకరం కాదు. జేఎన్‌టీయూ- కరీంనగర్‌కి మంచి పేరుంది. అయితే ఇక్కడ ఫాకల్టీ పరంగా కొంత కొరత ఉంది. దీన్నే ఎంచుకోవాలనుకుంటే మెకానికల్ కోసం ప్రయత్నించవచ్చు.

ఇక పోటీపరీక్ష గురించి. పరీక్షలు పారదర్శకంగానే జరుగుతాయి. కంప్యూటర్ ఆధారిత పరీక్షల విషయంలో మార్పులు చేయడం కష్టం. అయినా ఎంపిక విషయంలో పాటించే పద్ధతులు సంస్థను బట్టి ఉంటాయి. అయితే ముందుగానే ఈ విషయాన్ని చెప్పారా లేదా అన్నది ముఖ్యం. జాబ్ మార్కెట్ ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగం అంటేనే పోటీతో కూడుకున్నది. పరిజ్ఞానమున్న వారి మధ్య జరిగే పోటీ. సబ్జెక్టుకు సంబంధించి పూర్తిగా సిద్ధమై ఉండాలి. ఉద్యోగాన్ని ఒడిసి పట్టుకోవాలంటే పోటీతత్వం, కచ్చితత్వం, వేగం తప్పనిసరి. కాబట్టి, మిగతా ఆలోచనలను మనసులోంచి తుడిచిపెట్టి, మీవంతు ప్రయత్నం చేయండి. - నీల మేఘశ్యామ్ దేశాయ్

## సీఏ టాప్ ర్యాంకును ఇలా ఒడిసిపట్టేశా!

**సీఏ తుది పరీక్షల్లో తొలిసారే నెగ్గటం ఆషామాషీ కాదు. అలాంటిది ఆ పరీక్షలో తొలి ప్రయత్నంలో ఏకంగా జాతీయస్థాయి రెండో ర్యాంకు సాధించింది హైదరాబాద్ విద్యార్థిని వి.పి.రాధాలక్ష్మి. ఐదు నెలలు కఠోరంగా శ్రమించిన ఆమె తన ప్రిపరేషన్ విధానాన్ని 'ఈనాడు- చదువు' పాఠకులతో ఇలా పంచుకుంది!**

చార్టర్డ్ అకౌంటెన్సీ చేయాలని చిన్నప్పట్నుంచి లక్ష్యంగా పెట్టుకున్నా. నా ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిగా హైదరాబాద్ బేగంపేటలోని గీతాంజలి పాఠశాలలో సాగింది. తర్వాత సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో డిగ్రీలో బీకాంలో చేరాను. మా నాన్న పరశురాం స్వస్థలం చెన్నై. నా చిన్నతనంలోనే వారు హైదరాబాద్‌కు వచ్చేశారు. ఆయన ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్ఫూర్తితోనే సీఏ వైపు మళ్లాను. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే గణితం, అకౌంట్లపై ఆసక్తి కలిగింది. అప్పుడే సీఏ చేయాలని నిర్ణయించుకున్నా.

ఒకవైపు బీకాం చదువుతూనే మరోవైపు సీఏ చేశాను. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక ప్రస్తుతం రాయదుర్గంలోని కేపీఎంజీ కంపెనీలో ఆర్టికల్‌షిప్ చేస్తున్నాను. మే నెలలో సీఏ తుది పరీక్షలు జరిగాయి. ఇందుకు ఐదు నెలల ముందే స్టడీ లీవ్ తీసుకున్నా.

ఐదు నెలలపాటు పూర్తిగా సీఏ పరీక్ష సిలబస్‌పైనే దృష్టి పెట్టా. రోజుకూ 10 నుంచి 11 గంటలు చదివేదాన్ని. రాత్రిళ్లు పొద్దుపోయే వరకు చదవడంతోపాటు ఉదయాన్నే 6 గంటలకు లేచి సాధన ప్రారంభించేదాన్ని. సిలబస్‌లో ఉన్న అన్ని అంశాలనూ చదవడంతోపాటు నోట్స్ రాసుకునేదాన్ని.

అమ్మానాన్నల ప్రోత్సాహం మరువలేనిది. సిలబస్‌లో అర్థం కాని విషయాలను నాన్న వివరించేవారు. ఒక గైడ్‌లా నా వెంట నిలిచి నడిపించారు. పరీక్షల సమయంలోనూ ఎక్కడా అధైర్యపడకుండా ఎప్పటికప్పుడు నైతిక బలం ఇచ్చేవారు. జాతీయస్థాయిలో రెండో ర్యాంకు వస్తుందని అనుకోలేదు. ఫలితాలు చూశాక ఇంత మంచి ర్యాంకు సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉంది.

● సీఏ పరీక్ష రాసే విద్యార్థులు ఒక్కో అంశంలో బలహీనంగా ఉండవచ్చు. అందుకు అధైర్యపడనక్కర్లేదు. మన ప్రిపరేషన్‌లో సగం సమయం క్లిష్టతరంగా భావించే అంశాలకు వెచ్చించాలి. ప్రతి సమస్యను ఎన్ని విధాలుగా పరిష్కరించగలమా.. అని ఆలోచించడంపాటు ఎంత త్వరగా పరిష్కరించగలమనేదీ ముఖ్యం. దానివల్ల క్లిష్టతరంగా భావించే అంశాలపై మంచి పట్టు సాధించవచ్చు. నాకు థియరీ కష్టంగా ఉండేది. అందుకే దీనిపై శ్రద్ధ పెట్టాను. ప్రిపరేషన్‌లో సగం సమయం దానికోసమే వెచ్చించాను.

● సిలబస్ అంశాల సాధనతోపాటు గతంలో ప్రశ్నపత్రాల ప్రాక్టీసు కూడా ఎంతో ముఖ్యం. దీనివల్ల ఎక్కడెక్కడ ప్రశ్నలు అధికంగా వస్తున్నాయో అవగాహన వస్తుంది. వాటిపై ఎక్కువగా ఫోకస్ చేయడానికి వీలుంటుంది. నేను గత మూడు పరీక్షల పేపర్లు తీసుకుని సాధన చేశా. దానివల్ల పరీక్ష సరళిపై ఓ అవగాహన వచ్చింది. అలాగే సమయపరంగా త్వరగా చేసేందుకూ వీలు చిక్కింది.

✦ సొంత నోట్సు
✦ క్లిష్ట అంశాలపై దృష్టి
✦ పునశ్చరణ
✦ అధిక సాధన



● కేవలం సిలబస్‌ను చదవడం, ప్రాక్టీసు చేయడమే కాదు.. దానిపై ఎంత పట్టు సాధించామన్నది ముఖ్యం. కనీసం రెండుసార్లు సిలబస్‌ను పూర్తిగా చదివి.. లెక్కలను ప్రాక్టీసు చేయాలి. అప్పుడే సిలబస్‌లోని అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన ఏర్పడుతుంది. నేనైతే ఐదు నెలల సమయంలో సిలబస్‌ను రెండుసార్లు పునశ్చరణ (రివిజన్) చేశాను. విజయానికి ఇది చాలా ముఖ్యం.

- అమరేంద్ర యార్లగడ్డ, ఈనాడు, హైదరాబాద్

# ఉత్తరాదిపై కుంభవృష్టి

- 3 రాష్ట్రాలు అతలాకుతలం
- 28 మంది మృతి
- ఉత్తరాఖండ్‌లో 22 మంది గల్లంతు

దిల్లీ: కుండపోతగా కురుస్తున్న వర్షాలు ఉత్తరాదిన హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌లను అతలాకుతలం చేశాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. భారీగా ఇళ్లు, చెట్లు నేలమట్టమయ్యాయి. మూడు రాష్ట్రాల్లో ఆదివారం 28 మంది ప్రాణాలు కోల్పోగా, 22 మంది జాడ తెలియరాలేదు. చాలాచోట్ల వరదలకు ఇళ్లు కొట్టుకుపోయాయి.





దేహ్రాదూన్‌లో టోంస నదికి వరదలు

**పంజాబ్**
**పొంగిన నదులు**
**మృతుల సంఖ్య : 3**

పంజాబ్‌లో అతి భారీవర్షాలు కురుస్తున్నాయి. యమున, సట్లెజ్, బియాస్ నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అవోల్‌లో ఇల్లు కూలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు.


హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో భారీ వర్షాలకు బియాస్ నది పొంగడంతో మునిగిన పంచవక్త్ర మహాదేవ్ ఆలయం

**హిమాచల్‌ప్రదేశ్**
**మృత్యుచరియలు..**
**మృతుల సంఖ్య : 22**

హిమాచల్‌ప్రదేశ్‌లో ఇళ్లు, వాహనాలపై భారీగా కొండ చరియలు విరిగిపడ్డాయి. శిథిలాల కింద పలువురు ప్రాణాలు కోల్పోయారు. 9 మంది గాయపడ్డారు. శిమ్లా, సోలన్, కులూ, సిర్మౌర్, చాంబా ప్రాంతాల్లో ప్రాణ నష్టం ఎక్కువగా ఉంది. శిమ్లా, కులూ, చాంబా జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు.

**ఉత్తరాఖండ్**
**కొట్టుకుపోయిన ఇళ్లు**
**మృతుల సంఖ్య : 3**

ఉత్తరకాశీ జిల్లా మోరీ సమితిలో కుంభవృష్టి వర్షాలకు చాలాచోట్ల ఇళ్లు కొట్టుకుపోయాయి. వరదల్లో 22మంది గల్లంతయ్యారు. వారంతా చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. మరో ముగ్గురు మృతి చెందారు. చార్‌ధామ్, కైలాస్-మానస సరోవర్ మార్గాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి.


శిమ్లాలో భారీ వర్షాలకు చెట్టు కూలడంతో ధ్వంసమైన బస్సు

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

## పాడి రైతు కడుపు రగిలింది..!

అసోం: పాడి రైతుల కడుపు మండింది.. తమ ప్రయోజనాలను పణంగా పెడుతూ తీసుకున్న నిర్ణయంపై పెద్దపెట్టున నిరసన గళం వినిపించారు. మోరిగావ్‌లో వెయ్యి లీటర్ల పాలను నదిలో పారబోసి ఆందోళనకు దిగారు. అసోంలో రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ పాడి అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ) ఆధ్వర్యంలోని పురబి డైరీ (పాల సేకరణ సంస్థ)తో ఓ ఒప్పందానికి వచ్చింది. ఇది అసోంకు చెందిన స్థానిక రైతులకు దెబ్బతీసేలా ఉందన్నది రైతుల ఆవేదన. ప్రభుత్వం దిగొచ్చి.. స్థానికేతరుల నుంచి కాకుండా అస్సామీ రైతుల నుంచే పాలను సేకరించేలా ప్రభుత్వం హామీ ఇవ్వాలన్నది వారి డిమాండ్. పురబి డైరీకి అస్సామీ వర్గానికి చెందిన వారినే ఛైర్మన్‌గా నియమించాలని కూడా పట్టుబడుతున్నారు. డిమాండ్లు నెరవేరకపోతే ఆందోళన ఉద్ధృతమవుతుందని అల్టిమేటమ్ కూడా ఇచ్చారు.



## తలాక్ చెప్పలేదని.. తగులబెట్టాడు!

ఉత్తర్‌ప్రదేశ్: ముమ్మారు తలాక్ చెప్పడానికి నిరాకరించిందని కట్టుకున్న భార్యను కన్నబిడ్డ కళ్లెదుటే ఓ దుర్మార్గుడు సజీవ దహనం చేశాడు. ఈ దారుణంతో ఆమె కన్నవారి కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. నిందితుడు రఫీక్‌ది యూపీలోని శ్రావస్తి. కుటుంబాన్ని ఇక్కడే వదిలేసి మహారాష్ట్రలో పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం అతను ఫోన్‌లో భార్యకు ముమ్మారు తలాక్ చెప్పాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఇటీవల ఇంటికి వచ్చిన అతను ఆమెపై తీవ్రంగా ఒత్తిడి చేశాడు.. లొంగకపోవడంతో దాడి చేశాడు. కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కన్నతండ్రి కర్కశాన్ని కళ్లారా చూసిన ఐదేళ్ల చిన్నారి విషయాన్ని తన మేనమామకు తెలిపింది. ఆయన ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు.

## వరదల్లో ఉడతాభక్తి..!



కేరళ: వరదల విలయానికి విలవిలలాడుతున్న బాధితులకు ఎవరికి తోచిన రీతిలో వారు సాయం అందిస్తున్నారు. జుగాడ్‌లోని ఓ కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించారు. విద్యుత్తు లేక ప్రజలు అల్లాడుతున్న ప్రాంతాల్లో మొబైల్ ఛార్జింగ్‌కు వీలుగా 270 పవర్ బ్యాంకులను తయారు చేసి.. వయనాడ్‌లో పంపిణీ చేశారు. నిపుణుల సహకారంతో వారు చేసిన ఈ సాయాన్ని పలువురు మెచ్చుకుంటున్నారు.

## ఆనందానికి మారుపేరు భూటాన్

### ప్రధాని మోదీ ప్రశంస

థింపు: సంతోషంలోని సారాంశాన్ని భూటాన్ అర్థం చేసుకొందని, అందుకనే అది ఆనందానికి పర్యాయపదంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఆ కారణంగానే ప్రపంచానికి స్థూల జాతీయ ఆనందం (గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్) అనే భావనను అందించిందని చెప్పారు. రెండు రోజులుగా ఆ దేశంలో పర్యటిస్తున్న మోదీ ఆదివారం రాయల్ యూనివర్సిటీ ఆఫ్ భూటాన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అసాధ్యాలను సాధించే శక్తిసామర్థ్యాలు ఆ దేశ యువతకు ఉన్నాయని, ఇవి తప్పకుండా భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని చెప్పారు. ఇరుగుపొరుగున ఉండడం ద్వారా మాత్రమే కాకుండా చరిత్ర, సాంస్కృతికంగా కూడా ఇరుదేశాలు సన్నిహిత, సహజ మిత్రులని అభివర్ణించారు. ఈ సమావేశంలో ఆ దేశ ప్రధాని లొటాయ్ ఛెరింగ్ పాల్గొన్నారు. భూటాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ తిరిగి దిల్లీ చేరుకున్నారు.

## రిజర్వేషన్లపై సామరస్యంగా చర్చ జరగాలి: మోహన్ భగవత్

దిల్లీ: రిజర్వేషన్లపై సామరస్యపూర్వక వాతావరణంలో చర్చలు జరగాలని ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్ సూచించారు. రిజర్వేషన్ల అనుకూలురు, వ్యతిరేకులు ఎదుటి పక్షం ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని వాదనలు వినిపించాలని అన్నారు. ఆదివారం ఇక్కడ ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ శిక్షా సంస్కృతి ఉత్థాన్ నిర్వహించిన జ్ఞాన్ ఉత్సవ్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రిజర్వేషన్లపై చర్చలు జరిగిన ప్రతిసారీ ఘాటు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయని, అలాకాకుండా అన్నివర్గాలవారూ సుహృద్భావ రీతిలో అభిప్రాయాలు పంచుకోవాలని అన్నారు. ఆర్ఎస్ఎస్, భాజపాలు వేరువేరు సంస్థలని ఒకదాని చర్యలకు మరొకటి బాధ్యత వహించదని చెప్పారు. మోదీ ప్రభుత్వంపై ఆర్ఎస్ఎస్ ప్రభావంపై మాట్లాడుతూ "చాలా మంది సంఘ్ కార్యకర్తలు భాజపాలోను, ప్రభుత్వంలోనూ ఉన్నారు. ఆర్ఎస్ఎస్ చెప్పేది వారు వింటారు. కానీ దానిని తప్పనిసరిగా అమలు చేయాలని ఏమీ లేదు. వారు విభేదించవచ్చు కూడా" అని వివరించారు. ప్రభుత్వం విశాల దృష్టితో వ్యవహరించవలసి ఉంటుందని, అందువల్ల ఆర్ఎస్ఎస్ అభిప్రాయాలతో ఏకీభవించకపోవచ్చని అన్నారు.



# ఆక్రమిత కశ్మీర్‌పై గురి!

- స్వరం పెంచిన కేంద్ర మంత్రులు

కల్కా, జమ్మూ: జమ్మూ-కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రులు ఆదివారం తమ స్వరాన్ని పెంచారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లక్ష్యంగా వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని ఆపనంతకాలం పాకిస్థాన్‌తో చర్చలు అసాధ్యమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. ఒకవేళ ఆ దేశంతో చర్చలు జరపాల్సి వస్తే అవి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పైనే ఉంటాయని హరియాణాలోని కల్కాలో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన తేల్చి చెప్పారు. ఇది కాక మరో అంశంపై సంప్రదింపులు ఉండబోవని కుండ బద్దలుకొట్టారు. ఉగ్రవాదం ద్వారా భారత్‌ను అస్థిరపరిచి విచ్ఛిన్నం చేయాలని పాక్ కుట్ర పన్నుతోందని విమర్శించారు. "అయితే వీటిని తిప్పికొట్టేందుకు నిర్ణయాలు ఎలా తీసుకోవాలో మన ప్రధాన మంత్రి ఆచరణలో చూపారు. పుల్వామాలో ఉగ్రవాద దాడి తర్వాత మన వైమానిక దళం పాకిస్థాన్‌లో బాలాకోట్‌పై దాడి చేసింది. అలాంటిదేమీ జరగలేదంటూ వ్యాఖ్యానించిన పాక్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్.. ఇప్పుడు బాలాకోట్ కన్నా పెద్ద దాడికి భారత్ సిద్ధపడుతోందంటున్నారు. అంటే బాలాకోట్‌లో ఉగ్రవాద స్థావరంపై మన యుద్ధవిమానాలు బాంబులు వేసినట్లు ఆయన అంగీకరించినట్లే కదా" అని వ్యాఖ్యానించారు.

మరోవైపు జమ్మూలో జరిగిన భాజపా నేతల సమావేశంలో మరో మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడారు. '370' రద్దు తర్వాత ఇప్పుడు ప్రజలు తమ జీవితకాలంలోనే పీవోకే భారత్‌లో విలీనం కావాలని ప్రార్థించాలన్నారు. "పాక్ అక్రమ కబ్జా నుంచి పీవోకేకి విముక్తి కల్పించి, భారత్‌లో అంతర్భాగంగా మార్చాలన్న సానుకూల ఆలోచనలను చేద్దాం. పీవోకే రాజధాని ముజఫరాబాద్‌ను మనం స్వేచ్ఛగా సందర్శించే రోజు రావాలని ప్రార్థిద్దాం" అని పేర్కొన్నారు.


హరియాణాలోని కల్కాలో 'జన్ ఆశీర్వాద్ ర్యాలీ'ని ప్రారంభిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## ముస్లింల ప్రయోజనానికే తలాక్ చట్టం

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఈనాడు, దిల్లీ: దేశ విభజనకు దారితీసిన సంతుష్టీకరణ రాజకీయాలే దురాచారమైన ముమ్మారు తలాక్ సుదీర్ఘ కాలం కొనసాగేందుకు కారణమయ్యాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఆదివారమిక్కడ శ్యామాప్రసాద్ ముఖర్జీ రీసెర్చి ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ముమ్మారు తలాక్‌ను నేర చర్యగా పరిగణిస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని గట్టిగా సమర్థించారు. ఇలాంటి చర్యలు ముస్లింలకు వ్యతిరేకమని కొంత మంది భాజపా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, అయితే, ఇది హిందువులకు, జైనులకు, క్రైస్తవులకు ప్రయోజనం కలిగించేందుకు కాదని, ముస్లింలకు ప్రయోజనం కలిగించేందుకు మాత్రమేనని మరోసారి స్పష్టం చేస్తున్నా న్నారు. తమ హక్కులు తిరస్కరణకు గురైన కోట్లమంది మహిళలకు ముమ్మారు తలాక్ ఒక పీడకల అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి సిగ్గు లేదని, ఇప్పటికీ తాము తీసుకొచ్చిన చట్టాన్ని వ్యతిరేకిస్తోందన్నారు. బుజ్జగింపు రాజకీయాలపై ఆధారపడే కాంగ్రెస్ కారణంగానే ఈ దురాచారానికి అడ్డుకట్ట పడేందుకు దశాబ్దాలు పట్టిందన్నారు.


లిథ్వేనియా అధ్యక్షుడు గితనాస్ నౌసేడాతో కరచాలనం చేస్తున్న వెంకయ్యనాయుడు

## లిథ్వేనియాతో వాణిజ్యానికి పుష్కలంగా అవకాశాలు

### ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి వ్యాఖ్య

విల్నియస్: లిథ్వేనియా భారత్‌కు ముఖ్యమైన సాంకేతిక భాగస్వామి కాగలదని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా వెంకయ్యనాయుడు శనివారం దిల్లీ నుంచి బయలుదేరి లిథ్వేనియా వచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ రాజధాని విల్నియస్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అక్కడి భారతీయ సమాజాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

## వివాహ వేడుకపై ఆత్మాహుతి దాడి

### కాబూల్‌లో 63మంది మృతి

కాబూల్: పెళ్లి వేడుకను లక్ష్యంగా చేసుకొని కాబూల్‌లో ఓ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. దీంతో అప్పటిదాకా పాటలు, నృత్యాలతో ఆనందంగా గడుపుతున్న ఆహుతుల్లో 63 మంది ప్రాణాలు కోల్పోయారు. 182మంది గాయపడ్డారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో శనివారం రాత్రి ఈ ఘాతుకం జరిగింది. నా కుటుంబం ఇక ఎప్పటికీ కోలుకోలేదంటూ పెళ్లికొడుకు మిర్‌వాయిజ్ కన్నీళ్ల పర్యంతమయ్యాడు. అఫ్గానిస్థాన్‌లో షియాలపై సున్నీలు తరచూ దాడులు చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఈ దాడి జరిగినట్లు చెపుతున్నారు. ఇది తమ పనేనని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది.

## కాంగ్రెస్ తప్పిదాలతోనే చైనా చొచ్చుకొచ్చింది

- భాజపా ఎంపీ నంగ్యాల్ విమర్శ

లేహ్: కాంగ్రెస్ పాలనలో లద్దాఖ్‌కు సరైన ప్రాధాన్యం లభించలేదని భాజపా నేత, ఆ ప్రాంత ఎంపీ జామ్యాంగ్ సేరింగ్ నంగ్యాల్ విమర్శించారు. దీనివల్లే లద్దాఖ్ ప్రాంతంలోకి చైనా ఆక్రమణలు సాగుతున్నాయని ఆరోపించారు. 370 అధికరణం ఉపసంహరణ అంశంపై పార్లమెంటులో చేసిన ప్రసంగంతో వార్తల్లోకెక్కిన నంగ్యాల్ తాజాగా ఒక వార్తా సంస్థతో ముచ్చటించారు. "అంగుళం అంగుళం చొప్పున చైనా దిశగా కదలాలన్న 'ముందడుగు విధానాన్ని' నెహ్రూ రూపొందించారు. ఆచరణలో అది 'వెనకడుగు విధానం'గా మారిపోయింది. మనం వెనక్కి తగ్గేకొద్దీ చైనా మన భూభాగంలోకి చొరబడటం ప్రారంభించింది. అందువల్లే ఆక్సాయ్‌చిన్ ప్రాంతం పూర్తిగా చైనా అధీనంలో ఉంది. ఆ దేశ సైన్యం డెమ్‌చోక్ కాలువ వరకూ చొచ్చుకొచ్చింది. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రక్షణ విధానాలకు సంబంధించి లద్దాఖ్‌కు సరైన ప్రాధాన్యం లభించకపోవడమే ఇందుకు కారణం" అని ఆయన అన్నారు. కశ్మీర్ అంశంపై ఐక్యరాజ్యసమితిని ఆశ్రయించడం ద్వారా కాంగ్రెస్ తప్పు చేసిందని నంగ్యాల్ దుయ్యబట్టారు. కశ్మీర్‌తో కలిసి ఉండటం వల్ల లద్దాఖ్ ఎంతో నష్టపోయిందని నంగ్యాల్ పేర్కొన్నారు.

★ మరోవైపు మొత్తం లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు కింద గిరిజన ప్రాంతంగా ప్రకటించాలని స్థానిక ప్రముఖులు నంగ్యాల్ ఆధ్వర్యంలో కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండాకు వినతిపత్రం సమర్పించారు.

## ప్రధాని ప్రసంగం స్ఫూర్తిదాయకం: శత్రుఘ్నసిన్హా

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి కితాబునిచ్చిన వారిలో మరో కాంగ్రెస్ నేత చేరారు. ఒకప్పుడు మోదీపై అనునిత్యం విమర్శలు గుప్పించిన భాజపా మాజీ ఎంపీ శత్రుఘ్నసిన్హా నుంచి ఈ ప్రశంసలు రావడం విశేషం. ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ చేసిన ప్రసంగం సాహసోపేతంగా, బాగా పరిశోధన చేసి రూపొందించినదిగా, ఆలోచన రేకెత్తించేలా ఉందని కితాబునిస్తూ ట్వీట్ చేశారు.

*370 రద్దుపై కాంగ్రెస్ నేత హూడా మద్దతు*

హరియాణా మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భూపిందర్‌సింగ్ హూడా అధికరణం 370 రద్దుపై కేంద్రప్రభుత్వ చర్యను గట్టిగా సమర్థించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని దుయ్యబట్టారు. కేంద్రం సరైన పనిచేస్తే తాను సమర్థిస్తానన్నారు.


రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా నియమితులైన వినోద్‌కు అభినందనలు తెలుపుతున్న శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు, తెరాస ఎల్పీ కార్యాలయ కార్యదర్శి రమేశ్‌రెడ్డి

## వినోద్‌కు పలువురి అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా నియమితులైన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఆదివారం వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందించారు. తెలంగాణ ప్రణాళిక సంఘం తొలి ఉపాధ్యక్షునిగా పనిచేసిన ఆయన తన అనుభవాలను వినోద్‌కు వివరించారు. రాష్ట్ర శాసనసభా కార్యదర్శి నర్సింహాచార్యులు, తెరాస ఎల్పీ కార్యాలయ కార్యదర్శి రమేశ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్ రాజేశంగౌడ్, బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్‌రాములు, సభ్యులు కృష్ణమోహన్, గౌరీశంకర్, తెలంగాణ ఉద్యోగుల సంఘాధ్యక్షుడు పద్మాచారి, తెరాస కార్మిక విభాగం రాష్ట్రాధ్యక్షుడు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి పి.నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


బెర్లిన్‌లో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న ప్రవాసులు

## జర్మనీలో తెలంగాణ సాంస్కృతిక ఉత్సవాలు

ఈనాడు, హైదరాబాద్: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జర్మనీ రాజధాని బెర్లిన్‌లో తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 600 మంది భారతీయ కుటుంబాల వారు ఇందులో పాల్గొన్నారు. జర్మనీలోని భారత రాయబార కార్యాలయ అధికారిణి మీరా త్రిపాఠి, ఎంపీ మనూలాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారతీయ సాంస్కృతిక సంఘాధ్యక్షుడు వైద్యనాథన్, జర్మనీ తెలంగాణ సంఘం అధ్యక్షుడు చలిగంటి రఘు పాల్గొన్నారు.

# ప్రాణాలకు తెగించారు..సేవలు అందించారు

- అగ్నిప్రమాదం జరిగినా

### బాధ్యత మరువని ఎయిమ్స్ వైద్యులు

దిల్లీ: దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్‌లో వేల మందికి వైద్య సేవలు అందిస్తుంటారు. శనివారం సాయంత్రం ఆ ఆసుపత్రిలో అనూహ్యంగా అగ్ని ప్రమాదం సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించాయి. ప్రాణాలను కాపాడుకునేందుకు ఎవరికివారే పరుగులు తీశారు. మంచానికే పరిమితమైన తమ పరిస్థితి ఏమిటో తెలియక అనేక మంది రోగులు సాయం కోసం ఎదురు చూశారు. గైనిక్ వార్డులో కూడా ఇదే పరిస్థితి.. అక్కడ 30 ఏళ్ల ఓ గర్భవతి నొప్పులతో బాధపడుతోంది. ఏ క్షణమైనా ప్రసవించేలా ఉంది. అలాంటి పరిస్థితుల్లో వైద్యులు, సిబ్బంది తమ ప్రాణాల కంటే రోగుల ప్రాణాలే మిన్నగా భావించారు. ధైర్యం, బాధ్యత, దయార్ద్ర హృదయాలతో స్పందించారు. వెంటనే ఆమెను ఎయిమ్స్ ఆవరణలోనే ఉన్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆప్తాలమిక్ ఇన్‌స్టిట్యూట్‌కు హుటాహుటిన తరలించి కాన్పు చేశారు. ఆ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. "రోగులకు వైద్య సేవలు అందించడం మా బాధ్యత. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ బాధ్యతను విస్మరించలేము" అని ఆమెకు కాన్పు చేసిన సీనియర్ వైద్యుడొకరు చెప్పారు. శనివారం జరిగిన అగ్ని ప్రమాదం ఎయిమ్స్ చరిత్రలోనే అతి పెద్ద అగ్ని ప్రమాదంగా చెబుతున్నారు. ఆదివారానికల్లా అన్ని సేవలనూ పునరుద్ధరించారు. ఇతర విభాగాలకు తరలించిన రోగులను వెనక్కి రప్పించి వైద్యం చేస్తున్నారు.

## బాలిక తలపై బైక్ నడిపిన రాక్షసులు

లఖ్‌నవు: మానవత్వం మంటగలిసింది. దుండగుల దురాగతానికి అమాయకురాలైన ఒక బాలిక బలైంది. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో ముగ్గురు దుండగులు బాలికను వెంటాడి వేధించి ఆమె తలపై బైక్ నడపడంతో ఆమె మరణించింది. ఈ సంఘటన ఆదివారం వెలుగుచూసింది. పాఠశాల నుంచి సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళుతున్న బాలికను అదే సమయంలో బైక్ మీద వస్తున్న ముగ్గురు వెంటాడారు. అసభ్య పదజాలంతో వేధించారు. ఆమె కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకోవటంతో పారిపోయారు. అవమానంగా భావించి పగతో రగిలిపోయారు. కాసేపటికే వెనక్కి తిరిగి వచ్చారు. ఇద్దరు ఆమెను కదలకుండా నేలపై పడుకోబెట్టగా, మరొకడు ఆమె తలపై బైక్ నడిపాడు. ఇంత ఘోరం జరిగి తన మనవరాలు తీవ్ర గాయాలతో చావుబతుకుల్లో ఉంటే పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్దయగా ప్రవర్తించారని, చివరకు ఈ నెల 11న కేసు నమోదు చేశారని బాధితురాలి తాత చెప్పారు. మరోవైపు లఖ్‌నవు కేజీఎంయూ ఆస్పత్రి వైద్యులు చికిత్సకు నిరాకరించి మానవత్వం మరిచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక పరిస్థితి విషమించడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మరణించింది.

## గర్భిణిని తన్నిన మహిళా ఎస్పీ!

భువనేశ్వర్: ఆమె పండంటి బిడ్డను ఎత్తుకోవాలనుకుంది. పాపాయి మురిపాలతో మురిసిపోవాలని తలంచింది. కానీ మాతృత్వ మాధుర్యాన్ని పొందుదామనుకున్న ఆమె కలను ఓ మహిళా ఎస్పీ చిదిమివేసింది. గర్భిణి అనికూడా చూడకుండా పొత్తికడుపు మీద బూటుకాలితో తన్నింది. ఆ పోలీసు ఉన్నతాధికారిపై చర్యతీసుకోవాలని బాధితురాలు ఒడిశా న్యాయస్థానాన్ని వేడుకుంది. కేసును పరిశీలించిన జడ్జి ఆ అధికారిమీద క్రిమినల్ కేసునమోదు చేయాలని ఆదేశించారు. జులై 3న సుందర్‌గఢ్ జిల్లాలోని కణిక గ్రామంలో కారుఢీకొని ఒక యువకుడు మృతిచెందడంతో బాధ్యుణ్ణి అరెస్టుచేసి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు పోలీసు స్టేషన్ వద్ద విధ్వంసానికి పాల్పడ్డారు. నిందితుల్లో ఒకరుగా అభియోగాన్ని ఎదుర్కొంటున్న వారిలో బాధితురాలు ప్రియాడే భర్త ఉత్తమ్ డే కూడా ఒకరు. కేసు దర్యాప్తును ఎస్పీ సౌమ్య మిశ్రా స్వయంగా పర్యవేక్షించారు. ఉత్తమ్ డే ఆచూకీ చెప్పాలంటూ ఆమె తనను కొట్టారని, పొట్టమీద బూటు కాళ్లతో తన్నారని, అందువల్ల తనకు గర్భవిచ్ఛిత్తి జరిగిందని ఎస్పీని శిక్షించి తనకున్యాయం చేయాలని, ప్రియా డే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయమూర్తి ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## జేఎన్‌యూకు మోదీ పేరు పెట్టాలి

దేశ రాజధానిలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) పేరును ప్రధాని నరేంద్ర మోదీ విశ్వవిద్యాలయం (ఎంఎన్‌యూ)గా మార్చాలని వాయవ్య దిల్లీ ఎంపీ హన్స్ రాజ్ హన్స్ (భాజపా) సూచించారు. మోదీ పేరున ఏదో ఒక సంస్థ ఉండాలని అభిప్రాయపడ్డారు.

## భాజపాలోకి సంజయ్ సిన్హ్

లఖ్‌నవూ: కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కుటుంబానికి సన్నిహితుడిగా పేరుపొందిన సంజయ్ సిన్హ్, ఆయన భార్య అమితా సిన్హ్ ఆదివారం లాంఛనంగా భాజపా సభ్యత్వం తీసుకున్నారు. ఆయనకు అమేఠీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల్లో గట్టి పట్టు ఉంది.

## డ్రోన్లలో జీపీఎస్!

ఈనాడు, దిల్లీ: భారత్‌లో డ్రోన్ల కార్యకలాపాలను చట్టబద్ధం చేయడానికి ముందు భద్రతాపరంగా అనేక జాగ్రత్తలు తీసుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ భావిస్తోంది. వాటి గమనాన్ని పరిశీలించడానికి ఆ లోహ విహంగాల్లో జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చడాన్ని తప్పనిసరి చేయాలనుకుంటోంది. రిజిస్ట్రేషన్, లైసెన్సు కోసం విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) వద్దకు వచ్చినప్పుడు ఈ మేరకు వాటిని తనిఖీ చేయాలని భావిస్తున్నట్లు ఓ అధికారి చెప్పారు. దేశంలో దాదాపు 5.50 లక్షల డ్రోన్లు ఉండొచ్చని అంచనా.

# ఈనాడు బిజినెస్

# 37290 దగ్గర మద్దతు!




**సమీక్ష** : బలహీన దేశీయ సెంటిమెంట్, అంతర్జాతీయ వృద్ధి భయాలతో గత వారం మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, మూడు రోజులే మార్కెట్ పనిచేయడం ప్రభావం చూపింది. ఎఫ్‌పీఐలపై పన్ను సర్‌ఛార్జీ ప్రతిపాదనపై ఎటువంటి పునరాలోచన ప్రకటన వెలువడకపోవడం మదుపర్ల అప్రమత్తతకు కారణమైంది. జులైలో వాహన విక్రయాలు 19 ఏళ్ల కనిష్ఠానికి చేరినట్లు సియామ్ గణాంకాలు స్పష్టం చేశాయి. అనేక కంపెనీలు ఉత్పత్తికి తాత్కాలిక విరామం ఇవ్వడం, ఉద్యోగాల్లో కోత వంటివి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. అయితే ఏజీఎం తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించడం సూచీలకు కాస్త ఉపశమనం ఇచ్చింది. అమెరికా- చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, మాంద్యం భయాలతో అంతర్జాతీయ మార్కెట్లు కలవరపడ్డాయి. అయితే కేంద్ర బ్యాంకుల ఉద్దీపనలపై ఆశలు, చైనా ఉత్పత్తులపై సుంకాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జాప్యం చేయడం కొంత కలిసొచ్చింది. నిల్వలు పెరగడం, వృద్ధి భయాలతో చమురు ధరలు స్తబ్దుగా కదలాడాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.6 శాతం నష్టంతో 37,350 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 0.6 శాతం తగ్గి 11,048 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఐటీ, యంత్ర పరికరాలు, వాహన షేర్లు డీలాపడగా, చమురు- గ్యాస్, లోహ, స్థిరాస్తి స్క్రిప్‌లు రాణించాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.363 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.2880 కోట్లుగా నమోదయ్యాయి. ఎఫ్‌పీఐలు ఈ నెల 16 వరకు నికరంగా రూ.8,320 కోట్లు వెనక్కి మళ్లించారు.

**లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 9:10గా నమోదు కావడం.. మార్కెట్‌లో ఎక్కువ శాతం షేర్లు నష్టపోవడాన్ని సూచిస్తోంది.**

**ఈవారంపై అంచనా** } 36400- 37950 పాయింట్ల శ్రేణిలో స్థిరీకరణకు గురైన సెన్సెక్స్, గత వారం నష్టపోయింది. ఈ శ్రేణిని అధిగమిస్తేనే మార్కెట్‌కు సరైన దిశానిర్దేశం లభిస్తుంది. సెన్సెక్స్ 200 రోజుల కదలికల సగటు అయిన 37,290 స్థాయి స్వల్పకాలంలో కీలకం కానుంది. ఈ స్థాయి దిగువకు చేరితే మరిన్ని నష్టాలకు అవకాశం ఉంది.

**ప్రభావిత అంశాలు** } దేశీయ పరిణామాలు, అంతర్జాతీయ సంకేతాలు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. దేశీయంగా చూస్తే.. ఆర్థిక వ్యవస్థపై భయాలతో బలహీనతలు కొనసాగొచ్చు. మొదటి త్రైమాసికంలో కంపెనీ ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వాహన, ఆర్థిక రంగాలకు దన్నుగా ప్రభుత్వం ప్రకటించబోయే నిర్ణయాల కోసం మార్కెట్లు ఎదురుచూడొచ్చు. ఒకవేళ మార్కెట్లకు అనుకూలమైన నిర్ణయాలు రాకుంటే సెంటిమెంట్ దెబ్బతినే అవకాశం ఉంది. గతవారం ఒత్తిడి ఎదుర్కొన్న ముడిచమురు ధరల నుంచి మార్కెట్లకు మద్దతు దక్కొచ్చు. సరఫరా, గిరాకీ వార్తలకు అనుగుణంగా ముడిచమురు ధరలు కదలాడనున్నాయి. గతవారం రూపాయి భారీగా దిద్దుబాటుకు గురికావడంతో, డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. అంతర్జాతీయ పరిణామాల వల్ల స్వల్పకాలంలో రూపాయి ఒడుదొడుకులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఎఫ్ఐఐల పెట్టుబడుల ధోరణి సైతం కీలకం కానుంది. రుతుపవనాల పురోగతిపై ఓ కన్నేయొచ్చు. అమెరికా- చైనా వాణిజ్య పరిణామాలు అంతర్జాతీయ మార్కెట్లకు కీలకం కానుంది. పెద్ద దేశాల మాంద్యం భయాలు ఇందుకు తోడవ్వొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 36,888, 36,371, 35,714;
**తక్షణ నిరోధ స్థాయిలు:** 37,690, 37,950, 38,330

**స్వల్పకాలంలో సెన్సెక్స్‌కు 37,290 పాయింట్ల స్థాయి కీలకం కానుంది.**

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



## కోడిగుడ్లు

**18న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)**

(100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 339 | వరంగల్ | 342 |
| చిల్లరగా (ఒక గుడ్డు) | 4.00 | విశాఖపట్నం | 359 |
| బెంగళూరు | 350 | చెన్నై | 360 |
| 19వ తేదీకి... | | చిత్తూరు | 353 |
| విజయవాడ | 346 | నమక్కల్ | 360 |
| గోదావరి | 341 | | |

# మరింత అప్రమత్తంగా మదుపర్లు

- అంతర్జాతీయ వృద్ధి మందగమనమే కారణం
- ఫెడ్ ఛైర్మన్ వ్యాఖ్యలు కీలకం
- కేంద్రప్రభుత్వం ప్రకటించే కార్యాచరణపై దృష్టి
- విశ్లేషకుల అంచనాలు

**స్టాక్ మార్కెట్ ఈ వారం**

**అంతర్జాతీయ వృద్ధి మందగమనం కొనసాగుతూనే ఉండడం మదుపర్లను ఆందోళనకు గురి చేస్తోంది. అందువల్ల ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లు తక్కువ స్థాయిల్లో కదలాడొచ్చని విశ్లేషకులు అంటున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ ఈనెల 23న కేంద్ర బ్యాంకు వార్షిక సదస్సునుద్దేశించి చేసే ప్రసంగం కీలకం కానుంది. ఆర్థిక మందగమనానికి చేరువలో అమెరికా ఉందన్న ఆందోళన కారణంగా సెప్టెంబరు మధ్యలో జరిగే సమావేశంలో అమెరికా ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించవచ్చన్న అంచనాలున్నాయి. దేశీయంగానూ స్టాక్ మార్కెట్లకు సానుకూల వార్తలు కనిపించడం లేదు. నిఫ్టీ ఈ వారం 10725-11200 మధ్య చలించొచ్చని డీలర్లు చెబుతున్నారు. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఏవైనా చర్యలు చేపడుతుందోమోనన్న ఆసక్తి అధికమవుతోంది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..**

- ప్రభుత్వ రంగ **చమురు** కంపెనీల షేర్లు అంతర్లీనంగా ప్రతికూల ధోరణితో ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలతో పోలిస్తే ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు బలహీనంగా కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, డాలరు-రూపాయి మారకపు విలువల నుంచి నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు.
- ఒక వేళ డాలరుతో పోలిస్తే రూపాయి బలోపేతం అయితే **ఐటీ** షేర్లు బలహీనతలు కొనసాగించొచ్చు. మొత్తం మీద ఎటువంటి వార్తలూ లేకపోవడం వల్ల ఐటీ షేర్ల కదలికలు స్తబ్దుగా కనిపించొచ్చు.
- అమెరికా-చైనాల మధ్య సానుకూల చర్చలు జరగొచ్చన్న అంచనాల నేపథ్యంలో **గనులు, లోహ** కంపెనీల షేర్లు మార్కెట్‌తో పోలిస్తే రాణించొచ్చు.
- ఫలితాల అనంతరం ఎటువంటి వార్తలూ లేనందున, **బ్యాంకు** షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి కదలాడొచ్చు. అంతర్జాతీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మదుపర్లు జాగ్రత్తగా ట్రేడింగ్ చేయనున్నారు. బ్యాంకు నిఫ్టీ ఈ వారం 27800-28500 శ్రేణిలో కదలాడొచ్చు.
- వచ్చే కొద్ది నెలల్లో ఆర్డర్ల రాక స్తబ్దుగా ఉంటుందన్న అంచనాల మధ్య **యంత్ర పరికరాల** షేర్లు నష్టపోయే అవకాశం ఉంది. 18 నెలల తర్వాత కానీ ప్రైవేటు రంగ పెట్టుబడులు పుంజుకోవని ఎల్ అండ్ టీ అంచనా వేయడం ఇందుకు కారణం కావొచ్చు.
- దేశీయ సూచీల్లో బలహీనత కొనసాగొచ్చన్న అంచనాల వల్ల **వాహన** షేర్లు నష్టపోవచ్చు. వాహన పరిశ్రమలో విక్రయాలు పుంజుకోడానికి ప్రభుత్వం ఏవైనా చర్యలు చేపడుతుందా అన్న అంశంపై మదుపర్లు దృష్టి సారించనున్నారు.
- **టెలికాం** షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌పై మదుపర్లు దృష్టి సారించొచ్చు. వచ్చే 18 నెలల్లో నికర రుణాలను సున్నా స్థాయికి తీసుకురానున్నట్లు ప్రకటించడంతో గత వారం ఆ కంపెనీ షేరు 10% వరకు పెరిగింది. ఆ లాభాలు ఈ వారమూ కొనసాగొచ్చు. జియో ఫైబర్ సేవల ప్రకటన కూడా కలిసిరావొచ్చు.
- ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా చేయడం కోసం ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటుందన్న అంచనాల మధ్య ఈ వారం **ఎఫ్ఎంసీజీ** షేర్లు లాభాలు అందుకోవచ్చు.
- వచ్చే కొద్ది త్రైమాసికాల్లో ఆదాయాల వృద్ధిపై ఆందోళన కారణంగా **ఫార్మా** కంపెనీల షేర్లు బలహీనంగా ట్రేడవవచ్చు. అదే సమయంలో యూఎస్ఎఫ్‌డీఏ నుంచి కఠిన నియంత్రణ చర్యలపై అనిశ్చితి కూడా ఇందుకు తోడవవచ్చు.

| వాహన | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| అశోక్ లేలాండ్ | 63.65 | 66.30 | 60.10 |
| బజాజ్ ఆటో | 2750.95 | 2822.80 | 2625.50 |
| హీరో మోటోకార్ప్ | 2669.00 | 2765.00 | 2499.10 |
| ఎం అండ్ ఎం | 527.85 | 541.50 | 508.80 |
| మారుతీ సుజుకీ | 5975.05 | 6258.40 | 5448.40 |
| టాటా మోటార్స్ | 121.35 | 125.50 | 115.30 |
| టీవీఎస్ మోటార్ | 376.80 | 390.60 | 354.60 |

| టెలికాం | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| భారతీ ఎయిర్‌టెల్ | 361.55 | 370.50 | 350.50 |
| ఎమ్‌టీఎన్ఎల్ | 6.35 | 6.90 | 5.80 |
| ఆర్‌కామ్ | 1.20 | 1.30 | 1.10 |
| ఆర్ఐఎల్ | 1278.00 | 1299.70 | 1262.10 |
| టాటా కమ్యూనికేషన్స్ | 441.90 | 456.00 | 432.00 |
| వొడాఫోన్ ఐడియా | 6.45 | 7.70 | 4.80 |

| ఎఫ్ఎంసీజీ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| బ్రిటానియా ఇండస్ట్రీస్ | 2499.45 | 2545.20 | 2419.20 |
| డాబర్ ఇండియా | 428.05 | 433.40 | 424.40 |
| గోద్రేజ్ కన్జూమర్ | 622.85 | 650.00 | 598.80 |
| హిందుస్థాన్ యునిలీవర్ | 1828.65 | 1862.30 | 1799.30 |
| ఐటీసీ | 253.00 | 257.30 | 245.30 |
| టాటా గ్లోబల్ బేవరేజెస్ | 266.85 | 272.40 | 261.00 |

| ఫార్మా | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| అరబిందో ఫార్మా | 602.30 | 619.90 | 586.40 |
| బయోకాన్ | 228.00 | 235.30 | 220.40 |
| సిప్లా | 476.10 | 486.90 | 469.10 |
| డాక్టర్ రెడ్డీస్ | 2492.55 | 2559.50 | 2431.50 |
| లుపిన్ | 729.30 | 741.10 | 716.40 |
| ఫైజర్ | 3002.65 | 3072.80 | 2897.00 |

| చమురు | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| బీపీసీఎల్ | 351.20 | 360.70 | 341.60 |
| హెచ్‌పీసీఎల్ | 245.50 | 254.60 | 237.10 |
| ఐఓసీఎల్ | 126.25 | 128.50 | 124.20 |
| ఓఎన్‌జీసీ | 127.90 | 130.50 | 125.10 |
| ఆయిల్ ఇండియా | 152.70 | 157.90 | 145.50 |

| ఐటీ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ | 1062.75 | 1089.80 | 1037.00 |
| ఇన్ఫోసిస్ | 774.55 | 789.90 | 754.80 |
| మైండ్ ట్రీ | 699.80 | 718.80 | 675.80 |
| పర్సిస్టెంట్‌సిస్టమ్స్ | 510.95 | 529.70 | 493.70 |
| టీసీఎస్ | 2165.10 | 2281.40 | 2085.10 |
| టెక్ మహీంద్రా | 659.00 | 670.20 | 640.50 |
| విప్రో | 249.20 | 254.40 | 242.50 |

| లోహ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| హిందాల్కో | 179.80 | 186.10 | 170.50 |
| హిందుస్థాన్ జింక్ | 206.85 | 213.50 | 196.00 |
| జిందాల్ స్టీల్ | 103.80 | 109.90 | 96.90 |
| జేఎస్‌డబ్ల్యూ స్టీల్ | 227.15 | 233.30 | 218.60 |
| ఎన్ఎండీసీ | 102.85 | 106.20 | 100.00 |
| సెయిల్ | 36.20 | 37.20 | 35.50 |
| టాటా స్టీల్ | 363.05 | 373.30 | 350.40 |
| వేదాంతా | 144.40 | 148.40 | 138.90 |

| బ్యాంకింగ్ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 2227.70 | 2250.50 | 2192.70 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 418.95 | 424.90 | 409.10 |
| ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ | 45.75 | 47.70 | 42.60 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 1439.10 | 1489.70 | 1349.70 |
| కోటక్ బ్యాంక్ | 1498.95 | 1523.30 | 1465.30 |
| పీఎన్‌బీ | 68.10 | 70.70 | 63.70 |
| ఎస్‌బీఐ | 290.90 | 297.80 | 280.80 |

| యంత్రపరికరాలు | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| భెల్ | 51.35 | 52.70 | 49.60 |
| సీజీ పవర్ | 18.00 | 18.70 | 16.90 |
| ఎల్ అండ్ టీ | 1335.25 | 1351.30 | 1312.50 |
| సీమెన్స్ | 1160.10 | 1192.70 | 1124.20 |
| థెర్మాక్స్ | 1057.45 | 1098.80 | 1028.10 |

## అపోలో ఆసుపత్రుల్లో విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లు

దిల్లీ: దేశంలోని అన్ని అపోలో ఆసుపత్రుల్లో ప్రజా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు ప్రభుత్వ రంగ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ (ఈఈఎస్ఎల్) వెల్లడించింది. ఈ ఒప్పందం పదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 'దేశంలో ప్రజా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ఓ ప్రైవేటు భాగస్వామితో ఇలా ఎంఓయూ కుదుర్చుకోవడం ఇదే తొలిసారని ఈఈఎస్ఎల్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ఒప్పందం ప్రకారం, విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మానవ వనరులను ఈఈఎస్ఎల్ సమకూరుస్తుంది. ఛార్జింగ్ స్టేషన్లకు అవసరమైన స్థలం ఇవ్వడంతో పాటు విద్యుత్తు కనెక్షన్లను అపోలో హాస్పిటల్స్ సమకూర్చనుంది. 'విద్యుత్ వాహనాలపై వినియోగదారుల్లో విశ్వాసం పెంపొందించేందుకు మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామ'ని ఈఈఎస్ఎల్ వెల్లడించింది.

# ఉద్దీపన కావాల్సిందే

- ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్‌కుమార్
- దేశవ్యాప్తంగా బ్యాంకర్ల సమాలోచనలు

కోల్‌కతా: దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చేందుకు అవసరమైన సమాలోచనలు చేయడం, రుణ వృద్ధికి ఉన్న రంగాలను, అవకాశాలపై శాఖల వారీ వివరాలు సేకరించడం లక్ష్యంగా ప్రభుత్వ బ్యాంకులన్నీ శని, ఆదివారాల్లో మేనేజర్ల సమావేశాలు నిర్వహించాయి. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, సిండికేట్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ తదితర ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ దేశవ్యాప్తంగా ఈ సమావేశాలు నిర్వహించాయి.

రుణాలకు గిరాకీ మందగించిన నేపథ్యంలో, ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపన చర్యలు అవసరమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ రజనీశ్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ తగినంత మూలధనంతో సిద్ధంగా ఉన్నాయని, సరఫరా వైపు ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన వెల్లడించారు. ఇక్కడ జరిగిన బ్యాంకర్ల కార్యక్రమంలో రజనీశ్ మాట్లాడుతూ రుతుపవనాలు ఈ ఏడాది ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రుణ వృద్ధి (క్రెడిట్ గ్రోత్) 12-14 శాతం మధ్య ఉండే అవకాశం ఉందని రజనీశ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రుణ వృద్ధి 14 శాతం నమోదైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తమ బ్యాంకు రుణ పోర్ట్‌ఫోలియో రూ.23 లక్షల కోట్లు ఉందని వెల్లడించారు.



### ఖాతాదారులకు చేరువవుతాం: ఎస్‌బీఐ సీజీఎం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఖాతాదారులకు మరింత చేరువయ్యేందుకు, సేవలను విస్తృతం చేసేందుకు కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తున్నట్లు ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాశ్ మిశ్రా తెలిపారు. హైదరాబాద్ సర్కిల్ 750 ఎస్‌బీఐ బ్యాంకు శాఖల మేనేజర్లు, రీజినల్ మేనేజర్లు సహా వివిధ స్థాయిల ఉన్నతాధికారుల మేధోమథనం పూర్తయిందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో బ్యాంకు సేవలను సులభతరం చేస్తామన్నారు.

## రూ.2500 కోట్లు రికవరీ చేస్తాం

### బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈడీ



ఈనాడు, హైదరాబాద్: జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద ఉన్న కేసుల పరిష్కారం ద్వారా డిసెంబరులోపు రూ.1500 కోట్లు రికవరీ చేయగలమని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.జి.చైతన్య తెలిపారు. మిగిలిన కేసుల నుంచి మరో రూ.500 కోట్లు వసూలు చేయగలమని పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ వద్ద ఉన్న 8-10 పెద్ద ఖాతాల నుంచి వసూలయ్యే మొత్తం సహా 3 త్రైమాసికాల్లో రూ.2500 కోట్లు రికవరీ చేయలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడ బ్యాంక్ శాఖల మేనేజర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ వివరాలు తెలిపారు. డిజిటల్ చెల్లింపుల పెంపుతో పాటు వ్యవసాయం, రిటైల్, పర్యాటకం, జౌళి రంగాలతో పాటు ఎగుమతిదార్లకు ఎంతమేర రుణాలు పెంచవచ్చనే వివరాలు సేకరించినట్లు వివరించారు.

# వెండి దిద్దుబాటు!

**కమొడిటీస్ ఈ వారం**

**● బంగారం, వెండి**



పసిడి అక్టోబరు ఫ్యూచర్ కాంట్రాక్టు గత సోమవారం రూ.38,257 వద్ద ప్రారంభమైంది. అమెరికా- చైనా వాణిజ్య యుద్ధ పరిణామాలు, హాంకాంగ్‌లో రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో మంగళవారం పసిడి కాంట్రాక్టు రాణించి రూ.38,666 స్థాయిని చేరింది. అయితే చైనా దిగుమతులపై టారిఫ్‌ల విధింపు ఆలస్యం కావొచ్చంటూ అమెరికా చేసిన ప్రకటనతో అదే రోజు గణనీయ స్థాయిలో పడిపోయింది. రూ.37,344 వద్ద వారం కనిష్ఠాన్ని చేరింది. వారం మొత్తం మీద 0.68 శాతానికి నష్టాన్ని పరిమితం చేసుకుని రూ.37,995 వద్ద కాంట్రాక్టు ముగిసింది. ఈవారం పసిడి కాంట్రాక్టుకు రూ.38,952 వద్ద గట్టి నిరోధం కనిపిస్తోంది. ఈ స్థాయిని అధిగమించకుంటే కొంత దిద్దుబాటుకు ఆస్కారం ఉంటుంది. సాంకేతికంగా కూడా పసిడి కాంట్రాక్టు మరి కొంత కిందకు దిగివచ్చేందుకు అవకాశం కనిపిస్తోంది. అయినా, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు పసిడి కాంట్రాక్టు సానుకూలతను తెచ్చిపెట్టొచ్చన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని స్టాప్‌లాస్‌తో, ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లొచ్చు. గతవారం రూ.43,411 వద్ద ఆరంభమైన వెండి సెప్టెంబరు కాంట్రాక్టు.. ఆ తర్వాత కొనుగోళ్ల దన్నుతో రూ.44,584 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. పసిడి కాంట్రాక్టు మాదిరే అమెరికా- చైనా వాణిజ్య యుద్ధ పరిణామాలు వెండి కాంట్రాక్టు రాణించేందుకు తోడ్పడ్డాయి. అనంతరం దిద్దుబాటు కారణంగా కాంట్రాక్టు రూ.42,042 స్థాయికి దిగివచ్చింది. అయితే తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లు వెల్లువెత్తడంతో కాంట్రాక్టు గణనీయంగా పుంజుకుంది. చివరకు 0.95% లాభంతో రూ.43,824 వద్ద కాంట్రాక్టు స్థిరపడింది. సాంకేతికంగా ఈవారం కాంట్రాక్టు కిందకు దిగివచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే మోతాదుకు మించి పెరిగి ఉండటమూ ఇందుకు మరో కారణం. అలాగే ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు పుంజుకున్నా కూడా వెండి కాంట్రాక్టుపై ప్రతికూల ప్రభావం పడుతుందనే విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. వీటన్నింటి దృష్ట్యా రూ.44,777 ఎగువన కాంట్రాక్టును షార్ట్‌సెల్ చేయడం ఉత్తమం.

**● ప్రాథమిక లోహాలు**



రాగి ఆగస్టు కాంట్రాక్టు ఈ రోజు రూ.448 కంటే పైన ముగిస్తే కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. రూ.450.25 లక్ష్యంతో లాంగ్‌పొజిషన్లు తీసుకోవచ్చు. ఒకవేళ నేడు కాంట్రాక్టు నష్టాల్లో కదలాడి రూ.444 దిగువన ముగిస్తే, రూ.447.15 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, రూ.442 లక్ష్యానికి షార్ట్‌సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. సీసం ఆగస్టు కాంట్రాక్టు గత నెల రోజులుగా రూ.148-159.80 శ్రేణిలో చలిస్తోంది. ఈవారం కూడా ఇదే శ్రేణికి పరిమితమయ్యే అవకాశం ఉంది. సాంకేతికంగా చూస్తే కాంట్రాక్టుకు కొంత అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చు. రూ.158.85 ఎగువన ట్రేడ్ కాకుంటే.. రూ.152.65; రూ.150.35 వరకు కాంట్రాక్టు దిగివచ్చే అవకాశం ఉంది. జింక్ ఆగస్టు కాంట్రాక్టును ఈవారం రూ.177.25- 178.65 మధ్య కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు ఈవారం సానుకూలంగా కదలాడేందుకు అవకాశం ఉంది. ఈవారం రూ.142 కంటే పైన ముగిస్తే రూ.142.85; రూ.144 స్థాయి వరకు వెళ్లేందుకు అవకాశం ఉంది. ఒకవేళ ఈ రోజు రూ.139.75 దిగువన ముగిస్తే, స్వల్పకాలంలో మరింత కిందకు వస్తుందని భావించవచ్చు.

**● ఇంధన రంగం**



ముడిచమురు సెప్టెంబరు కాంట్రాక్టుకు ఈవారం రూ.4,048 వద్ద నిరోధం కనిపిస్తోంది. ఈ స్థాయిని అధిగమిస్తే కనుక గణనీయ స్థాయిలో పెరిగేందుకు అవకాశం ఉంది. ఒకవేళ ఈ స్థాయిని అధిగించకుంటే గతవారం కనిష్ఠ స్థాయిని మరోమారు తాకొచ్చు. అయితే రూ.3,660 దిగువకు రానంత వరకు కొనుగోళ్లకు మొగ్గు చూపడం మంచి వ్యూహమే అవుతుంది. సాంకేతికంగా సహజవాయువు ఆగస్టు కాంట్రాక్టుకు ఈవారం రూ.164.15 వరకు లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) ఆగస్టు కాంట్రాక్టుకు సమీప కాల నిరోధమైన రూ.555.15 స్థాయిపై ట్రేడర్లు ఓ కన్నేసి ఉంచాలి. ఎందుకుంటే ఈ స్థాయి వద్ద కొంత షార్ట్ కవరింగ్ చోటు చేసుకోవచ్చు. అందువల్ల గత వారం పొజిషన్లు కొనసాగిస్తుంటే ఈ స్థాయి వద్ద బయటపడటం ఉత్తమం.

## గతవారం పొజిషన్లు ఇలా

| కమొడిటీ | ప్రారంభం | ముగింపు | వృద్ధి/(క్షీణత) |
|---|---|---|---|
| | (రూ.లలో) | | (శాతంలో) |
| రాగి (ఆగస్టు) | 446 | 446 | 0 |
| సీసం (ఆగస్టు) | 156.50 | 153.25 | (2.08) |
| జింక్ (ఆగస్టు) | 183.60 | 183.80 | 0.11 |
| అల్యూమినియం (ఆగస్టు) | 141.15 | 140.70 | (0.32) |
| నికెల్ (ఆగస్టు) | 1033 | 1,138.60 | 2.75 |
| ముడి చమురు (సెప్టెం) | 3,875 | 3,910 | 0.90 |
| సహజ వాయువు (ఆగస్టు) | 151.70 | 156.30 | 3.44 |
| సీపీఓ (ఆగస్టు) | 548 | 548.20 | 0.04 |
| గోరు చిక్కుడు (సెప్టెం) | 4,408 | 4,432 | 0.64 |
| సోయాబీన్ (సెప్టెం) | 3,672 | 3,638 | (0.93) |
| జీలకర్ర(సెప్టెం) | 17,340 | 16,860 | (2.77) |

**● వ్యవసాయ ఉత్పత్తులు**



గోరుచిక్కుడు అక్టోబరు కాంట్రాక్టు గత కొన్ని వారాలుగా రూ.4,215- రూ.4,523 శ్రేణిలో చలిస్తోంది. ఈవారం కూడా ఈ శ్రేణికి పరిమితం కావచ్చు. సోయాబీన్ సెప్టెంబరు కాంట్రాక్టుకు సమీపకాలంలో రూ.3,697 వద్ద నిరోధం కనిపిస్తోంది. ఈ స్థాయిని అధిగమిస్తే రాణించేందుకు ఆస్కారం ఉంటుంది. గతవారం సానుకూల ధోరణి కొనసాగేందుకూ అవకాశం ఉంది. అందువల్ల లాంగ్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు. జీలకర్ర సెప్టెంబరు కాంట్రాక్టుకు కొంత అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చు. అయితే రూ.16,643 దిగువకు రాకుంటే కొనుగోళ్ల మద్దతు కూడా లభించొచ్చు. అందువల్ల ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకుని ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

## వాహన డీలర్లకు 75-90 రోజుల గడువు: ఎస్‌బీఐ

దిల్లీ: కంపెనీల నుంచి డీలర్లు వాహనాలు కొనుగోలు చేసినప్పుడు, బ్యాంకులు రుణాలిస్తుంటాయి. వీటిని 60 రోజుల్లోపు డీలర్లు చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల విక్రయాలు నెమ్మదించడం వల్ల, డీలర్లకు నగదు చెలామణి కష్టంగా ఉంటోంది. అందువల్ల రుణ చెల్లింపు గడువును 75-90 రోజుల వరకు పెంచుతున్నట్లు ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) గుప్తా ప్రకటించారు. కేసును బట్టి ఈ గడువు ఇస్తామని తెలిపారు. కార్లు కొనుగోలు చేసేవారికి తక్కువ వడ్డీకే రుణాలు అందివ్వాలన్నది మా లక్ష్యం, ఇదే సమయంలో తయారీదార్ల వద్ద నుంచి వాహనాలు తీసుకునేందుకు డీలర్లనూ ఆదుకుంటామని పేర్కొన్నారు. తమ బ్యాంక్ నుంచి వాహన రుణాలు ఇటీవల కాస్త తగ్గాయని వివరించారు.

## హ్యుందాయ్ వాహన ఉత్పత్తిలో కోత

చెన్నై: హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్) కూడా ఉత్పత్తిలో కోత విధించేందుకు సిద్ధమైంది. వాహన విపణిలో మెరుగైన పరిస్థితులు లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ నెల 31 వరకు కొన్ని రోజుల పాటు వివిధ సెక్షన్లలో ఉత్పత్తి నిలిపేస్తున్నట్లు హ్యుందాయ్ ప్రకటించింది. ఇదిలా ఉంటే, ఏప్రిల్ నుంచి 1500 మంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించినట్లు ఎం అండ్ ఎం ఎండీ పవన్ గోయెంకా తెలిపారు.

## దివాలా స్మృతి కింద చిన్న రుణగ్రహీతల అప్పులు రద్దు?

దిల్లీ: దివాలా స్మృతి కింద చిన్న రుణగ్రహీతల అప్పులను రద్దు చేసే ప్రతిపాదనపై ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. దివాలా పరిష్కార చట్టం కింద ఉన్న 'ఫ్రెష్ స్టార్ట్' నిబంధనలకు లోబడి ఈ రుణాల రద్దు ఉండే అవకాశం ఉంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన చిన్న రుణగ్రహీతల అప్పులను రద్దు చేయడానికి సూక్ష్మరుణ పరిశ్రమతో చర్చలు జరుపుతున్నట్లు శ్రీనివాస్ వెల్లడించారు. ఒకసారి ఫ్రెష్‌స్టార్ట్ సౌలభ్యాన్ని వాడుకుంటే.. మళ్లీ అయిదేళ్ల వరకు అవకాశం ఉండదని వివరించారు. జాతీయ స్థాయిలో 3-4 ఏళ్ల వ్యవధిలో ఇవి రూ.10,000 కోట్లకు మించి ఉండవని అన్నారు. దివాలా చట్టం కింద ఫ్రెష్ స్టార్ట్ అందుకోవాలంటే, రుణగ్రహీత రూ.60000 కంటే తక్కువ స్థూల వార్షిక ఆదాయం, రూ.20,000 లోపు ఆస్తులు కలిగి ఉండాలి.

# చాంపియన్

# హిమ సిక్సర్

## వరుసగా ఆరో స్వర్ణం



దిల్లీ: ఐరోపా అథ్లెటిక్స్ పోటీల్లో భారత స్టార్ స్ప్రింటర్ హిమదాస్ మళ్లీ మెరిసింది. ఆమె వరుసగా ఆరో స్వర్ణం కైవసం చేసుకుంది. చెక్ రిపబ్లిక్‌లో జరిగిన అథ్లెటిక్ మిటింక్ రీటర్ ఈవెంట్లో 300 మీటర్ల పరుగులో హిమ పసిడి గెలుచుకుంది. జూన్ 2న ప్రారంభమైన హిమ జోరు కొనసాగుతూనే ఉంది. 200 మీటర్ల విభాగంలో నాలుగు పసిడి పతకాలు గెలిచిన ఆమె.. 400 మీ పరుగులో ఒక స్వర్ణం, 300 పరుగులో మరో పసిడి గెలిచింది. ఇదే క్రమంలో 400 మీ పరుగులో సీజన్ ఉత్తమ టైమింగ్ (52.09 సె) కూడా నమోదు చేసింది. జూన్‌లో పోలెండ్ మీట్‌లో 200 మీ పరుగులో స్వర్ణంతో ప్రారంభమైన ఆమె పరుగు విజయవంతంగా కొనసాగింది. కేవలం 18 రోజుల వ్యవధిలో ఐదు స్వర్ణాలు గెలిచిన హిమ సంచలనం సృష్టించింది. తాజాగా మరో పసిడి గెలిచిన ఆమె స్వర్ణాల సిక్సర్ కొట్టింది. మరోవైపు మిటింక్ టోర్నీ పురుషుల 300 మీ పరుగులో మహ్మద్ అనాస్ పసిడి పతకం గెలుచుకున్నాడు. అతను 32.41 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. అనాస్ 400 మీ పరుగులో ఇప్పటికే సెప్టెంబర్‌లో దోహాలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. ఈ విభాగంలో జాతీయ రికార్డు అతని ఖాతాలో ఉంది.

# ఉత్కంఠ రేపినా.. డ్రానే

## ఫలితం తేలని యాషెస్ రెండో టెస్టు



ఆర్చర్ 3/23

ఆర్చర్ బంతి లబుషేన్ పైకి ఇలా..

లార్డ్స్

ఆసక్తి రేపిన యాషెస్ రెండో టెస్టులో ఫలితం రాలేదు. ఒక దశలో ఫలితంపై ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. చివరికి మ్యాచ్ డ్రాగానే ముగిసింది. 48 ఓవర్లలో 267 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా.. ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. జోఫ్రా ఆర్చర్ (3/23), జాక్ లీచ్ (3/37)ల ధాటికి ఆస్ట్రేలియా విలవిలలాడింది. ముఖ్యంగా ఆర్చర్ నిప్పులు చెరిగే బంతులతో కంగారూ బ్యాట్స్‌మెన్‌ను కంగారెత్తించేశాడు. నాలుగో రోజు బౌన్సర్‌తో స్మిత్‌ను గాయపరిచిన ఆర్చర్.. చివరి రోజూ ఆసీస్ బ్యాట్స్‌మెన్ శరీరాల్నే లక్ష్యంగా చేసుకున్నాడు. అతడి బంతులు ఇద్దరు ముగ్గురిని గాయపరిచాయి. వార్నర్ (5), ఖవాజా (2), బాన్‌క్రాఫ్ట్ (16) పెవిలియన్‌కు వరుస కట్టడంతో ఆస్ట్రేలియా 14 ఓవర్లకు 47/3తో నిలిచింది. దీంతో మిగిలిన 34 ఓవర్లలో ఆస్ట్రేలియాను ఇంగ్లిష్ బౌలర్లు ఆలౌట్ చేసేస్తారేమో అనిపించింది. అయితే స్మిత్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన లబుషేన్ (59) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడికి హెడ్ (42 నాటౌట్) సహకరించడంతో ఆసీస్ కోలుకుంది. కానీ లబుషేన్, వేడ్ (1)లను స్వల్ప వ్యవధిలో ఔట్ చేసిన లీచ్.. మళ్లీ ఇంగ్లాండ్‌కు ఆశలు కల్పించాడు.

అయితే హెడ్ పట్టుదల ప్రదర్శించడంతో ఆసీస్ బయటపడింది. డైన్ (4) క్యాచ్‌ను డెన్లీ డైవ్ చేస్తూ ఒంటిచేత్తో అందుకోవడం చివరి రోజు ఆటలో హైలైట్. అంతకుముందు 96/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 258/5 వద్ద డిక్లేర్ చేసింది. స్టోక్స్ (115 నాటౌట్; 165 బంతుల్లో 11×4, 3×6) అద్భుత శతకంతో అలరించాడు. బట్లర్ (31), బెయిర్‌స్టో (30 నాటౌట్)లతో అతను కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. మ్యాచ్‌లో వర్షం వల్ల దాదాపు రెండు రోజుల ఆట రద్దయింది. లేకుంటే కచ్చితంగా ఫలితం వచ్చేది. తొలి టెస్టులో ఆస్ట్రేలియా విజయం సాధించిన సంగతి తెలిసిందే. మూడో టెస్టు లీడ్స్‌లో శుక్రవారం ఆరంభమవుతుంది.

## స్మిత్ సబ్‌స్టిట్యూట్‌గా లబుషేన్





ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మార్నస్ లబుషేన్ టెస్టు క్రికెట్ తొలి కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా నిలిచాడు. స్మిత్ గాయంతో దూరం కావడంతో రెండో టెస్టు చివరి రోజు పూర్తిగా స్థాయి ఆటగాడిగా కొనసాగాడు. సాధారణంగా సబ్‌స్టిట్యూట్ ఫీల్డింగ్ చేయడానికే అర్హుడు. అయితే ఐసీసీ కొత్త సబ్‌స్టిట్యూట్ నిబంధన ప్రకారం ఏ ఆటగాడైనా కంకషన్‌తో మ్యాచ్‌కు దూరమైతే.. అతడి స్థానంలో వచ్చే సబ్‌స్టిట్యూట్ తుది ఎలెవన్‌లో సభ్యుడు కిందే లెక్క. గాయపడ్డ ఆటగాడి విధులను నిర్వర్తించవచ్చు. ఉదాహరణకు ఓ బ్యాట్స్‌మన్ గాయంతో దూరమైతే.. అతడి సబ్‌స్టిట్యూట్ బ్యాటింగ్ చేయవచ్చు. బౌలర్ స్థానంలో వచ్చే సబ్‌స్టిట్యూట్ బౌలింగ్ చేయవచ్చు. ఈ నిబంధన కంకషన్‌కు మాత్రమే వర్తిస్తుంది. ఇతర గాయాలైతే సబ్‌స్టిట్యూట్ ఫీల్డింగ్‌కే పరిమితం కావాలి. కంకషన్‌తో దూరమైన ఆటగాడు ఆ మ్యాచ్‌లో మళ్లీ మైదానంలోకి దిగడానికి వీల్లేదు. రెండో టెస్టు నాలుగో రోజు ఆర్చర్ బౌన్సర్ మెడకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డ ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ మూడో టెస్టులో ఆడడం అనుమానమే. శనివారం రిటైర్డ్‌హర్ట్ అయ్యాక పరీక్షల్లో అంతా బాగానే ఉందని తేలడంతో తిరిగి బ్యాటింగ్‌కు దిగాడు. 92 వద్ద ఔటైన అతడు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ సందర్భంగా ఫీల్డింగ్‌కు రాలేదు. ఆదివారం ఉదయం నిర్వహించిన కంకషన్ పరీక్షల్లో అతడి పరిస్థితి కాస్త క్షీణించినట్లు తేలింది. దీంతో అతడు ఐదో రోజు మ్యాచ్‌కు దూరమయ్యాడు.

## టైటాన్స్‌ను గెలిపించిన దేశాయ్

చెన్నై: ప్రో కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ రెండో విజయాన్ని సాధించింది. సిద్ధార్థ్ దేశాయ్ రాణించడంతో ఆదివారం జరిగిన పోరులో టైటాన్స్ 40-29తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. ఈ మ్యాచ్ ఆరంభం నుంచి విజృంభించిన దేశాయ్ 18 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. సిద్ధార్థ్‌తో పాటు అతని సోదరుడు సూరజ్ (6) కూడా రాణించాడు. వికాశ్ ఖండోలా (9) రాణించినా.. టైటాన్స్ జోరును మాత్రం ఆపలేకపోయాడు. తొలి అర్ధభాగంలో 21-13తో ఆధిక్యంలో నిలిచిన టైటాన్స్.. ద్వితీయార్ధంలోనూ అదే ఊపు ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో రెండోసారి హరియాణాను ఆలౌట్ చేసిన టైటాన్స్ విజయం ఖాయం చేసుకుంది. పుణెరి పల్టాన్, తమిళ్ తలైవాస్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 31-31తో టైగా ముగిసింది. తలైవాస్ జట్టులో అజిత్‌కుమార్ (8), రాన్‌సింగ్ (4), పుణెరి జట్టులో పంకజ్ మోహితె (7), సుర్జీత్‌సింగ్ (7) సత్తా చాటారు.



**నేటి మ్యాచ్‌లు**

ముంబా × హరియాణా (రా.7.30 నుంచి)

యూపీ × జైపూర్ (రా.8.30 నుంచి)

## పురుషులకు ఓటమి.. అమ్మాయిలకు డ్రా

టోక్యో: ఒలింపిక్స్ హాకీ టెస్టు ఈవెంట్లో భారత పురుషుల జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 1-2 గోల్స్‌తో న్యూజిలాండ్ చేతిలో పరాజయం చవిచూసింది. రెండో నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీకార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే 47వ నిమిషంలో జాకబ్ స్మిత్ (న్యూజిలాండ్) గోల్ చేసి స్కోరు సమం చేశాడు. ఆధిక్యం సాధించేందుకు భారత్ ఆఖరిదాకా పోరాడినా ఆట ఆఖర్లో సామ్ లేన్ (60వ ని) గోల్ కొట్టి న్యూజిలాండ్‌కు విజయాన్ని అందించాడు. మరోవైపు మహిళల జట్టు 2-2తో ఆస్ట్రేలియాను నిలువరించింది. భారత్ తరఫున వందన కటారియా (36వ ని), గుర్జిత్ కౌర్ (59వ ని) గోల్స్ చేయగా.. ఆస్ట్రేలియా తరఫున కాటలిన్ (14వ ని), స్టీవార్ట్ (43వ ని) గోల్స్ కొట్టారు.

# పసిడి ముచ్చట తీరేనా..!

**నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్**

మధ్యాహ్నం 12.15 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



**బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్.. బ్యాడ్మింటన్‌లో అత్యున్నత టోర్నీ. ఇందులో పతకం సాధించడం ప్రతి షట్లర్ కల. భారత్ తరఫున ఎప్పుడో 1983లో ప్రకాశ్ పదుకొనే ఓ పతకం గెలిచాక.. మళ్లీ ఆ ఆశ తీరేందుకు 27 ఏళ్లు పట్టింది. జ్వాల-అశ్విని జోడీ కరవు తీర్చేస్తూ కాంస్యం గెలిస్తే.. మన బ్యాడ్మింటన్ తారాజువ్వలు పి.వి. సింధు, సైనా నెహ్వాల్ కలిసి అయిదేళ్ల వ్యవధిలో ఏకంగా అరడజను పతకాలు సాధించి పెట్టారు. బ్యాడ్మింటన్ అభిమానుల్ని ఆనందంలో ముంచెత్తారు. కానీ ఇన్ని పతకాలు సాధించినా.. అందులో పసిడి లేకపోవడం మాత్రం వెలితే. ఈసారైనా దాన్ని అందుకోవాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతోన్నారు భారత షట్లర్లు. మరి పసిడి కల నెరవేరుతుందా!**

బాసెల్ (స్విట్జర్లాండ్)

బ్యాడ్మింటన్ ప్రియుల్ని ఉర్రూతలూగించడానికి ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిద్ధమైంది. సోమవారమే టోర్నీకి శ్రీకారం. ప్రపంచ బ్యాడ్మింటన్ స్టార్లందరూ పతాక స్థాయి ఆటతో పతకం కోసం తలపడే టోర్నీ ఇది. భారత్ నుంచి ప్రధాన క్రీడాకారులందరూ ఈసారి టోర్నీ బరిలో ఉన్నారు. ముఖ్యంగా అందరి కళ్లూ సింధు, సైనా, శ్రీకాంత్‌ల మీదే ఉన్నాయి.

**ప్రపంచ బ్యాడ్మింటన్‌లో భారత పతకాలు**

| | |
|---|---|
| 1983 | ప్రకాశ్ పదుకొణె (కాంస్యం) |
| 2011 | జ్వాల-అశ్విని (కాంస్యం) |
| 2013 | సింధు (కాంస్యం) |
| 2014 | సింధు (కాంస్యం) |
| 2015 | సైనా (రజతం) |
| 2017 | సింధు (రజతం) |
| | సైనా (కాంస్యం) |
| 2018 | సింధు (రజతం) |

### సింధు.. మంచి ఛాన్సే!

రెండు రజతాలు, రెండు కాంస్యాలు.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సింధు ప్రదర్శన ఇది. ఒక భారత షట్లర్ ఇలాంటి ప్రదర్శన చేస్తుందని ఎవరూ కలలోనూ ఊహించి ఉండరు. సింధుకు స్వర్ణం గెలవడానికి 2017, 2018 టోర్నీల్లో మంచి అవకాశాలే వచ్చాయి. ఈ రెండుసార్లూ ఫైనల్లో గొప్పగా పోరాడింది హైదరాబాదీ అమ్మాయి. కానీ త్రుటిలో పసిడి చేజారింది. ఈ ఏడాది కచ్చితంగా పసిడి కల నెరవేర్చుకోవాలనే పట్టుదలతో సింధు బరిలోకి దిగుతోంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం ఒకట్రెండు టోర్నీలకు దూరంగా ఉండి గట్టిగా సన్నద్ధమైందామె. ఫిట్‌నెస్ మీద కూడా దృష్టిపెట్టింది. గత నెలలో ఇండోనేసియా ఓపెన్ రన్నరప్‌గా నిలిచి ఫామ్ చాటుకుంది.

### సైనా.. పుంజుకుంటుందా?



ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సైనా ఓ రజతం (2015), ఓ కాంస్యం (2017) నెగ్గింది. ఏడాదిగా సైనా ప్రదర్శన ఏమంత బాగా లేదు. నిరుడు కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో సత్తా చాటినా.. ఒక్క సూపర్ సిరీస్ టైటిలూ గెలవలేదు. గత ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ విఫలమైంది. ఈసారి టోర్నీలో మెరిసి తన స్థాయిని చాటిచెప్పాలని సైనా ఆశిస్తోంది. ఎనిమిదో సీడ్‌గా బరిలోకి దిగుతున్న సైనాకు సైతం తొలి రౌండ్లో బై లభించింది. రెండో రౌండ్లో ఆమె సబ్రినా (స్విట్జర్లాండ్) లేదా సొరయా డివిష్ (నెదర్లాండ్స్) ఎదురు కావచ్చు. తర్వాతి రౌండ్లో డెన్మార్క్ క్రీడాకారిణి మియా బ్లిచ్‌ఫెల్ట్‌ని ఢీకొట్టాల్సి రావచ్చు. క్వార్టర్స్‌లో చైనా క్రీడాకారిణి చెన్ యు ఫీ ఎదురుపడే అవకాశముంది. సెమీస్ చేరితే సింధుతోనే తలపడాల్సి రావచ్చు. మరి సైనా టోర్నీలో ఏమేరకు పుంజుకుంటుందో చూడాలి.

### శ్రీకాంత్.. సత్తా చాటాల్సిందే



రెండేళ్ల కిందట వరుస సూపర్ సిరీస్ టైటిళ్లతో అదరగొట్టిన కిదాంబి శ్రీకాంత్. . ఆ తర్వాత అంచనాల్ని అందుకోలేకపోయాడు. ఈ మాజీ ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు.. గత 22 నెలల్లో అతను ఒక్క సూపర్‌సిరీస్ టైటిల్ కూడా గెలవలేదు. దూకుడైన ఆటతో తనదైన రోజు ఎలాంటి ప్రత్యర్థినైనా ఓడించే శ్రీకాంత్.. తన స్థాయికి తగ్గ ఆట ఆడి చాలా కాలమైంది. మళ్లీ తనేంటో రుజువు చేసుకోవడానికి ప్రపంచ ఛాంపియన్‌షిప్ కంటే మంచి వేదిక మరొకటి ఉండదు. మోకాలి గాయం నుంచి కోలుకున్న శ్రీకాంత్.. గత ఏడాది లాగే తొలి రౌండ్లో గుయెన్ (ఐర్లాండ్)తో తలపడతాడు. టోర్నీలో అతను ఏడో సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు.

### వీళ్లు కూడా..

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇంకా చాలామందే భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్ తొలి రౌండ్లో జేసన్ ఆంటోనీ (కెనడా)తో తలపడతాడు. సమీర్ వర్మ.. చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ)తో, ప్రణయ్.. హీనో (ఫిన్లాండ్)తో తొలి మ్యాచ్‌లు ఆడతారు. పురుషుల డబుల్స్‌లో రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ గాయాల కారణంగా టోర్నీ నుంచి తప్పుకుంది. సుమీత్ రెడ్డి-మను అత్రి, ఎంఆర్ అర్జున్-రామచంద్రన్ శ్లోక్, అర్జున్ జార్జ్-సన్యమ్ శుక్లా జోడీలు కూడా బరిలో ఉన్నాయి. మహిళల డబుల్స్‌లో సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప, జక్కంపూడి మేఘన-పూర్విష, పూజ దండు-సంజన సంతోష్ జోడీలు ఆడుతున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి కూడా బరిలోకి దిగుతున్నారు.



## పుజారా సెంచరీ

**భారత్ 297/5 డిక్లేర్డ్**

### వెస్టిండీస్-ఎ 181 ఆలౌట్

కూలిడ్జ్ (ఆంటిగ్వా): వెస్టిండీస్-ఎతో మూడు రోజుల సన్నాహక మ్యాచ్‌లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. పుజారా (100 రిటైర్డ్ ఔట్) శతకం సాధించడంతో 297/5 వద్ద భారత్ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. విహారి 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. రిషబ్ పంత్ 33 పరుగులు చేశాడు. రెండో రోజు, ఆదివారం కడపటి వార్తలందేసరికి వెస్టిండీస్-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకే ఆలౌటైంది. ఇషాంత్ శర్మ, ఉమేశ్, కుల్‌దీప్ తలో మూడు వికెట్లు పడగొట్టారు. హాడ్జ్ 51 పరుగులు చేశాడు.

భారత్-ఎ తొలి ఇన్నింగ్స్: 297/5 (రాహుల్ 36; మయాంక్ అగర్వాల్ 12, పుజారా 100 రిటైర్డ్ నాటౌట్, రహానె 1, రోహిత్ శర్మ 68, విహారి 37 నాటౌట్, పంత్ 33; కార్టర్ 3/39); వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 181 (హాడ్జ్ 51, హామిల్టన్ 33; ఇషాంత్ 3/21, ఉమేశ్ 3/19, కుల్‌దీప్ 3/35)



## విరాట్ వెనుక 10.75 కోట్ల మంది

దిల్లీ: విరాట్ కోహ్లి.. ప్రస్తుతం ప్రపంచ అత్యుత్తమ బ్యాట్స్‌మన్. ఐసీసీ టెస్టు, వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అతడిదే అగ్రస్థానం. సామాజిక మాధ్యమాల్లో కూడా అతడికి తిరుగులేదు. ప్రపంచంలో అత్యధిక ఫాలోవర్లను కలిగి ఉన్న క్రికెటర్ అతనే. విరాట్ మూడు ప్రధాన సామాజిక మాధ్యమాల్లోనూ (ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) కనీసం 3 కోట్ల మంది చొప్పున ఫాలోవర్లను సంపాదించడం విశేషం. ఇటీవలే కోహ్లి ట్విటర్ ఫాలోవర్ల సంఖ్య 3 కోట్లను దాటింది. మొత్తంగా మూడు సామాజిక మాధ్యమాల్లో కలిపి 10.75 కోట్ల మంది కోహ్లిని అనుసరిస్తున్నారు. విరాట్ తర్వాత అత్యధిక మంది అనుసరిస్తున్నది సచిన్ తెందుల్కర్‌నే. సామాజిక మాధ్యమాల్లో సచిన్‌కు 7.55 కోట్ల మంది ఫాలోవర్లున్నారు.

కోట్లాలో విరాట్ స్టాండ్: టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి పేరును దిల్లీలోని ప్రఖ్యాత ఫిరోజ్ షా కోట్లా మైదానంలోని ఓ స్టాండ్‌కు పెట్టనున్నారు. ప్రపంచ క్రికెట్లో విరాట్ సాధించిన ఘనతల గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఈ నేపథ్యంలో గౌరవ సూచకంగా విరాట్ పేరును కోట్లాలోని ఓ స్టాండ్‌కు పెట్టాలని దిల్లీ క్రికెట్ సంఘం నిర్ణయించింది.



## కరుణరత్నె శతకం

### కివీస్‌పై లంక ఘన విజయం

గాలె: కెప్టెన్ దిముత్ కరుణరత్నె (122; 243 బంతుల్లో 6×4, 1×6) సెంచరీ సాధించడంతో న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో శ్రీలంక 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 268 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 133/0తో అయిదో రోజు, ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంకను కరుణరత్నె నడిపించాడు. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ తిరిమానె (64)తో పాటు కుశాల్ మెండిస్ (10) త్వరగా ఔటైనా.. మాథ్యూస్ (28 నాటౌట్)తో కలిసి అతను లంకను విజయం దిశగా తీసుకెళ్లాడు. సెంచరీ పూర్తయిన తర్వాత కరుణరత్నె వెనుదిరిగినా.. మాథ్యూస్, ధనంజయ డిసిల్వా (14 నాటౌట్) తోడుగా జట్టును గెలిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 249 పరుగులు చేయగా, లంక 267 పరుగులకు ఆలౌటైంది. కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 285 పరుగులకే పరిమితమైంది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో లంక 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టు గురువారం ప్రారంభం కానుంది.

## షెజాద్‌పై ఏడాది నిషేధం

కరాచి: అఫ్గానిస్థాన్ బ్యాట్స్‌మన్ మహ్మద్ షెజాద్‌పై ఏడాది నిషేధం పడింది. తమ దేశ క్రికెట్ నియమావళిని ఉల్లంఘించినందుకు ఈ వికెట్‌కీపర్‌ను 12 నెలలు ఏ ఫార్మాట్ ఆడకుండా సస్పెండ్ చేస్తున్నట్లు అఫ్గాన్ బోర్డు తెలిపింది. ప్రపంచకప్‌లో షెజాద్‌పై ఫిట్‌నెస్ కారణంతో బోర్డు వేటు వేయగా..తాను ఫిట్‌గా ఉన్నా తప్పించారని అతడు ఆరోపించాడు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00


LOVED IN 70 COUNTRIES
BAJAJ
THE WORLD'S FAVOURITE INDIAN
BAJAJ
అధిక ధరల నుండి స్వేచ్ఛ
సగర్వంగా మీ సవారీని తీసుకెళ్ళండి కేవలం ₹999/-* లకే.
డౌన్ పేమెంట్ ₹999/-* CT
డౌన్ పేమెంట్ ₹1 199/-* PLATINA
డౌన్ పేమెంట్ ₹4 999/-* Pulsar
లో డౌన్ పేమెంట్ సౌకర్యం Discover మరియు Avenger బైకుల పైన కూడా ఉంది. స్కీము 2019 ఆగస్టు 31 వరకు అమలులో ఉంటుంది.
Call 7219821111 | For Institutional / Bulk orders, please send an e-mail to corporatesales@bajajauto.co.in
*నియమ నిబంధనలు వర్తిస్తాయి. వివరాల కోసం సందర్శించండి www.bajajauto.com/999offer. ఎంపిక చేసిన ప్రదేశములలో మాత్రమే బజాజ్ ఆటో ఫైనాన్స్ ద్వారా CT, Platina, Pulsar 150, Discover మరియు Avenger మోడళ్ళ పైన ఈ స్కీము చెల్లుతుంది. సూచించిన మొత్తాలు వరుసగా CT, Platina మరియు Pulsar బైకులకు చెందిన కనీస డౌన్ పేమెంట్లు. ప్రొసెసింగ్ ఫీజు అదనం. ఫైనాన్స్ విషయంలో తుది నిర్ణయం ఫైనాన్సరుదే. ముందస్తు నోటీసు లేకుండా ఏదైనా ఆఫరును లేదా అన్ని ఆఫరులను సవరించడానికి లేదా ఉపసంహరించుకోవడానికి సర్వ హక్కులు బజాజ్ ఆటోకే చెంది ఉంటాయి.
BAJAJ FINANCE LTD - AF
Authorised Dealers For Bajaj Auto Ltd.: Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545, VENKAT BAJAJ 7989787161, 9246234234 • Nizamabad BIJAY BAJAJ 08462-234013, 234014, 8885671855, VIJAYA GANAPATHI AUTOMOTIVES 08462-238239, 9849590160 • Mancherial MAHI BAJAJ 08736-259088 9912278641 • Adilabad SRR MOTORS 9491249451, 9491159452, 2221966 • Warangal ANIKA BAJAJ 0870-2422299, 9885953888 • Hanamkonda SELECT BAJAJ 7702611220, 0870-6565205 • Nalgonda SANSAI BAJAJ 9160789555, 9160888876 • Miryalaguda SANSAI BAJAJ 9247020304, 9160059997 • Khammam VENKATRAMANA BAJAJ 9100266191, 9618378135 • Kothagudem SAI ANJANA BAJAJ 7799444544, 9912162299 • Mahboobnagar HAROON BAJAJ 08542-220060, 220070, 9010844457 • Gadwal SRI SAI BAJAJ 8886667721 • Siddipet TALWAR BAJAJ 7702015577. Authorised Service Centre: JAGITIAL 8522038460, 9949565692 SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849184700, 9849362096, MORTHAD 9959279313, ARMOOR 9959908353, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, BHEEMGAL 9030960100, ARMOOR 9848163064, RAMAGUDAM 9912278650, JANNARAM 9440004495, BELLAMPALLI 9849686258, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, NIRMAL 9010792792, THORRUR 9440874469, MAHABUBABAD 9949518874, 9063932333 MARRIPEDA 9908243623, KESAMUDRAM 9705580303, NARSAMPET 9346070143, MULUGU 7396336262, JANGAON 7702711220, STN GHANPUR 7702322110, PARKAL 7702922110, BHUPAL PALLY 8341027588, CHOUTUPAL 9290121333, BHONGIR 9247023637, MUNUGODE 9912996208, SURYAPET 8886936767, KODAD 9160079855 9848644441, THALLADA 9701802572, YELLANDU 9849869835, SATHUPALLI 9491924400, MADHIRA 8886888789, ENKURU 7732020146, ASWARAOPET 8367219219, WYRA 9052528181, NELAKONDAPALLI 9959691501, BHADRACHALAM 7799555355, PALAVANCHA 9848382500, MANUGURU 9440509779, WANAPARTHY 9010878618, KODANGAL 9010844470, KOTHAKOTA 9666211068, KALWAKURTHY 9010878619, SHADNAGAR 9010844462, NAGARKURNOOL 9666100050, Makthal 9640783999, PEBBAIR 9603926999, NARAYANPET 9108064786, ATHMAKUR 9010244473, KALLURU 9000380161, AMANGAL 8978934455, IEEJA 9989922894, SHANTINAGAR 9494767233, YERRAVALLI 9948276249, ALAMPUR 9849304403.


RENAULT
Passion for life
విస్తారమైన చోటు మునుపు ఎప్పుడూ లేనంత అందంగా.
Renault TRIBER
Space for everything
బుకింగ్స్ ఆరంభం
ఇన్నోవేషన్ 100+ సీటింగ్ కాంబినేషన్స్
RENAULT
అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ
కొత్త ఎనర్జీ ఇంజన్
TRIBER
30+ క్లాస్ లీడింగ్ ఫీచర్స్
సూపర్ స్పేషియస్ | అల్ట్రా మోడ్యులర్ | ఇండియాస్ ఫస్ట్
Scan with your phone camera to explore the TRIBER
Or visit triber.renault.co.in
Model/accessories shown may not be a part of the standard fitment. Due to printing limitation, the colour that appears in this advertisement may slightly differ from the actual print. Visit www.renault.co.in or contact the nearest dealership for more details.
SHOWROOMS: TELANGANA: KARIMNAGAR: RENAULT Karimnagar Mob: +91 9582305983. MAHBUBNAGAR: RENAULT Mahbubnagar Mob: +91 7799766431. NIRMAL: RENAULT Nirmal Mob: +91 8527232744. KHAMMAM: RENAULT Khammam Mob: +91 8527234093. SIDDIPET: RENAULT Siddipet Mob: +91 8527235114. MANCHERIAL: RENAULT Mancherial Mob: +91 9582571953. WARANGAL: RENAULT Warangal Mob: +91 9582230038.
L&K | SAATCHI & SAATCHI